



సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 272

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | KARIMNAGAR | MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సోమవారం 23-12-2019




## రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి గవర్నర్ విందు

**పాల్గొన్న హిమాచల్ గవర్నర్ దత్తాత్రేయ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, విపక్ష నేతలు**

**రెడ్‌క్రాస్ సొసైటీ యాప్‌ను ఆవిష్కరించిన కోవింద్**

- వివరాలు 2లో

ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఏర్పాటు చేసిన విందుకు విచ్చేసిన రాష్ట్రపతి కోవింద్ దంపతులు, ముఖ్యమంత్రి కేసీఆర్, హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్




## ఎదురులేని కోహ్లి సేన

### విండీస్‌పై వరుసగా 'పదో' సిరీస్ విజయం

విండీస్‌పై భారత్ 'పది'నెక్కింది. వన్డేల్లో దశాబ్దానికిపైగా కరీబియన్‌ను శాసిస్తున్న టీమిండియా ఖాతాలో మరో విజయం చేరింది. ఇన్నేళ్లలో ఏంచేసినా మ్యాచ్ గెలిచేందేమో కానీ సిరీస్ గెలవలేకపోయిన విండీస్ ఆదివారం 300 పైచిలుకు పరుగులు చేసినా... భారత్ జోరు ముందు నిలబెట్టుకోలేకపోయింది. ఆదివారం జరిగిన ఆఖరిపోరులో భారత్ కలిసి కట్టుగా కరీబియన్‌ను కొట్టేసింది. 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగులు చేసింది. పూరన్ (64 బంతుల్లో 89; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ పొలార్డ్ (51 బంతుల్లో 74 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. అనంతరం భారీ లక్ష్యాన్ని భారత్ 48.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 316 పరుగులు చేసి గెలిచింది.ఓపెనర్లు రోహిత్ (63 బంతుల్లో 63; 8 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ (89 బంతుల్లో 77; 8 ఫోర్లు, 1 సిక్స్) శుభారంభమిచ్చారు. కోహ్లి (81 బంతుల్లో 85; 9 ఫోర్లు) ఎప్పట్లాగే నాణ్యమైన ఆట ఆడగా... జడేజా, శార్దుల్ 'ఫినిషింగ్ టచ్' ఇచ్చారు.

- స్పోర్ట్స్‌లో

# ఎన్నార్సీపై చర్చించలేదు

**కేబినెట్, పార్లమెంట్లో ఆ విషయంపై చర్చ జరగలేదు**

**పౌరసత్వ సవరణ చట్టంతో ప్రమాదమేం లేదు**


**భారతీయ ముస్లింలకు ఈ చట్టంతో సంబంధం లేదు**

**విపక్షాలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి**

**ఈ చట్టాన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందే**

**ఢిల్లీ బహిరంగ సభలో ప్రధాని మోదీ**

5లో



"మా ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల్లో ఎందులోనూ మతం చూసి లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. మూడు పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులకు గురై భారత్ వచ్చిన వారికి పౌరసత్వ హక్కుల కల్పనకు ఉద్దేశించినదే పౌరసత్వ సవరణ చట్టం తప్ప ఇక్కడి వారి హక్కులను లాగేసుకునేది కాదు. భారతీయ ముస్లింలకు ఆ చట్టంతో ఏ సంబంధం లేదు. అభివృద్ధిలో నా ట్రాక్ రికార్డును చూడండి.. విపక్షాల టేప్ రికార్డులను వినొద్దు.

– ప్రధాని మోదీ

# మొహమాటాల్లేవ్!

## జనవరి 1 నుంచి పల్లె ప్రగతిపై ఆకస్మిక తనిఖీలు: సీఎం

- అలసత్వపు అధికారులు, సర్పంచ్‌లపై చర్యలు
- కఠిన చర్యల విషయంలో శషభిషలు ఉండవు
- ప్రజల్లో ఉన్నంత ఉత్సాహం అధికారులు, ప్రజాప్రతినిధుల్లో లేదు
- పదోన్నతులు, ఖాళీల భర్తీతో పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టపరిచాం
- ఇంకా పరిస్థితి మారకపోతే కలెక్టర్లు, ప్రజాప్రతినిధులదే బాధ్యత
- ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులతో తనిఖీ బృందాలు
- ఉన్నత స్థాయి సమీక్షలో సీఎం కేసీఆర్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: పల్లె ప్రగతి కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్ రంగంలోకి దిగనున్నాయని, పల్లెల్లో ప్రగతి కార్యక్రమాలు, నాణ్యతను ఈ బృందాలు ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రభుత్వానికి నివేదికలు అందిస్తాయని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. అలసత్వం వహించినట్లు తనిఖీల్లో రుజువైన అధికారులు, వంద శాతం పనిచేయని సర్పంచులపై తగు చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వానికి ఏ మాత్రం శషభిషలు కానీ.. మొహమాటాలు కానీ.. లేవని స్పష్టం చేశారు. ముఖ్యంగా అలసత్వం వహించినట్లు తేలిన అధికారులపై కఠిన చర్యలుంటాయన్నారు. పల్లె ప్రగతి కార్యక్రమ పురోగతిపై ఆదివారం ఆయన ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. పచ్చని, పరిశుభ్రమైన పల్లెల కోసం సెప్టెంబర్ మొదటివారంలో ప్రారంభించిన 30 రోజుల పల్లె ప్రగతి కార్యక్రమం జనాదరణ పొందిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఇందులో స్థానికులు భాగస్వామ్యం పంచుకోవడం శుభపరిణామమన్నారు. ప్రజలు చూపిస్తున్న ఉత్సాహాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు చూపించడం లేదని క్షేత్రస్థాయి నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. 100 శాతం ఫలితాల కోసం

మిగతా 2వ పేజీలో ▶

## జార్ఖండ్ ఫలితాలు నేడే

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 81 శాసనసభ స్థానాలకు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 20 వరకు అయిదు దశల్లో పోలింగ్ జరిగింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తొలి ఫలితం వెలువడే అవకాశాలున్నాయి.

- వివరాలు 5లో

# ఆర్ఎస్ఎస్ తెలంగాణ బాట

**రాష్ట్రంలో విస్తరించేందుకు పకడ్బందీ వ్యూహం**

- 2024కల్లా 10 వేల గ్రామాల్లో శాఖల ఏర్పాటే లక్ష్యంగా కసరత్తు
- కనీసం 5 లక్షల సభ్యత్వ నమోదు కోసం పక్కా ప్రణాళిక
- పర్యావరణ పరిరక్షణ సహా వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమాలు
- రేపట్నుంచి 3 రోజులపాటు హైదరాబాద్ శివార్లలో విజయ సంకల్ప శిబిరం
- కార్యకర్తలకు దిశానిర్దేశం చేయనున్న మోహన్ భాగవత్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో విస్తరించేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పకడ్బందీ వ్యూహంతో ముందుకు సాగుతోంది. 2024 నాటికి కనీసం 5 లక్షల సభ్యత్వాలతో రాష్ట్రంలో 10 వేల గ్రామాల్లో శాఖల ఏర్పాటే లక్ష్యంగా కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ ఉనికి కనిపిస్తున్నా మొత్తంగా చూస్తే మాత్రం నామ మాత్రంగానే ఉంది. హిందుత్వ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు తెలంగాణ అనువైన ప్రాంత మే అయినా ఇప్పటిదాకా తాము పెద్దగా పట్టించుకోలేదన్న భావనతో ఇప్పుడు పక్కా వ్యూహంతో రంగంలోకి దిగుతోంది. 2025కి ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి వందేళ్లు అవుతున్న సందర్భంగా దేశవ్యాప్తంగా తన ఉనికిని ఘనంగా చాటుకునే ప్రయత్నంలో ఉంది. ఇందులో భాగంగా ఈ నెల 24 నుంచి మూడు రోజులపాటు హైదరాబాద్ శివార్లలోని భారత్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో విజయ సంకల్ప శిబిరం పేరుతో సమాయత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతోంది. దీనికి ఆర్ఎస్ఎస్ అధిపతి మోహన్ భాగవత్ హాజరు కానున్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే దాదాపు ఏడున్నర వేల మంది కార్యకర్తలకు ఆయన దిశానిర్దేశం చేయనున్నారు.

**సామాజిక కార్యక్రమాలతో ప్రజల్లోకి....**

రాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినా

మిగతా 2వ పేజీలో ▶



ఆదివారం ముజఫర్‌పూర్‌లో సీఏఏకు అనుకూలంగా బీజేపీ కార్యకర్తల ర్యాలీ

## అది ముస్లిం సంస్థల పనే

- 'పౌర' అల్లర్ల వెనుక పీఎఫ్ఐ, సిమి ప్రమేయం: యూపీ సర్కార్
- లక్నో విమానాశ్రయంలో టీఎంసీ నేతల అడ్డగింత
- 'పౌర' చట్టం, ఎన్నార్సీలపై జైపూర్‌లో భారీ ర్యాలీ

- వివరాలు 5లో

# బొగ్గు స్కాంలో సీబీఐ దూకుడు

**ఉత్తర తెలంగాణ మాజీ ఎంపీల పాత్రపై ఆరా**

**ఒకరు మీడియా సంస్థ అధినేత, మరొకరు పారిశ్రామికవేత్త**

**బొగ్గు అక్రమ తరలింపుపై కీలక సమాచారం సేకరణ**

సాక్షి, హైదరాబాద్

బొగ్గు కుంభకోణంపై సీబీఐ దూకుడు పెంచింది. తెలంగాణ కేంద్రంగా ఉన్న సూర్యలక్ష్మీ కాటన్ మిల్స్ (ఎస్‌సీఎంఎల్) నాగ్‌పూర్‌లో పాల్పడ్డ బొగ్గు కుంభకోణంపై సీబీఐ ఆధారాల సేకరణలో దూసుకుపోతోంది. తమ కాటన్ మిల్లుకు ఇంధన సరఫరా అన్న కారణంతో ప్రభుత్వం నుంచి పొందిన బొగ్గును బయట మార్కెట్లో విక్రయించారన్న ఆరోపణలపై సీబీఐ ఇప్పటికే ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ మేరకు గత గురువారం సికింద్రాబాద్‌లోని సూర్యలక్ష్మి కాటన్‌మిల్స్ ప్రధాన కార్యాలయం, నాగ్‌పూర్‌లోని రాంటెక్‌లోని శాఖ కార్యాలయంపై ఏకకాలంలో దాడులు చేసిన సంగతి తెలిసిందే. సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ చైర్మన్ ఎల్.ఎన్ అగర్వాల్, ఎండీ పరితోశ్ అగర్వాల్‌పై చీటింగ్ కేసు నమోదు చేసింది. ఇదే సమయంలో ఇందులో డైరెక్టర్లుగా ఉన్న ఇద్దరు మాజీ ఎంపీల సమాచారం సేకరించిందని తెలిసింది.

**బహిరంగ మార్కెట్‌కు:** విశ్వసనీయ సమాచారం ప్రకారం తన కాటన్‌మిల్లు, మరో పవర్ ప్లాంటుకు బొగ్గు కోసమని సూర్యలక్ష్మీ కాటన్ మిల్స్.. వెస్టర్న్ కోల్ ఫీల్డ్‌తో ఒప్పందం చేసుకుంది. 2008లో 4,968 టన్నులకు ఒప్పందం కుదిరింది. అప్పుడెలాంటి అవకతవకలు లేవు. కానీ, 2014లో 1,30,000 టన్నులకు మరో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో 1,13,000 టన్నుల సరఫరాలో అక్రమలు జరిగాయని వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ అంతర్గత విచారణలో తేలింది. 2014–15లో 21,598.77, 2015–16లో 50,321.77 టన్నులు, 2016–17లో 58194.73 టన్నుల బొగ్గు వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ నుంచి సరఫరా అయింది. ఈ మొత్తం బొగ్గులో అధిక శాతాన్ని సూర్యలక్ష్మి కాటన్ మిల్స్ తన అవసరాలకు కాకుండా బయట మార్కెట్లో అక్రమంగా విక్రయించారన్నది వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ అంతర్గత విచారణతోపాటు, దానిపై నియమించిన ప్రత్యేక కమిటీ కూడా తేల్చింది. దీంతో వందల కోట్ల రూపాయలు అక్రమంగా ఆర్జించారని నివేదిక తేల్చినట్లు సమాచారం. ఆ సమయంలో

మిగతా 2వ పేజీలో ▶









ఇదంజగత్



పుస్తకం మొత్తం చదివి ఇప్పుడు వద్దంటే ఎలాగయ్యా!



**జిల్లాల వారీగా బొగ్గు నిల్వలు (మిలియన్ టన్నుల్లో)**

| | | |
|---|---|---|
| పెద్దపల్లి 2,025.69 | జయశంకర్ భూపాల్‌పల్లి 1,717.77 | ఖమ్మం 504.75 |
| కొమురంభీం ఆసిఫాబాద్ 630.34 | మంచిర్యాల 3,470.02 | భద్రాద్రి కొత్తగూడెం 2,801.26 |

# సింగరేణి తరగనినిధి!

- రాష్ట్రంలో వందేళ్లకు సరిపడా బొగ్గు నిల్వల గుర్తింపు
- 11,149 మిలియన్ టన్నులు గుర్తించిన సంస్థ
- ఇప్పటి వరకు వెలికి తీసింది 1,200 మిలియన్ టన్నులే
- గోదావరి పరీవాహక ప్రాంతంలో 15,600 కిలోమీటర్ల మేర బొగ్గు నిల్వలు

గోదావరిఖని

తెలంగాణ కొంగుబంగారం సింగరేణికి మరో వందేళ్ల భవిష్యత్ ఉందని ఆ సంస్థ అధికారులు పేర్కొంటున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో అపారమైన బొగ్గు నిక్షేపాల అన్వేషణతోపాటు వెలికితీతలో సింగరేణి సంస్థ ఇప్పటికే రికార్డుకెక్కింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సంస్థ ఏర్పడి సరిగ్గా నేటికి 130 ఏళ్లు అయ్యింది. ఈ ప్రస్థానంలో భూగర్భం నుంచి 1,200 మిలియన్ టన్నుల బొగ్గు వెలికితీయగా ఇంకా వందేళ్లకు సరిపడా 11,149 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు సంస్థ అన్వేషణ విభాగం గుర్తించింది. గోదావరి పరీవాహక ప్రాంతం వెంట 15,600 కిలోమీటర్ల మేర బొగ్గు నిల్వలు విస్తరించి ఉన్నాయని తెలిపింది. రాష్ట్రంలోని పెద్దపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జయశంకర్ భూపాల్‌పల్లి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో నల్ల బంగారం విస్తారంగా ఉన్నట్లు సింగరేణి గుర్తించింది.

**300 మీటర్ల లోతు వరకే...**

ఇప్పటి వరకు 300–600 మీటర్ల లోతులో ఉన్న బొగ్గు నిక్షేపాలు మాత్రమే అన్వేషణ విభాగం గుర్తించింది. 600–1,200 మీటర్ల లోతులో మరిన్ని బొగ్గు నిక్షేపాలున్నా అవి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టు (ఓసీపీ) ద్వారా తీసే అవకాశాలు లేవు. ఓసీపీ ద్వారా కేవలం 300 మీటర్ల లోతులో ఉన్న బొగ్గును మాత్రమే వెలికితీసే అవకాశముంది. రాబోయే రోజుల్లో అంతకన్నా ఎక్కువ లోతులో ఉన్న బొగ్గును వెలికితీయడం భూగర్భ బొగ్గు గనుల ద్వారానే సాధ్యమని భావిస్తున్నారు.

**గ్రేడ్‌ల వారీగా నిల్వలు..**

సింగరేణి సంస్థ నిర్ధారించిన బొగ్గు నిల్వల గ్రేడ్‌లు ఇలా ఉన్నాయి. జీ1–జీ3 వరకు 109.27 మిలియన్ టన్నులు, జీ4–జీ5లో 486.51 మిలియన్ టన్నులు, జీ–6లో 2,056.15 మిలియన్ టన్నులు, జీ7–జీ8లో 2,667.35 మిలియన్ టన్నులు, జీ9–జీ10లో 2,493.71 మిలియన్ టన్నులు, జీ11–జీ12లో 2,489.59 మిలియన్ టన్నులు,

మిగతా 2వ పేజీలో ▶



## గృహ రుణ బదిలీతో లాభమెంత?

- తీసుకున్న రుణం ఏ బెంచ్‌మార్క్ ఆధారితమో చూడాలి
- ప్రస్తుతం అమల్లో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానం.. కొత్త విధానంలో పారదర్శకత ఎక్కువ
- వడ్డీ రేట్ల బదిలీ వేగంగా ఉంటుంది.. పాత విధానంలో రేట్ల తగ్గింపు ప్రయోజనం తక్కువ

- ప్రాఫిట్ ప్లస్‌లో

## క్లుప్తంగా...

### మూడు రాజధానులకే నా మద్దతు

**శనివారం నాటి ప్రకటనకు నేను కట్టుబడి ఉన్నా: చిరంజీవి**



**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌కు మూడు రాజధానులపై ప్రభుత్వం చేసిన ప్రకటనకు తాను పూర్తి మద్దతు ఇస్తున్నానని సినీ నటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి ఆదివారం పునరుద్ఘాటించారు. మూడు రాజధానులకు మద్దతుగా చేసిన ప్రకటనకే తాను కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. చిరంజీవి పేరుతో శనివారం నాటి ప్రకటనకు భిన్నంగా తెల్ల కాగితంపై ఆదివారం మరో ప్రకటన సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. దీనిని ఖండిస్తూ చిరంజీవి వాయిస్ మెసేజ్‌ను విడుదల చేశారు. తెల్లకాగితంపై తన పేరిట వచ్చిన ప్రకటన అవాస్తవమని, ఫేక్ అని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన వాయిస్ మెసేజ్ కూడా ఇచ్చారు. ఆదివారం తెల్లకాగితంపై వచ్చిన ప్రెస్‌నోట్ తనది కాదని, అలాంటి ప్రకటన తానివ్వలేదని చిరంజీవి స్పష్టం చేశారు. మూడు రాజధానులకు మద్దతుగా చేసిన ప్రకటనకే తాను కట్టుబడి ఉన్నానని, ఫేక్ ప్రకటనను నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### నిజామాబాద్ కలెక్టర్‌గా నారాయణ్‌రెడ్డి

**సాక్షి, హైదరాబాద్:** ములుగు జిల్లా కలెక్టర్ నారాయణ్‌రెడ్డిని నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నిజామాబాద్‌కు కలెక్టర్‌గా ఉన్న ఎంఆర్ఎం రావును బదిలీ చేస్తున్నట్లు ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ వి.వెంకటేశ్వర్లుకు ములుగు జిల్లా కలెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు.

### విమానాల రాకపోకల్లో తీవ్ర అంతరాయం

**శంషాబాద్:** పొగమంచుతో శంషాబాద్ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆదివారం ఉదయం పలు విమానాలు నిర్ణీత సమయానికి గంట నుంచి 3 గంటలు ఆలస్యంగా నడిచాయి. చెన్నై, బెంగళూరు, వారణాసి, ఢిల్లీ, వడోదర, రాంచీ, ముంబై విమానాలు ఆలస్యంగా రాకపోకలు సాగించాయి. కోల్‌కతాకు ఉదయం 6 గంటలకు బయలుదేరాల్సిన ఎయిర్ ఇండి యా విమానం, కోయంబత్తూరు వెళ్లాల్సిన విమానాలను సాంకేతిక కారణాలతో అధికారులు రద్దు చేశారు. మైసూర్ మండకాలి ఎయిర్ పోర్టుకు వెళ్లాల్సిన విమానం సాంకేతిక కారణాలతో 6 గంటలు ఆలస్యంగా బయలుదేరింది.

### 'ఏడాదిన్నర దాటితే పదోన్నతి ఇవ్వాలి'

**సాక్షి, హైదరాబాద్:** పంచాయతీ కార్యదర్శుల్లో గ్రేడ్–2 కేటగిరీలో ఉన్న వారికి గ్రేడ్–1 పదోన్నతి ఇచ్చేందుకు ఏడాదిన్నర కాలాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని తెలంగాణ పంచాయతీ సెక్రెటరీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.మధుసూదన్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు అర్హతను సడలించాలన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది కార్యదర్శులు లబ్ధి పొందుతారని, విధి నిర్వహణలో మరింత ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. అదే విధంగా గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఏడాది సర్వీసు పూర్తికానప్పటికీ మండల పంచాయతీ అధికారులుగా పదోన్నతులు కల్పించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

### డెంటల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్లు..

- దంత వైద్యులకు శుభవార్త అందించిన వైద్య, ఆరోగ్య శాఖ

**సాక్షి, హైదరాబాద్:** ఇప్పటివరకు డెంటల్ ట్రిబ్యునల్‌లో తాత్కాలికంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న దంత వైద్యులకు శుభవార్త. ఇక నుంచి తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే సదుపాయాన్ని వైద్య, ఆరోగ్య శాఖ కల్పించింది. ఇటీవల జరిగిన తొలి డెంటల్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న డెంటల్ కౌన్సిల్ రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయింది. దీంతో తెలంగాణలో డెంటల్ డాక్టర్ల రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వం తాత్కాలికంగా ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది. ఇటీవలే తెలంగాణ డెంటల్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేస్తూ సర్కారు ఉత్తర్వులిచ్చింది. దీంతో దంత వైద్యులంతా ట్రిబ్యునల్ ద్వారా కాకుండా డెంటల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు లభించింది. ఎంబీబీఎస్ వైద్యులు మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటే డెంటల్ డాక్టర్లు డెంటల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. మెడికల్ కౌన్సిల్ లాగా ఇది పనిజేస్తుంది. ఇప్పటిదాకా ట్రిబ్యునల్ కార్యాలయం ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఉండేది. డెంటల్ కౌన్సిల్ ఏర్పాటు కావడంతో కోఠిలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంచాలకుల కార్యాలయ ప్రాంగణంలోకి మారనుంది. ఏపీకి కేటాయించిన భవనాలు ఖాళీగా ఉన్నాయి. వాటిలో ఒక భవనాన్ని డెంటల్ కౌన్సిల్‌కు కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇప్పటిదాకా ట్రిబ్యునల్‌లో 4,700 మంది దంత వైద్యులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారందరినీ కౌన్సిల్ పరిధిలోకి తీసుకువస్తారు.

# రాజ్‌భవన్‌లో రాష్ట్రపతికి గవర్నర్ విందు

**సాక్షి, హైదరాబాద్:**

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ గౌరవార్థం గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆదివారం రాజ్‌భవన్‌లో విందు ఏర్పాటు చేశారు. విందుకు విచ్చేసిన రాష్ట్రపతి కోవింద్ దంపతులకు గవర్నర్ తమిళిసై, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ రాజ్‌భవన్ ప్రవేశద్వారం వద్ద ఘన స్వాగతం పలికారు. రాష్ట్రపతి దంపతులు విందుకు హాజరైన అతిథులందరి వద్దకు వెళ్లి పరిచయం చేసుకున్నారు. తన ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన రాష్ట్రపతికి గవర్నర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

**రెడ్‌క్రాస్ సొసైటీ యాప్ ఆవిష్కరణ..**

తెలంగాణ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) మొబైల్ యాప్‌ను ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ఆవిష్కరించారు. ఈ యాప్‌ను ఏ భాషలోనైనా వినియోగించవచ్చని, ఏ రాష్ట్రమైనా అడాప్ట్ చేసుకోవచ్చని గవర్నర్ తెలిపారు. ఈ యాప్ విశేషాలను రాజ్‌భవన్ కార్యదర్శి సురేంద్ర మోహన్ వివరించారు. సభ్యత్వం కోసం రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదని, ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని తమ వివరాలను నమోదు చేస్తే సొసైటీ సభ్యత్వం లభిస్తుందని చెప్పారు. యాప్ నుంచే డిజిటల్ సంతకం చేసిన సభ్యత్వ ధ్రువీకరణ పత్రం పొందవచ్చని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో సమీపంలో ఉన్న రక్త నిధి కేంద్రాల వివరాలు, చిరునామా, ఫోన్ నంబర్, గూగుల్ రూట్ మ్యాప్ తదితర వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చని చెప్పారు. విందు ముగిసిన అనంతరం రాష్ట్రపతి కోవింద్ దంపతులకు తమిళిసై, కేసీఆర్‌లు రాజ్‌భవన్ నుంచి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి జి.కిషన్‌రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెలంగాణ టీడీపీ అధ్యక్షుడు ఎల్.రమణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహరుద్దీన్, రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్‌రెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ఉన్నతాధికారులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

**రెడ్‌క్రాస్ సొసైటీ యాప్‌ను ఆవిష్కరించిన రాష్ట్రపతి**



రాష్ట్రపతి కోవింద్‌కు నమస్కరిస్తున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ఆదివారం రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి కోవింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ బండారు దత్తాత్రేయ. చిత్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్

# సమగ్ర విచారణ జరపండి

**'బ్లాక్‌మార్కెట్‌కు బాలామృతం'పై మంత్రి సత్యవతి రాథోడ్ ఆగ్రహం**

- నివేదిక ఇవ్వాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శికి ఆదేశాలు
- అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన అధికారులు



కొత్తపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి తల్లితో మాట్లాడుతున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

**సాక్షి, హైదరాబాద్:** అంగన్‌వాడీల్లో చిన్నారులకు అందించే బాలామృతం పంపిణీలో అక్రమాలు జరుగుతున్న తీరుపై 'బ్లాక్‌మార్కెట్‌కు బాలామృతం' అనే శీర్షికతో ఆదివారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ స్పందించారు. చిన్నారులకు పంపిణీ చేసే బాలామృతం కవర్లు పొలాల్లో కుప్పలుగా దొరకడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. పంపిణీ ఎలా జరుగుతుందనే అంశంపై సంబంధిత అధికారులతో ఆరా తీశారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి జగదీశ్వర్‌ను ఆదేశించారు. దీంతో ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, రంగారెడ్డి జిల్లా సంక్షేమాధికారిని విచారణ అధికారులుగా ఆయన నియమించారు. బాలామృతం ప్యాకెట్లు పంపిణీ జరిగిన తీరు, వినియోగంపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ఆదేశించారు. రైతు పొలంలో కుప్పలుగా ఉన్న ప్యాకెట్లు ఎక్కడివో కూడా పరిశీలించాలన్నారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పంపిణీ, లబ్ధిదారులు, వినియోగం తదితర వివరాలు సమర్పించాలని ఆదేశించడంతో అధికారులు సైతం హుటాహుటిన విచారణ క్రమాన్ని మొదలుపెట్టారు. మరోవైపు బాలామృతం పంపిణీపై నిఘా ఏర్పాటు చేయాలని, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించే అవకాశం ఉంది.

**'బాలామృతం పక్కదారి'పై ఆరా**

**కేశంపేట:** 'బ్లాక్ మార్కెట్‌కు బాలామృతం' శీర్షికతో ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) సునంద, రంగారెడ్డి జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మోతీ తదితరులు రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కొత్తపేట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, బాలామృతంను పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులు బాలామృతంను సక్రమంగా తీసుకెళ్తున్నారా లేదా అని చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడి ఆరా తీశారు. పొలంలో పడేసిన బాలామృతం ఖాళీ ప్యాకెట్లను పరిశీలించారు. ఎవరైనా బాలామృతం ప్యాకెట్లను దుర్వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కొత్తపేట సర్పంచ్ కమ్మేకర్ నవీన్‌కుమార్, షాద్‌నగర్ ఐసీడీఎస్ సీడీపీఓ నాగమణి, సూపర్‌వైజర్లు పద్మ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

# సింగరేణి తర'గని'ది!

▶ మొదటి పేజీ తరువాయి

జీ13–జీ14లో 842.95 మిలియన్ టన్నులు, జీ15–జీ17 వరకు 4.30 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నట్లు గుర్తించింది.

**ఎంత లోతులో నిల్వలు..**

బొగ్గు నిల్వలు గ్రేడ్, లోతును బట్టి వాటి విలువను నిర్ధారిస్తారు. ప్రస్తుతం 300 మీటర్ల లోతులో వెలికితీస్తుండగా, రాబోయే రోజుల్లో 300 నుంచి 600 మీటర్లు, అలాగే 1,200 మీటర్లలోపు కూడా బొగ్గు నిక్షేపాలు ఉండే అవకాశాలున్నాయి. లోతుకు వెళ్తున్న కొద్దీ బొగ్గు నిల్వలు వెలికితీయడం భూగర్భ గనుల ద్వారా మాత్రమే సాధ్యమయ్యే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో కొత్త ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ఏర్పాటు ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం 300 మీటర్లలోపు 6,652.25 మిలియన్ టన్నులుండగా, 300 నుంచి 600 మీటర్లలోపు 4,182.49 మిలియన్ టన్నులు, 600 మీటర్ల పైన 315.09 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలున్నట్లుగా సంస్థ అన్వేషణ విభాగం నిర్ధారించింది.

**అన్వేషణతో ఆందోళన వద్దు..**



అన్వేషణ నుంచి గనులు ప్రారంభమయ్యే వరకు కనీసం పదేళ్లు పట్టే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం అన్వేషణ విభాగం పనులను ప్రజలు అడ్డుకుంటున్నారు. దీనివల్ల రాబోయే రోజుల్లో కొత్త గనుల ఏర్పాటుకు అడ్డంకి ఏర్పడవచ్చు. బొగ్గు నిల్వల అన్వేషణకు ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలి. – బండ్లమూడి శ్రీనివాస్, జీఎం, అన్వేషణ విభాగం

# ఉన్నత విద్యలో ఇంజనీర్లే ఎక్కువ

- ఉద్యోగార్హ నైపుణ్యాలు వారిలోనే అత్యధికం
- 2019లో మాత్రం ఎంబీఏలకే ఉద్యోగార్హ నైపుణ్యాలు ఎక్కువ
- ఇండియా స్కిల్ రిపోర్టు–2020లో వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** దేశవ్యాప్తంగా ఏటా ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు ఇంజనీరింగ్ (బీఈ/బీటెక్)లో ఎక్కువగా ఉండగా, ఉద్యోగానికి కావాల్సిన ప్రతిభ వారిలోనే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. 2019లోనూ సంఖ్యా పరంగా ఇంజనీరింగ్ విద్యార్థులే ఎక్కువగా ఉన్నప్పటికీ విచిత్రంగా ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాల విషయంలో వారు వెనుకబడిపోయారు. 2019లో ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు ఎంబీఏ విద్యార్థుల్లో ఎక్కువగా ఉన్నట్లు ఇండియా స్కిల్ రిపోర్టు–2020లో వెల్లడైంది. 2019 జూలై నుంచి నవంబర్ వరకు నేషనల్ ఎంప్లాయిబిలిటీ టెస్టు సర్వేను కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ సహకారంతో ది వీ బాక్స్ నిర్వహించింది. ఇండియా స్కిల్ రిపోర్టు–2020 పేరుతో ఆ నివేదికను ఇటీవల విడుదల చేసింది.

**సంఖ్య పెరిగింది.. నైపుణ్యం తగ్గింది..**

దేశంలోని 28 రాష్ట్రాలు, 9 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 3 లక్షల మంది విద్యార్థులను, వివిధ రంగాలకు చెందిన 150 కంపెనీలను కలిసి చేసిన సర్వే నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. 2018లో ఉన్నత విద్యను చదివే విద్యార్థుల్లో బీఈ/బీటెక్ వారు 23 శాతం ఉన్నారు. మిగతా వారంతా ఇతర కోర్సుల్లో ఉన్నారు. 2019కి వచ్చే సరికి ఉన్నత విద్యను చదివే విద్యార్థుల్లో ఇంజనీరింగ్ విద్యార్థుల సంఖ్య 31 శాతానికి పెరిగింది. అయినా ఉద్యోగానికి కావాల్సిన ప్రతిభ మాత్రం ఇంజనీరింగ్ చదివే వారిలో తక్కువ మందిలో ఉన్నట్లు తేలింది. 2018లో ఇంజనీరింగ్ విద్యార్థుల్లో 57.09 శాతం మందిలో ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు ఉన్నట్లు వెల్లడి కాగా, 2019లో మాత్రం ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు ఉన్న విద్యార్థుల సంఖ్య 49 శాతానికి పడిపోయింది. అంటే 8 శాతం తగ్గిపోయింది. ఇక 2018 సంవత్సరంలో ఉన్నత విద్యా కోర్సులు చదువుతున్న విద్యార్థుల్లో ఎంబీఏ విద్యార్థులు 13 శాతం ఉంటే, 2019లో వారి సంఖ్య 17 శాతానికి పెరిగింది. ఇక నైపుణ్యాల విషయానికి వస్తే 2018లో ఎంబీఏ ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు ఉన్న వారి సంఖ్య 36.44 శాతం ఉండగా 2019లో ఎంబీఏ విద్యార్థుల్లో ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు ఉన్న వారి సంఖ్య 54 శాతానికి పెరిగినట్లు తేల్చింది.

**కోర్సుల వారీగా విద్యార్థుల శాతం..**

| కోర్సు | 2014 | 2015 | 2016 | 2017 | 2018 | 2019 |
|---|---|---|---|---|---|---|
| ఇంజనీరింగ్ | 29 | 25 | 25 | 22 | 23 | 31 |
| మేనేజ్‌మెంట్ | 22 | 16 | 16 | 19 | 13 | 17 |
| డిగ్రీ | 23 | 23 | 23 | 24 | 22 | 26 |
| డిగ్రీ తత్సమాన | 6 | 8 | 6 | 14 | 12 | 8 |
| ఐటీఐ | 7 | 13 | 13 | 7 | 12 | 2 |
| పాలిటెక్నిక్ | 5 | 7 | 11 | 4 | 7 | 3 |
| పీజీ | 8 | 8 | 6 | 10 | 11 | 13 |

# ఆర్ఎస్ఎస్ తెలంగాణ బాట

▶ మొదటి పేజీ తరువాయి

సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం దాని ప్రత్యేకత. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. దీనిపై మోహన్ భగవత్ దిశానిర్దేశం చేయనున్నారు. ఐదు లక్షల సభ్యత్వాల్లో సగం విద్యార్థులవి ఉండేలా చూడనున్నారు. ఇందు కోసం వారిని ఆకట్టుకునే కార్యక్రమాలు కూడా చేపట్టాలని నిర్ణయించారు. సామాజిక అంశాలకు సంబంధించి పర్యావరణంపై ప్రధానంగా దృష్టి సారించారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, విరివిగా మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ప్రత్యేక దృష్టి సారించారు. సమ రసత కార్యక్రమం పేరుతో గ్రామాల్లో అన్ని కులాల వారు ఆలయ పూజల్లో పాల్గొనేలా చేయడంతోపాటు ఊరంతటికీ ఒకే శ్మశాన వాటిక ఉండేలా చూడాలన్నది ఆర్ఎస్ఎస్ ఆలోచన. ఇక గ్రామ వికాస కార్యక్రమాల పేరిట మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి రక్షణగా ఉండటం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోవుల వృద్ధిపై ముమ్మర ప్రచారం చేయనుంది. స్వయంగా కొన్ని కార్యక్రమాలను ఆర్ఎస్ఎస్ నిర్వహించనుంది. కుటుంబాల్లో కలతల నివారణ, వృద్ధుల ఆదరణ, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించే కార్యక్రమాలు కూడా చేపట్టనుంది. సోషల్ మీడియా అనర్థాలపై కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. తద్వారా ప్రజలకు చేరవయ్యేలా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ప్రయత్నించనున్నారు.

**రెండు దశాబ్దాల తర్వాత...**

ఉమ్మడి రాష్ట్రంలో 20 ఏళ్ల క్రితం ఆర్ఎస్ఎస్ స్థానికంగా ముఖ్య శిక్షక్, ఆపై కార్యకర్తలకు శిబిరాలు నిర్వహించింది. 1999లో కర్నూలు, కరీంనగర్‌లలో వాటిని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడే ఆర్ఎస్ఎస్ శిబిరాన్ని నిర్వహిస్తోంది. 2017లో కరీంనగర్‌లో సాధారణ శిబిరం, ఘట్‌కేసర్ సమీపంలో జాతీయ స్థాయి కార్యనిర్వాహక కమిటీ సమావేశాలు జరిగినా రాష్ట్రవ్యాప్త శిబిరం మాత్రం ఇప్పుడే జరగనుంది. రెండేళ్ల క్రితం రాష్ట్రంలో ఆర్ఎస్ఎస్‌కు 2,500 శాఖలు ఉండగా ఇప్పుడు వాటి సంఖ్య 3,200కు పెరిగింది. వాటిని 12 వేలకు పెంచాలనేది తాజా లక్ష్యం. శిబిరంలో భద్రాద్రి నగరం, యాదాద్రి నగరం, సమ్మక్క సారలమ్మ నగరం, జోగులాంబ నగరం, భాగ్యలక్ష్మి నగరం పేరుతో ఐదు విభాగాలు ఏర్పాటు చేశారు. వాటిల్లోనే కార్యకర్తలకు బస ఏర్పాటు చేశారు. 24న ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు సమావేశాలు ఉంటాయి. 25న ఉదయం సమావేశం తర్వాత కార్యకర్తలు నాలుగు మార్గాల్లో ఎల్‌బీ నగర్‌కు, అక్కడి నుంచి కవాతు ద్వారా సరూర్‌నగర్ మైదానానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మోహన్ భగవత్ ప్రసంగిస్తారు. మరుసటి రోజు కూడా ఆయన ప్రధాన వేదిక మీదుగా మరోసారి ప్రసంగించనున్నారు. ఈ సమావేశాలకు ఆర్ఎస్ఎస్ ప్రముఖులు శ్యామ్‌కుమార్, నాగరాజు, దూసి రామకృష్ణ, తిప్పేస్వామి, దక్షిణామూర్తి, కాచం రమేశ్, దేవేందర్ తదితరులు హాజరుకానున్నారు.

# బొగ్గు స్కాంలో సీబీఐ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

వీరికి రాజకీయంగా పలువురు సహకరించారని సీబీఐ అధికారులు అనుమానిస్తున్నారు. ఈ సంస్థలో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో ఇద్దరు తెలంగాణకు చెందిన రాజకీయ నాయకులు ఉండటమే ఇందుకు కారణం.

**ఇద్దరూ ఉత్తర తెలంగాణ ఎంపీలే..!**

బొగ్గు కుంభకోణంలో వందల కోట్ల రూపాయలు కేంద్రానికి నష్టం వాటిల్లిందని సమాచారం. ఈ కుంభకోణంలో రాజకీయ జోక్యంపైనా సీబీఐ నజర్ పెట్టిందని తెలిసింది. సూర్యలక్ష్మి కాటన్ మిల్స్‌లో బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లలో చైర్మన్, ఎండీతో కలిపి మొత్తం 9 మంది ఉన్నారు. వీరిలో ఇద్దరు మాజీ ఎంపీలు కావడం గమనార్హం. అందులో ఒకరు ఉమ్మడి కరీంనగర్, మరొకరు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పార్లమెంట్ సభ్యులుగా ప్రాతినిధ్యం వహించారు. వీరిద్దరూ ఢిల్లీ నుంచి గల్లీ దాకా పారిశ్రామికంగా, రాజకీయంగా బాగా పలుకుబడి ఉన్నవారు. వీరిలో ఒకరికి పలు పరిశ్రమలతోపాటు మీడియా సంస్థలు కూడా ఉన్నాయి. మరొకరు రాజధానిలోని ఒక రేస్‌క్లబ్‌తోపాటు, ఓ బ్యాంకుకు చైర్మన్‌గా వ్యవహరించారు.

**వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ ఉద్యోగులపైనా..!**

వేల టన్నుల బొగ్గును సూర్యలక్ష్మి కాటన్ మిల్స్‌కు తరలించడంలో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్‌లో ఉన్నత స్థాయి నుంచి కిందిస్థాయి దాకా పలువురు ఉద్యోగులు సహకరించారని సీబీఐ గుర్తించింది. ఈ జాబితా చాంతాడంత ఉండటంతో ప్రస్తుతానికి గుర్తు తెలియని వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ ఉద్యోగులు అని ఎఫ్ఐఆర్‌లో పేర్కొంది. ప్రస్తుతం సీబీఐ అధికారులు 2014 నుంచి 2017 వరకు పలువురు ఉద్యోగుల బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు, కొనుగోలు చేసిన ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారని తెలిసింది. ఇందుకు సంబంధించి సీబీఐ అధికారులు కీలక సమాచారం సేకరించినట్లు సమాచారం. ఎవరి ఆదేశాలు, ప్రలోభాలతో వెస్టర్న్ కోల్‌ఫీల్డ్ ఉద్యోగులు ఇలా చేసారన్నది సీబీఐ ఆరా తీస్తోంది.

# మొహమాటాల్లేవ్!

▶ మొదటి పేజీ తరువాయి

తనిఖీలు చేపట్టి, ఆ తర్వాత దిద్దుబాటు చర్యలు తీసుకోవచ్చన్నారు. దీనిలో భాగంగానే ఫ్లయింగ్ స్క్వాడ్స్ ఏర్పాటు చేసి పనితీరు మెరుగుపరుచుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల మీద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఎవరినీ ఇబ్బంది పెట్టడానికి కాదు..**

'పల్లెలను బాగుచేసుకోవడం కన్నా మించిన పని ప్రభుత్వానికి లేదు. అధికారుల మీద ప్రజాప్రతినిధుల మీద విశ్వాసంతోనే, వారికి కావాల్సినంత సమయాన్ని ఇచ్చినం. అందుకే తనిఖీల కోసం ఆత్రపడలేదు. అయితే ఇప్పుడు ఆ సమయం ఆసన్నమైందని భావిస్తున్నం. జనవరి 1నుంచి పల్లె ప్రగతి తనిఖీలు ప్రారంభించనున్నం'అని సీఎం వివరించారు.

**మారకపోతే వారిదే బాధ్యత..**

'పంచాయతీరాజ్ శాఖలో అన్ని స్థాయిల ఉద్యోగులకు వారు ఊహించని విధంగా పదోన్నతులు ఇచ్చాం. గ్రామ కార్యదర్శుల నియామకం చేపట్టడం నుంచి.. ఎంపీడీవో, డీఎల్పీవో, డీపీవో, జిల్లా పరిషత్ సీఈవో, డిప్యూటీ సీఈవో అన్ని స్థాయిల్లో వ్యవస్థను పటిష్టపరిచి, శాఖను బలోపేతం చేశాం. అలాగే పల్లె ప్రగతిలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం.. పంచాయతీలకు ప్రతినెలా రూ.339 కోట్లను టంచనుగా ప్రభుత్వం విడుదల చేస్తోంది. పల్లెను అభివృద్ధిపథంలో నడిపించేలా జిల్లా కలెక్టర్లను నిరంతరం అప్రమత్తం చేస్తూ తగు సూచనలు ఇస్తున్నం. పంచాయతీరాజ్ చట్టంలో కూడా కలెక్టర్లకు ఆ మేరకు అధికారాలిచ్చాం. పచ్చదనం, పరిశుభ్రతను మెరుగుపరిచేందుకు గ్రామస్థాయి లో పని వ్యవస్థలను కూడా పటిష్టం చేసినం. పంచాయతీ కార్మికుల జీతాలు కూడా పెంచినం. ఇన్ని చర్యలు తీసుకున్నాక కూడా పల్లెల్లో ప్రగతి అనుకున్నట్లు ముందుకు పోకపోతే అది కలెక్టర్లు, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులదే బాధ్యత' అని స్పష్టం చేశారు.

**పనితీరుకు ఓ పరీక్ష...**

'ఈ తనిఖీల ద్వారా పల్లె ప్రగతిలో అధికారులు, ప్రజాప్రతినిధుల చిత్తశుద్ధిని వారి శక్తి సామర్థ్యాలను ప్రభుత్వం అంచనా వేస్తుంది. పలు రకాల తోడ్పాటు ఇచ్చినంక కూడా గ్రామాలు బాగుపడకపోతే ఇక జీవితంలో అవి బాగుపడవు. అలా కావడానికి వీల్లేదు'అని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. గ్రామాలన్నీ అద్దంలా తీర్చిదిద్దేవరకు ఎట్టి పరిస్థితిల్లో ప్రభుత్వం విశ్రమించదని చెప్పారు. అత్యవసర పనిమీద బెంగళూరు వెళ్లవలసిన పంచాయతీరాజ్ కమిష నర్ రఘునందన్ రావు ప్రయాణాన్ని వాయిదా వేయించి మరీ సమావేశాన్ని నిర్వహిస్తున్నం అంటే, పల్లె ప్రగతిపై ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉందో చేసుకోవాలె అని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షలో పంచాయతీ రాజ్ కమిషనర్ రఘు నందన్ రావు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి అరవింద్ కుమార్, డైరెక్టర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



ప్రగతిభవన్‌లో ఆదివారం పల్లెప్రగతిపై సమీక్షిస్తున్న సీఎం కేసీఆర్

**గోప్యంగా తనిఖీలు...**

'ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, మూడు క్యాడర్ల నుంచి ఉన్నతాధికారులను నియమించి తనిఖీ వ్యవస్థను ఏర్పాటు చేస్తం. ప్రతి అధికారికి ర్యాం డమ్ విధానంలో వివిధ జిల్లాల్లోని 12 మండలాల చొప్పున ఆకస్మిక తనిఖీల బాధ్యత అప్పగిస్తం. ఎవరికి ఏ మండలాన్ని అప్పగిస్తామనేది ప్రభుత్వం గోప్యంగా ఉంచుతుంది. ఆకస్మికంగా విడతల వారీగా నిర్వహించే తనిఖీల ద్వారా పల్లె పురోగతి క్రాస్ చెక్ అవుతుంది. తద్వరా ప్రభుత్వానికి సరైన సూచనలు, సలహాలు అందుతా యని'సీఎం అన్నారు.

### మూడేళ్లుగా యువతి శరీరంలో బుల్లెట్!

**హైదరాబాద్:** వెన్నునొప్పి చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లిన ఓ యువతి శరీరంలో బుల్లెట్ బయటపడటం నిమ్స్ ఆస్పత్రిలో కలకలం రేపింది. వివరాలు.. ఫలక్‌నుమా జహ్నుమా ప్రాంతంలో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి కుమార్తె (18) స్థానికంగా కుట్టుమిషన్ పనిచేస్తోంది. 3 నెలలుగా వెన్నునొప్పితో బాధపడుతుండటంతో చికిత్స కోసం ఆమె నిమ్స్‌లో చేరింది. వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించి వెన్నుపూస, ఉదరకోశం భాగంలో గాయమున్నట్లు గుర్తించారు. సదరు యువతికి శస్త్ర చికిత్స నిర్వహించగా బుల్లెట్ బయటపడింది. దీంతో కంగుతిన్న వైద్యులు బుల్లెట్ ఎక్కడ నుంచి వచ్చిందని యువతి కుటుంబసభ్యులను ప్రశ్నించగా వారు తెలియదని సమాధానమిచ్చారు. యువతి శరీరంలో బుల్లెట్ రెండు, మూడేళ్ల క్రితం నుంచి ఉన్నట్లుగా వైద్యులు భావిస్తున్నారు. దీనిపై నిమ్స్ ఉన్నతాధికారులు పంజగుట్ట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకుని.. ఫలక్‌నుమా పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు ఈ విషయంపై దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా మల్లన్న కల్యాణం

- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి హరీశ్‌రావు
- కాళేశ్వరం నుంచి కొమురవెల్లి వరకు గోదావరి జలాలు
- ఆ జలాలతో మల్లన్నకు పాదాభిషేకం చేస్తాం

**కొమురవెల్లి (సిద్దిపేట)/ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట):** సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న కల్యాణం వైభవంగా జరిగింది. స్వామి వారి కల్యాణ వేడుకలను ఆదివారం వీరశైవ ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. శ్రీమల్లికార్జున స్వామికి, బలిజ మేడాలమ్మ, గొల్లకేతమ్మ అమ్మవార్లకు మహాదేవుని వంశస్తులు పట్టు వస్త్రాలు, పుస్తెమెట్టెలు, ముత్యాల తలంబ్రాలు తీసుకురాగా.. ఒడి బియ్యాన్ని పడిగన్నగారి వంశస్తులు తీసుకొచ్చారు. ఉదయం 11.47 గంటలకు మల్లన్న తోటబావి వద్ద స్వామివారి కల్యాణాన్ని తమ్మెకూరు పీఠాధిపతి శ్రీ శివానంద శివాచార్య మహాస్వామీజీ పర్యవేక్షణలో నిర్వహించారు. కొమురవెల్లి మల్లన్న కల్యాణ మహోత్సవానికి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలను అందించారు. ఈ వేడుకలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి సుమారు 50 వేల మంది భక్తులు హాజరయ్యారు. అనంతరం కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డితో కలసి హరీశ్‌రావు విలేకరులతో మట్లాడారు. మల్లన్న ఆలయం 500 ఏళ్ల క్రితం ఏర్పడిందని, రాష్ట్రం ఏర్పడ్డాక ఆలయానికి రూ.30 కోట్ల నిధులు కేటాయించి సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారన్నారు. తెలంగాణ జాతరకు అసలు సిసలు రూపం కొమురవెల్లి జాతరగా పేర్కొన్నారు.

**కల్యాణానికి రావడం సంతోషంగా ఉంది..**

రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టారని, గోదావరి జలాలతో కాళేశ్వరంలోని త్రిలింగేశ్వరాలయానికి జలాభిషేకం చేసి అవే జలాలతో కొమురవెల్లిలోని మల్లికార్జున స్వామి పాదాలకు అభిషేకం చేసే రోజులు దగ్గర్లో ఉన్నాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. కేసీఆర్‌కు రాష్ట్ర ఆలయాలు, దేవతలు అంటే ఇష్టమని, అందుకు అనుగుణంగానే ప్రాజెక్టులకు దేవుళ్ల పేర్లయిన మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ పేర్లతో ప్రాజెక్టులు నిర్మిస్తున్నారన్నారు. కొమురవెల్లి ఆలయంలో పట్నం వేసి, బోనం సమర్పించి జగ్గు కొట్టి పిలిస్తే వచ్చే తండ్రి మల్లన్నగా అభివర్ణించారు. స్వామివారి కల్యాణానికి రావడం చాలా సంతోషంగా ఉందని మంత్రి పేర్కొన్నారు.



స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి హరీశ్‌రావు



స్వామి వారి కల్యాణ వేడుకలో మంగళసూత్రధారణ దృశ్యం



## ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టిన రైతులు

### కొనుగోలు చేయడం లేదని ఆందోళన

**శాయంపేట:** ఐకేపీ కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లలో తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆగ్రహంతో వరంగల్ రూరల్ జిల్లాలో కొందరు రైతులు ధాన్యం బస్తాలను తగుల బెట్టారు. శాయంపేట మండలం ప్రగతి సింగారంలో ఆదివారం ఈ సంఘటన చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన పలువురు రైతులు ప్రభుత్వం సబ్సిడీపై అందించిన 1075, 1070 రకం వరి సాగుచేశారు. అయితే కష్టపడి పండించిన పంటను అమ్మకానికి తెస్తే ఐకేపీ కొనుగోలు కేంద్రాలు, అలాగే మిల్లర్లు కొనుగోలు చేయడం లేదని, ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు చెప్పినా వారు పట్టించుకోవడం లేదని బాధిత రైతులు వాపోయారు. పంట చేతికి వచ్చి నెల రోజులు కావస్తున్నా కొనుగోలు చేయడంలేదని, గ్రామంలో ఐదువేల బస్తాల వరకు ధాన్యం పేరుకుపోయిందని చెప్పారు. తక్షణమే తమ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.



పుస్తకావిష్కరణ చేస్తున్న సాహితీ ప్రముఖులు

## తెలంగాణ ఆత్మకు ప్రతిబింబం 'రివాజు'

- కేయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య
- కథల సంకలనం 'రివాజు' ఆవిష్కరణ

**హన్మకొండ కల్చరల్ :** తెలంగాణ ఆత్మను ప్రతిబింబించిన కథలు 'రివాజు'సంకలనంలో ఉన్నాయని ప్రముఖ కవి, విమర్శకులు, కేయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని శ్రీరాజరాజనరేంద్రాంధ్ర భాషా నిలయంలో సింగిడి తెలంగాణ రచయితల సంఘం వెలువరించిన తెలంగాణ కథల సంపుటి 'రివాజు'ను ఆదివారం ఆవిష్కరించారు. సాహితీవేత్త గన్నమరాజు గిరిజామనోహర్‌బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అయిలయ్య మాట్లాడుతూ ఇందులోని కథలు వర్తమాన సమాజంలోని బీభత్సాన్ని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత జరుగుతున్న అభివృద్ధిని ప్రతిఫలించాయని అన్నారు. 2013 నుంచి ప్రతి సంవత్సరం తెలంగాణ కథల సంపుటాలను వెలువరిస్తున్న సంపాదకులు అభినందనీయులని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేయూ విశ్రాంతాచార్యులు డాక్టర్ కేతవరపు కాత్యాయనీ విద్మహే మాట్లాడుతూ అసమానతల వల్ల తెలంగాణ సమాజం చాలా కోల్పోయిందని, వర్తమాన తెలంగాణ సమాజంలో అన్నిరకాల అసమానతలను గుర్తించే రచనలు రావాలని అన్నారు. గిరిజామనోహర్ మాట్లాడుతూ వర్తమాన కవులు, రచయితలు తమ కథల ద్వారా తెలంగాణ స్థితిగతులను, మానవీయ కోణాలను వెలికి తీస్తున్నారని చెప్పారు. అన్వర్ మాట్లాడుతూ సామాజిక బాధ్యతల పట్ల దూరంగా ఉంటున్న మనిషిని ఈ కథలు ఆవిష్కరించాయని అన్నారు. పుస్తక సమీక్ష చేసిన వంగాల సంపత్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త కథకులు చాలా మంచికథలు రాశారని పేర్కొన్నారు. సంగిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ వరంగల్‌లో పుస్తకావిష్కరణ నిర్వహించడం స్ఫూర్తిదాయకంగా ఉందని తెలిపారు. వందల కథల్లోంచి 13 కథలను మాత్రం ఎంపిక చేసి ప్రచురించామని సింగిడి ప్రతినిధులు తెలిపారు. సంకలనంలోని కథల రచయితలు రామా చంద్రమౌళి, పూడూరి రాజిరెడ్డి, వి.మల్లికార్జున్, చందు తులసి ప్రసంగించారు.

## అవగాహనతో కేన్సర్‌ను జయించవచ్చు!

- మంత్రి కొప్పుల ఈశ్వర్
- గోదావరిఖని సర్కారు ఆస్పత్రిలో

కేన్సర్ నిర్ధారణ పరీక్షల కేంద్రం ఏర్పాటు

**కోల్‌సిటీ(రామగుండం):** కేన్సర్ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉంటే, ఈ వ్యాధిని జయించవచ్చని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'కేన్సర్ వ్యాధి నిర్ధారణ ఉచిత పరీక్షల కేంద్రం'ను ఆదివారం ఆయన రామగుండం ఎమ్మెల్యే, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కోరుకంటి చందర్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కొరవడిందని, ఈ తరుణంలో విజయమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన ఎమ్మెల్యేకు రావడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా గోదావరిఖని ప్రభుత్వాస్పత్రిలో దీనిని ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో కూడా ఉచిత కేన్సర్ వ్యాధి నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేసేలా వైద్యశాఖ మంత్రి ఈటల రాజేందర్‌తో చర్చిస్తామని మంత్రి తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల ద్వారా కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించవచ్చని, వైద్య చికిత్సలు, జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని అన్నారు. ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ.. ప్రపంచాన్ని కుదిపేస్తున్న కేన్సర్ వ్యాధిని మొదటిదశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చన్నారు. ప్రజలు ఈ కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




స్వామి దర్శనం కోసం బాలాలయం నుంచి బయట వరకు బారులుదీరిన భక్తులు

## 'యాదాద్రి'లో భక్తుల రద్దీ

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం, ఏకాదశి, ధనుర్మాసోత్సవాలతోపాటు సెలవు దినం కావడంతో హైదరాబాద్ జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ధర్మదర్శనం క్యూలైన్లన్నీ నిండిపోయి భక్తులు ఆలయ వీధుల్లోకి బారులుదీరారు. సుమారు 30 వేల మంది స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మదర్శనానికి నాలుగు గంటలు, శీఘ్ర, అతి శీఘ్ర దర్శనానికి రెండు గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా తిరుప్పావై పర్వాలు విశేషంగా నిర్వహించారు. ఏకాదశి సందర్భంగా లక్ష పుష్పార్చన, స్వాతి నక్షత్రం సందర్భంగా శతఘటాభిషేక పూజలు గావించారు. భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు.

**ప్రహ్లాద చరిత్ర ఘట్టాల పనులు..**

ఆలయ పునర్నిర్మాణ పనుల్లో భాగంగా ప్రధానాలయ మహా మండపంలోని గోడలకు పంచలోహాలతో తయారు చేసిన ప్రహ్లాద చరిత్రకు సంబంధించిన మొదటి ప్యానల్ బిగించగా.. రెండో ప్యానల్‌ను ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. పది ఘట్టాల్లో తొలి ప్యానల్ పూర్తయింది. అంతేకాకుండా మహా మండపంలోని పైభాగం సీలింగ్‌కు రాజస్తాన్ నుంచి తెచ్చిన జీఆర్సీ పద్మాలను అమర్చుతున్నారు.



ప్రధానాలయ మహామండపంలో ఏర్పాటు చేసిన ప్రహ్లాద చరిత్రలోని మొదటి ప్యానల్

## క్లుప్తంగా...

### రైతు కోఆర్డినేటర్లకు అధికారాలు..

**మంత్రి ఎర్రబెల్లి**



**కాజీపేట అర్బన్:** రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్లకు కొన్ని అధికారాలు కల్పించేందుకు సీఎం కేసీఆర్ త్వరలో అసెంబ్లీలో బిల్లు పెట్టనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షుడిగా నియమితులైన పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఆదివారం స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షతన హన్మకొండలో ఆత్మీయ సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ.. గ్రామ, మండల రైతు సమన్వయ సమితులను బలోపేతం చేసేందుకు అధికారాలతో పాటు గౌరవ వేతనం అందించేందుకు సీఎం ఆలోచిస్తున్నారని పేర్కొన్నారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లుకు టీఆర్‌ఎస్ పార్టీలో ప్రత్యేక స్థానం ఉందని, ఉద్యమాన్ని ఉవ్వెత్తున రేపిన చరిత్ర ఈ జిల్లా సొంతమని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రాబోయే ఆరు నెలల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 65 లక్షల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్, చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, శంకర్‌నాయక్, అరూరి రమేశ్, చల్లా ధర్మారెడ్డి, గండ్ర రమణారెడ్డి, జెడ్పీ చైర్మన్లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, 'కుడా'చైర్మన్ మర్రి యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు స్వీకరించిన 'తానా' కార్యవర్గం

**కాశీబుగ్గ:** తెలంగాణ ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (తానా) రాష్ట్ర నూతన కార్యవర్గం ఆదివారం బాధ్యతలు స్వీకరించింది. వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్‌ఆర్‌ఐ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన తానా సదస్సులో రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ కె.అశోక్‌రెడ్డి (వరంగల్), కార్యదర్శిగా డాక్టర్ మోహన్ గుప్తా (హైదరాబాద్), కోశాధికారిగా డాక్టర్ లింగారావు, ఉపాధ్యక్షులుగా డాక్టర్ వి.రాకేష్, డాక్టర్ సురేష్‌గౌడ్, జాయింట్ సెక్రెటరీగా డాక్టర్ జె.సుధాకర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. వీరు ఏడాది పాటు పదవిలో ఉంటారు. అలాగే రానున్న సంవత్సరానికి ఎన్నికలు నిర్వహించగా డాక్టర్ కిషన్‌రావు గెలుపొందారు. ఆయన 2020–21 సంవత్సరానికి తానా అధ్యక్షుడిగా కొనసాగుతారు. కార్యక్రమానికి మంత్రులు ఈటల రాజేందర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరయ్యారు.

### కుక్కే కదా అని కాల్చేశాడు

**సాక్షి, హైదరాబాద్:** రోజూ మొరుగుతూ ఇబ్బంది పెడుతుందన్న కారణంతో బర్రెల షెడ్డులో కాపలాగా ఉంటున్న కుక్కను ఓ వ్యక్తి ఎయిర్‌గన్‌తో కాల్చి చంపిన ఘటన సరూర్‌నగర్ ఠాణా పరిధిలోని బాపూ కాలనీలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎడమ భుజంలోకి బుల్లెట్ దూసుకెళ్లడంతో కుక్క అక్కడికక్కడే చనిపోయింది. వివరాలు.. రాజు, దేవేందర్, సుదర్శన్ ముగ్గురు అన్నదమ్ములు కలసి ఓల్డ్ సరూర్‌నగర్ చౌడీ వద్ద బర్రెల షెడ్డును నిర్వహిస్తున్నారు. ఈ షెడ్డులో జాకీ అనే కుక్క కాపలాగా ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఆ షెడ్డు నుంచి బయటకు వచ్చిన కుక్క.. బాపూ కాలనీలోని బ్యాంక్ ఉద్యోగి అవినాశ్ కరణ్ ఇంటికి వెళ్లింది. దీంతో అతడు తన వద్ద ఉన్న ఎయిర్‌గన్‌తో కాల్చడంతో అక్కడికక్కడే చనిపోయింది. దీంతో కుక్కను పెంచుకుంటున్న యజమానులు సరూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# బిల్లులు కట్టలేదని కరెంట్ కట్

- ఎండుతున్న వరి మడులు
- ట్యాంకర్లతో నీరు పెడుతున్న రైతులు

**హత్నూర (సంగారెడ్డి):** బిల్లులు చెల్లించలేదంటూ అధికారులు కరెంట్ కట్ చేశారు. దీంతో రెండు మూడ్రోజులుగా వరి మడులు ఎండిపోతున్న ఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం నస్తీపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. విద్యుత్ బకాయి బిల్లులు చెల్లించడం లేదని నాలుగు రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు గ్రామ శివారులోని వ్యవసాయ బోర్లకు కరెంట్ సరఫరా అయ్యే ట్రాన్స్‌ఫార్మర్లను బంద్ చేశారు. దీంతో రైతులు వేసిన వరి నారు మడుల్లోనే ఎండిపోతోంది. దీంతో కొంతమంది రైతులు వరి నారు కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నారు మడిలో నీరు పెట్టిన దృశ్యం ఆదివారం కనిపించింది. కరెంట్ సరఫరా లేకపోవడంతో నీరు లేక నారు మడులు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

**నామమాత్రపు బిల్లు చెల్లించాలి..**

'రైతులకు ప్రభుత్వం ఉచిత కరెంట్ అందిస్తున్నా.. నామమాత్రపు బిల్లు కింద నెలకు రూ.30 చెల్లించాల్సి ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా ఈ బిల్లును రైతులు చెల్లించడం లేదు. అందుకే విద్యుత్ సరఫరా నిలిపివేశాం'అని ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. విద్యుత్ బిల్లులు చెల్లించమని అడిగితే రైతులు పట్టించుకోవడం లేదన్నారు. బిల్లులు చెల్లిసే సరఫరా పునరుద్ధరిస్తామని పేర్కొన్నారు.



హత్నూర మండలం నస్తీపూర్ గ్రామ శివారులో ఎండిపోతున్న వరి నారుమడికి ట్యాంకర్ ద్వారా నీరు పెడుతున్న దృశ్యం

## కాజీపేటలో వ్యక్తి హత్య

- వివాహేతర సంబంధంపై అనుమానంతో దాడి
- భవనంపై నుంచి పడినట్టుగా చిత్రీకరించే యత్నం
- దాడి జరిగినట్లు బాధితుడి వాంగ్మూలం
- ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



భిక్షపతి (ఫైల్)

**కాజీపేట:** వివాహేతర సంబంధం నేపథ్యంలో ఓ కుటుంబానికి చెందిన సభ్యులు ఒక వ్యక్తిని దారుణంగా కొట్టి చంపిన ఘటన ఆదివారం తెల్లవారుజామున వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట పట్టణం బాపూజీనగర్ ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. మృతుడి బంధువుల కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం చిన్నకోడెపాక గ్రామానికి చెందిన పరుమాండ్ల రామనాథం బతుకుదెరువు కోసం 12 సంవత్సరాల క్రితం కాజీపేట పట్టణానికి కుటుంబంతో వచ్చి పరుపులు విక్రయిస్తూ జీవిస్తున్నాడు. కాగా, చిన్నకోడెపాకకే చెందిన పరుమాండ్ల భిక్షపతి (45) భార్య కొద్ది కాలం క్రితం మరణించడంతో హన్మకొండకు వచ్చి ఓ హోటల్‌లో పనిచేస్తూ తన ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నాడు. ఇద్దరిదీ ఒకే గ్రామం కావడంతో భిక్షపతి తరచూ రామనాథం ఇంటికి వస్తుండేవాడు. అయితే వివాహేతర సంబంధం అనుమానాల కారణంగా రెండు కుటుంబాల మధ్య వివాదాలు జరుగుతున్నాయి. తమ ఇంటికి రావడం మానుకోవాలని రామనాథం కుటుంబం పలుమార్లు హెచ్చరించినా భిక్షపతి పట్టించుకోలేదు. దీంతో రామనాథం కుటుంబంలో కలహాలు పెరగడంతో అతను ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి రామనాథం ఇంటికి వచ్చిన భిక్షపతిని అతని కుటుంబ సభ్యులు బంధించి కర్రలు, కత్తులతో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి స్పృహ తప్పి పడిపోయాడు. వారు 100 నంబర్‌కు డయల్ చేయడంతో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఆరా తీయగా.. భవనం పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడినట్టు నమ్మించే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా స్పృహలోకి వచ్చిన భిక్షపతి తనపై దాడి చేసి చంపడానికి ప్రయత్నించినట్లు పోలీసులకు చెప్పాడు. అతడిని ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగానే మృతి చెందాడు.

**ఆధారాలు మాయం చేసే ప్రయత్నం..?**


భిక్షపతి వాంగ్మూలంఆధారంగా ఏసీపీ రవీంద్రకుమార్, సీఐ నరేందర్ క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఇంటి నిండా రక్తం మరకలు, వాటిని నీటితో కడిగిన ఆనవాళ్లు కనిపించినట్లు తెలుస్తోంది. చుట్టుపక్కల గా లించి భిక్షపతిని కొట్టడానికి ఉపయోగించిన కర్రలు, కత్తి, రక్తం మరకలు తుడిచిన గుడ్డలను పోలీసులు సేకరించారు. ముగ్గురు వ్యక్తులు కలసి భిక్షపతిపై దాడి చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## ‘పౌరచట్టం’పై ప్రతిపక్షాలది

# అనవసర రాద్ధాంతం

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



**సాక్షి, హైదరాబాద్:** పౌరసత్వ సవరణ చట్టంతో ఎవరికి ఎలాంటి నష్టం లేదని, ఎవరూ ఇబ్బంది పడరని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ తెలిపారు. దశాబ్దాలుగా భారత్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ధైర్యంగా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకెళ్తుంటే ప్రతిపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. పౌరసత్వ చట్టంపై అవగాహన కల్పించేందుకు ఫేస్‌బుక్ లైవ్ ద్వారా లక్ష్మణ్ ప్రజలతో మాట్లాడారు. సీఏఏ–2019పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ఈ చట్టంపై విపక్ష పార్టీలు విష ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయని, ప్రతిపక్షాలు ఇకనైనా ప్రజల్లో గందరగోళాన్ని కలిగించవద్దని అన్నారు. మతవాదంతో, ముస్లిం పక్షపాతంతో కళ్లు మూసుకుపోయిన కాంగ్రెస్, టీఆర్ఎస్, మిగిలిన పార్టీలు కనీస ఆలోచన కూడా లేకుండా మాట్లాడుతున్నాయన్నారు. పౌరసత్వ సవరణ బిల్లులో ఎక్కడా మత వివక్ష, ముస్లింల వ్యతిరేకత లేదని ఆయన స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా చైతన్య సదస్సులు నిర్వహించి టీఆర్ఎస్, కాంగ్రెస్ నిజస్వరూపాన్ని బయటపెడుతామన్నారు. ఈ నెలఖారుకు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో మేధావులు, విద్యావంతులతో పెద్దఎత్తున సదస్సులు నిర్వహిస్తామని, ఈ సదస్సులో జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని చెప్పారు.

## పక్కదారి పట్టించేందుకే హిందుత్వాన్ని తెరపైకి

### బీజేపీ ప్రభుత్వంపై సీపీఐ నేత సురవరం ఆరోపణలు



**సుందరయ్య విజ్ఞానకేంద్రం:** బీజేపీ ప్రభుత్వం దేశంలో జాతీయ ఉద్యమం గురించి మాట్లాడకుండా పక్కదారి పట్టించేందుకు హిందుత్వాన్ని తెరపైకి తెచ్చిందని సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత కమ్యూనిస్టు ఉద్యమ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జాతీయోద్యమకాలంలో హిందూ, ముస్లిం మతతత్వ శక్తుల పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ పుట్టినప్పటి నుంచి 1947 జాతీయోద్యమం వరకు ఎలాంటి ఉద్యమాల్లో పాల్గొనలేదని, ఉద్యమాన్ని బలహీనపరిచేందుకు ప్రయత్నించిందని ఆరోపించారు. పౌరసత్వ సవరణ బిల్లు (సీఏఏ), ఎన్ఆర్సీ ద్వారా హిందువులకు మాత్రమే కాకుండా బౌద్ధులు, జైనులు, సిక్కులు క్రిస్టియన్లకు మద్దతిస్తున్నట్లు బీజేపీ చెబుతోందని, అయితే బౌద్ధులు, జైనులు ఇప్పటికే అధికంగా వేరే దేశాలకు వలసవెళ్లారని సురవరం తెలిపారు. బీజేపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీబీఐ, ఇన్‌కమ్ టాక్స్ లాంటి సంస్థలను నిర్వీర్యం చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని విమర్శించారు. సీఏఏ, ఎన్ఆర్సీ బీజేపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఉంది కాబట్టి తాము అమలు చేస్తున్నామని చెబుతున్నారని, మరి సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ మేనిఫెస్టోలో ఉన్నా అది మాత్రం ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో జీడీపీ 9 నుంచి 4.5 శాతానికి పడిపోయిందని, దీనివల్ల నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయన్నారు. ఎస్వీకే గ్రంథాలయ సంస్థ చైర్మన్ సి.సాంబిరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, ప్రొఫెసర్ భంగ్యా భూక్య, ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అడిగేవాళ్లు లేరనే ఎన్‌కౌంటర్: మందకృష్ణ



**షాద్‌నగర్ రూరల్:** అడిగేవాళ్లు లేరనే ఉద్దేశంతోనే ‘దిశ’ ఘటనలో నిందితులను పోలీసులు ఎన్‌కౌంటర్ పేరుతో హతమార్చారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ‘అగ్రకుల మహిళలకు ఒక న్యాయం.. దళిత బహుజనులకు ఒక న్యాయం’అనే అంశంపై సమావేశంలో చర్చించారు. దిశ అగ్రకులానికి చెందిన యువతి కావడంతోనే పోలీసులు నిందితులను ఎన్‌కౌంటర్ చేశారని మందకృష్ణ ఆరోపించారు. నిందితులు బడుగు, బలహీన వర్గాల వారు కావడంతోనే ఎన్‌కౌంటర్ పేరుతో అంతమొందించారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆసిఫాబాద్, వరంగల్ ఘటనల్లోని నిందితులను ఎందుకు వదిలేశారని మందకృష్ణ ప్రశ్నించారు. ‘దిశ’ ఘటనలో పాటించిన ఎన్‌కౌంటర్ సూత్రం అక్కడ ఎందుకు పాటించలేదని నిలదీశారు. నలుగురు బాలికలపై అత్యాచారం చేసి అతి కిరాతకంగా చంపేసిన సైకో కిల్లర్ శ్రీనివాస్‌రెడ్డిని ఎందుకు ఎన్‌కౌంటర్ చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని ఎన్‌కౌంటర్ పేరుతో అమాయకులను హతమారుస్తున్నారని విమర్శించారు. దిశ నిందితుల ఎన్‌కౌంటర్ ఘటనపై సుప్రీంకోర్టు వేసిన త్రిసభ్య కమిటీ రాష్ట్ర పర్యటనలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టి వారి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బుర్ర రాంచంద్రయ్య, మద్దిలేటి, ప్రహ్లాద్, పెంటనోళ్ల నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ హాస్టళ్లకు సొంత భవనాలొద్దా?

### బీసీ విద్యార్థి సంఘం ధర్నాలో ఆర్.కృష్ణయ్య



**కవాడిగూడ:** మంత్రులకు బంగ్లాలుండాలి కానీ, బీసీ హాస్టళ్లకు ప్రభుత్వం ఎందుకు సొంత భవనాలు నిర్మించదని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని డిమాండ్‌చేశారు. రాజ్యాంగ సవరణ చేసి బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. అలాగే బీసీ రిజర్వేషన్లను 22 నుంచి 50 శాతానికి పెంచాలని కోరారు. అట్రాసిటీ యాక్ట్ మాదిరిగానే బీసీలకు సామాజిక రక్షణ, భద్రత కల్పించడానికి బీసీ యాక్ట్‌ను తీసుకురావాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే 12 లక్షల మంది విద్యార్థులకు మెస్ చార్జీలను పెరిగిన ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్‌చేశారు. రాష్ట్రంలో ఒక్క బీసీ కాలేజీ హాస్టల్‌కు సొంత భవనం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, జిల్లపల్లి అంజి, అల్లంపల్లి రామ్ కోటి, భూపేష్ సాగర్, జి.కృష్ణయాదవ్, గుండేటి శంకర్, అంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## రేణుకను బాలికల వసతి గృహానికి పంపండి

### బాలల హక్కుల సంఘం గౌరవాధ్యక్షుడు అచ్యుతరావు

**సాక్షి, హైదరాబాద్:** దిశ హత్యాచారంనిందితుల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చెన్నకేశవులు భార్య రేణుకను వైద్య సదుపాయం ఉన్న బాలికల వసతి గృహానికి తరలించాలని బాలల హక్కుల సంఘం గౌరవాధ్యక్షుడు పి.అచ్యుతరావు కోరారు. రేణుక మైనర్ అని, ఆర్నెళ్ల గర్భిణీ అయినందున ఆమె ఎప్పుడైనా ప్రసవించే అవకాశం ఉందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆమెకు వైద్య సేవలు సమీపంలో ఉండాలని, అందుకోసంఅన్ని రకాల వసతులున్న వసతి గృహానికి తరలించాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అదే విధంగా రేణుకకు పోక్సో చట్టం కింద పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు.

**SOUTHERN POWER DISTRIBUTION COMPANY OF TELANGANA LTD.**
**TENDER NOTICE No. 05/2019-2020 (Extension-II)**
Tenders are invited from eligible vendors for Fabrication of Iron Materials at District Stores in Nalgonda Circle. Details are available at **www.tssouthernpower.com Ph No: 08682-223867.**
**Last Date: 31.12.2019.**
ID.No: SPDCLNLG01449
Sd/- SUPERINTENDING ENGINEER
OPERATION CIRCLE, NALGONDA

# పొరుగు పాలు రుచెక్కువ!

- అంగన్‌వాడీ లబ్ధిదారులకు నందిని మిల్క్
- విజయ డెయిరీని కాదని కన్నడ పాలకు ప్రాధాన్యత ఇస్తున్న హాకా
- విజయ కంటే ఎక్కువ ధర వెచ్చించి కొనుగోలు చేస్తున్న వైనం
- తెలంగాణ విజయ డెయిరీకి రోజుకు సగటున 7లక్షల లీటర్ల సరఫరా సామర్థ్యం
- గరిష్టంగా రెండు లక్షల లీటర్లకు మించి ఆర్డర్ ఇవ్వని హాకా

మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ చెల్లిస్తున్న టెట్రా ప్యాక్ పాల ధరలు (లీటరుపై)

తెలంగాణ విజయ రూ.49.20

నందిని మిల్క్ రూ. 50.70

**సాక్షి, హైదరాబాద్**

అంగన్‌వాడీల్లోని లబ్ధిదారులకు అత్యుత్తమ పౌష్టికాహారం కింద పాలను అందిస్తున్న ప్రభుత్వం, పంపిణీ బాధ్యతలను ప్రభుత్వ రంగ సంస్థ అయిన హాకా (హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేట్ అసోసియేషన్ లిమిటెడ్)కు అప్పగించింది. ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం తెలంగాణ విజయ డెయిరీ (తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పంపిణీ చేసే పాల బ్రాండు) పాలను హాకా కొనుగోలు చేసి క్షేత్రస్థాయిలో అంగన్‌వాడీ కేంద్రాలకు చేరవేయాలి. తెలంగాణ విజయ పాలు ఆశించిన మేర సరఫరా చేయని పక్షంలో స్థానిక కంపెనీలను ప్రోత్సహించే క్రమంలో ఇక్కడి డెయిరీలకు ప్రాధాన్యత ఇవ్వొచ్చని సూచించింది. కానీ స్థానిక ప్రోత్సాహం సంగతి అటుంచితే పొరుగు రాష్ట్రానికి చెందిన డెయిరీ నుంచి ఎక్కువ ధర వెచ్చించి ‘హాకా’పాలను కొనుగోలు చేయడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 149 ఐసీడీఎస్ (సమగ్ర శిశు అభివృద్ధి పథకం)ల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గత నెల గణాంకాల ప్రకారం ఈ కేంద్రాల పరిధిలో ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న చిన్నారులు 10,42,675 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులు 6,54,165 మంది ఉన్నారు. మొత్తంగా 16.96 లక్షల మంది చిన్నారులకు రోజుకు 100 మిల్లీలీటర్ల పాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో నవంబర్ నెలలో 17.04 లక్షల ప్యాకెట్లను హాకా సరఫరా చేసింది. ఇందులో కేవలం 1.19 లక్షల ప్యాకెట్లు తెలంగాణ విజయ పంపిణీ చేయగా... మిగతావి కర్ణాటకకు చెందిన నందిని డెయిరీ సరఫరా చేసింది.

## రెండు లక్షలలోపే ఆర్డర్లు...

తెలంగాణ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రోజుకు సగటున 3 లక్షల లీటర్ల పాలను విక్రయిస్తుంది. ఇందులో టెట్రా ప్యాక్ రూపంలో నెలకు సగటున 10 లక్షల ప్యాకెట్లు సరఫరా చేసే వీలున్నప్పటికీ ప్రస్తుతం 7 లక్షల ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తెలంగాణ విజయ పాలకు కేవలం 2లక్షల వరకే ఆర్డర్లు పెడుతున్న హాకా... మిగతా కోటా అంతా నందిని డెయిరీకే ఇస్తోంది. ఒకవైపు ఎక్కువ ధర చెల్లించడంతో పాటు, పొరుగు రాష్ట్రానికి చెందిన డెయిరీని ప్రోత్సహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నందిని పాల కొనుగోలుతో ప్రభుత్వ ఖజానాపై భారం పడడంతో పాటు పొరుగు రైతులను ప్రోత్సహించడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి. నందిని డెయిరీ ఎక్కువ మొత్తంలో కమీషన్ ఇస్తుండడంతో ఆ పాల వైపే హాకా మొగ్గు చూపుతుందనే ఆరోపణలున్నాయి. తెలంగాణ విజయ బ్రాండు క్షేత్రస్థాయిలో బాగా ప్రాచుర్యం పొందింది. ఆ తర్వాత కరీంనగర్ డెయిరీ ద్వారా ముల్కనూరు పాలు, నల్లగొండ, రంగారెడ్డి జిల్లా పాల ఉత్పత్తి దారుల సంఘం సరఫరా చేసే ‘నార్మల్’పాలకు కూడా మంచి పేరే ఉంది. విజయ డెయిరీకి డిమాండ్‌కు సరిపడా పాలను సరఫరా చేసే సామర్థ్యం లేకుంటే స్థానిక ప్రోత్సాహం కింద ముల్కనూరు, నార్మల్ పాలు కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలించాలని ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు కొందరు రైతులు ప్రతిపాదనలు తీసుకొచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం అది ప్రభు త్వ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

# ‘సీతారామ’ విస్తరణ

- గోదావరి నీటితోనే సాగర్ కింది ఆయకట్టుకు నీరు
- ప్రధాన కాల్వ నుంచి ప్రత్యేక చానల్ ద్వారా ‘సాగర్’కు లింక్
- ఈ కాలువపైనే మరో 4 లిఫ్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు



**సాక్షి, హైదరాబాద్:** పూర్వ ఖమ్మం జిల్లాలోని ప్రతి ఎకరాకు నీరందించే లక్ష్యంగా సీతారామ ఎత్తిపోతల పథకాన్ని మరింత విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. దుమ్ముగూడెం ఆనకట్ట ఎత్తు పెంపుతో గరిష్టంగా 37 టీఎంసీల మేర నీటి నిల్వ పెరగనున్న నేపథ్యంలో దీని ద్వారా ఖమ్మం జిల్లానంతా సస్యశ్యామలం చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం ఇదే జిల్లాలో ఉన్న నాగార్జునసాగర్ ఆయకట్టును పూర్తి స్థాయిలో సీతారామ ద్వారా నీరందించేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. దీంతో పాటే సీతారామ ప్రధాన కాల్వ వెంట గ్యాప్ ఆయకట్టు ఉన్న చోట చిన్నచిన్న ఎత్తిపోతల పథకాలు (లిఫ్టు) ఏర్పాటు చేసి నీరందించే ఆలోచనలు చేస్తోంది.

**నీరందని ప్రతి ఆయకట్టుకూ భరోసా..**

దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి గోదావరి నీటిని ఎత్తిపోసి 6.74 లక్షల ఎకరాలకు నీరిచ్చేలా సీతారామ ప్రాజెక్టు చేపట్టారు. ప్రాజెక్టు తొలి ఫలితాలు వచ్చే ఏడాది జూన్ నాటికే అందేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. దీనికి అనుగుణంగా ప్రస్తుతం మొదటి దశలో 8 ప్యాకేజీల కింద కలిపి 114 కిలోమీటర్ల ప్రధాన కాల్వ పనులతో పాటు మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. రెండో దశలో ఈ ప్రధాన కాల్వను మరింత విస్తరిస్తూ రోళ్లపహాడ్ మీదుగా బయ్యారం చెరువు ద్వారా పాలేరు వరకు తీసుకెళ్లాలని నిర్ణయించారు. పాలేరు వరకు నీటిని తరలిస్తే పాలేరు కింద ఉన్న సాగర్ ఆయకట్టు 2.50 లక్షల ఎకరాలకు నీరందుతుంది. అయితే ప్రధాన కాల్వను విస్తరించే క్రమంలో భారీగా అటవీ భూములను దాటాల్సి వస్తుండటంతో ఈ ప్రతిపాదనను ప్రస్తుతానికి పక్కన పెట్టారు. అయితే సాగర్ కింద కొద్ది ఆయకట్టుకైనా నీరందించాలని లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. దాని ప్రకారం ప్రాజెక్టులోని మూడు పంప్‌హౌస్ దాటిన అనంతరం ప్రాజెక్టు ప్రధాన కాల్వ 101వ కిలోమీటర్ నుంచి సాగర్ కాల్వ 51వ కిలోమీటర్ వరకు ఒక ప్రత్యేక చానల్‌తో లింకు చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 8.98 కిలోమీటర్ల మేర ప్రత్యేక చానల్ తవ్వి సాగర్ ఎడమ కాల్వకు లింకు చేస్తే సాగర్ కింద కనిష్టంగా 70 వేల ఎకరాల స్థిరీకరణకు అవకాశం ఉంటుందని.. ఈ లింకుకు కేవలం 86.37 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనకు, పనుల ఆరంభానికి ఇప్పటికే సీఎం ఓకే చెప్పారు.

**మరో నాలుగు లిఫ్టులు..**

ఇక సీతారామ ప్రాజెక్టు కింద నీరందని ప్రాంతాలకు సైతం ప్రధాన కాల్వపై 4 లిఫ్టు పథకాలకు ప్రణాళిక సిద్ధమైంది. ప్రధాన కాల్వ 8.60వ కిలోమీటర్ వద్ద మారెల్లపాడు, 37వ కిలోమీటర్ వద్ద జగన్నాథపురం, 114వ కిలోమీటర్ రోళ్లపాడు వద్ద మరో 2 లిఫ్టులు ఏర్పాటు చేసి 73 వేల ఎకరాల మేర ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే దీనికి ఆమోదం రావాల్సి ఉంది.

## సాగర్ పరిధిలో ఆరు లిఫ్టులు

### రిటైర్డ్ ఇంజనీర్ల నివేదిక సిద్ధం

**సాక్షి, హైదరాబాద్:** నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ప్రతి ఎకరాకు సాగు నీరందించే ప్రణాళికలో భాగంగా మరో ఆరు లిఫ్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని సాగునీటి శాఖ రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం తేల్చింది. సాగర్ ఎడమ కాల్వ కింద సాగు నీరందని సుమారు లక్ష ఎకరాల మేర ఆయకట్టుకు నీరందించేలా ఈ లిఫ్టులు అవసరం ఉంటుందని గుర్తించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు పూర్వ నల్లగొండ జిల్లాలో రెండ్రోజుల పాటు పర్యటించిన రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి ఎం.శ్యాంప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రామారావు తదితరుల బృందం నివేదిక సిద్ధం చేసింది. నీరందని 50 వేల ఎకరాల సమస్య తీరేందుకు బ్రాంచి కెనాల్‌కు లైనింగ్ చేయాలని, అయినా సమస్య తీరకుంటే పులిచింతల ఫోర్‌షోర్‌లో ఒక లిఫ్టును చేపట్టాలని ఇంజనీర్ల సంఘం వెల్లడించింది. పులిచింతల ఫోర్‌షోర్‌లోనే జాన్‌పహాడ్ మేజర్ పరిధిలో మరో లిఫ్టును ప్రతిపాదించింది. ఇక మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలో మూసీ, తుంగపాడు, హాలియా నదులపై మరో మూడు లిఫ్టులను ప్రతిపాదించింది. ఇక సాగర్ దిగువన నెమ్మికల్ వద్ద మరో లిఫ్టును ప్రతిపాదించింది. ఈ లిఫ్టులన్నింటికీ కలిపి మొత్తంగా రూ.300 కోట్ల మేర వ్యయం అవుతుందని అంచనా. ఈ నివేదికను ఒకట్రెండు రోజుల్లో సీఎం కేసీఆర్‌కు రిటైర్డ్ ఇంజనీర్లు అందించనున్నారు.

## నేడు ‘దిశ’ నిందితుల రీ పోస్టుమార్టం

### ఎయిమ్స్ నుంచి ముగ్గురు సభ్యుల బృందం రాక

**సాక్షి, హైదరాబాద్:** చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్‌లో మరణించిన ‘దిశ’అత్యాచార నిందితుల మృతదేహాలకు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి మార్చురీలో సోమవారం రీ పోస్టుమార్టం నిర్వహించనున్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)కు చెందిన ముగ్గురు సీనియర్ ఫోరెన్సిక్ వైద్యులు ఆదివారం నగరానికి చేరుకున్నారు. ఈ బృందంలో ఎయిమ్స్ ఫోరెన్సిక్ అధిపతి డాక్టర్ సుధీర్ గుప్తా, డాక్టర్ ఆదర్శ్ కుమార్, డాక్టర్ అభిషేక్ యాదవ్ ఉన్నారు. వారికి సహాయకుడిగా డాక్టర్ వరుణ్ చంద్ర వ్యవహరిస్తారు. ఈ బృందం సోమవారం ఉదయం 9 గంటలకు రీ పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియోలో చిత్రీకరిస్తారు. సమగ్ర నివేదిక అందించాల్సి ఉన్నందున ఒక మృతదేహానికి రీ పోస్టుమార్టం చేసేందుకు గంట నుంచి గంటన్నర సమయం పడుతుందని వైద్యనిపుణులు చెబుతున్నారు. నాలుగు మృతదేహాలకు రీ పోస్టుమార్టం పూర్తి చేసేందుకు సుమారు 6 గంటల సమయం పట్టనుంది. రీ పోస్టుమార్టం ముగిసిన వెంటనే సాయంత్రం 4 గంటలకు నివేదికతో పాటు వీడియో దృశ్యాలను పెన్‌డ్రైవ్‌లో కోర్టుకు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టారు. రీ పోస్టుమార్టం ముగిసిన తర్వాత మృతదేహాలను సంబంధిత కుటుంబసభ్యులకు అందించేందుకు రంగం సిద్ధం చేసున్నారు. మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్లేటప్పటికే రాత్రి అవుతుందని, అప్పుడు అంత్యక్రియలు జరిపే అవకాశం ఉండదని కుటుంబ సభ్యులు తెలిపితే రీ పోస్టుమార్టం చేసిన మృతదేహాలను మళ్లీ మార్చురీలోనే భద్రపరిచి, మంగళవారం ఉదయం అందజేస్తారు. మృతదేహాలకు రీ పోస్టుమార్టం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని, 4 గంటలకు నివేదికను కోర్టుకు అందించేందుకు తగిన ఏర్పాట్లు చేపట్టామని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ తెలిపారు.

**కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు..**

గాంధీ మార్చురీ వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. నార్త్‌జోన్ డీసీపీ కల్మేశ్వర్ సింగనవార్ నేతృత్వంలో గోపాలపురం ఏసీపీ వెంకటరమణ ఆధ్వర్యంలో గాంధీ మార్చురీ వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు.

# రైతు దినోత్సవం గుర్తుందా?

- జాతీయ రైతు దినోత్సవాన్ని పట్టించుకోని వ్యవసాయశాఖ
- అధికారుల తీరుపై వ్యవసాయవేత్తల అసంతృప్తి

**సాక్షి, హైదరాబాద్:** దేశానికి అన్నం పెట్టే రైతన్నను పట్టించుకునే నాథుడే లేడా అని వ్యవసాయ నిపుణులు ప్రశ్నిస్తున్నారు. తెలంగాణ వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతు దినోత్సవం సందర్భంగా ఈసారి ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతోన్నాయి. అసలు అధికారులకు రైతు దినోత్సవం గుర్తుందా అని వ్యవసాయవేత్తలు ప్రశ్నిస్తున్నారు. కాగా ‘రైతు దినోత్సవాన్ని వ్యవసాయశాఖ నిర్వహించడం లేద’ని ఒక ఉన్నతాధికారి తెలిపారు. జాతీయ రైతు దినోత్సవాన్ని ప్రతీ ఏటా డిసెంబర్ 23న దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతిని జాతీయ రైతు దినోత్సవంగా జరుపుతారు. చౌదరి చరణ్ సింగ్ చేసిన అనేక ఉద్యమాల వల్ల జమిందారీ చట్టం రద్దయింది. కౌలుదారీ చట్టం అమల్లోకి వచ్చింది. రైతులకు బ్యాంకు రుణాలు అందించే విధానాన్ని తెచ్చారు.

**గిట్టుబాటు ధర ఎండమావే...**

తెలంగాణ ప్రభుత్వం రైతుకు ప్రయోజనం కలిగించే రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు తీసుకొచ్చింది. రైతుబంధుతో 53 లక్షల మంది రైతులు ప్రయోజనం పొందుతున్నారు. రైతుబీమాలో 31 లక్షల మంది వరకు చేరారు. ఇప్పటికే అనేకమంది రైతులు చనిపోతే వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం అందింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాలకు అంతర్జాతీయ గుర్తింపు కూడా లభించింది. ఇంతవరకు తెలంగాణ ప్రభుత్వం రైతుల పట్ల తన చిత్తశుద్ధి చూపినా వారి సమస్యలు కొన్ని అలాగే ఉన్నాయి. దేశవ్యాప్తంగా రైతులకు గిట్టుబాటు ధర ఎండమావిగానే ఉంది. కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కూడా అన్ని పంటలకూ అందరికీ అందే పరిస్థితి లేదు. రాష్ట్రంలో కంది వంటి పంటకు ఎంఎస్పీ ఉన్నా, రైతులు పండించినదంతా కొనడం లేదు. దీంతో దళారులకే అమ్మేసుకుంటున్నారు. ఇక ఒకరోజు వర్షాల కోసం.. ఇంకో రోజు విత్తనాల కోసం.. మరో రోజు ఎరువుల కోసం.. బ్యాంకు రుణాల కోసం.. ఇలా ప్రతి విషయంలోనూ ఒత్తిళ్లకు గురి కావాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడుతోంది. ఒత్తిళ్లు, నష్టాలు భరించలేక కొందరు ప్రాణాలు విడుస్తుంటే.. మరికొందరు సాగుకే దూరమవుతున్నారు.

**కౌలు రైతుల పరిస్థితి ఘోరం**

ఇక కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పూర్తి పంట చేతికి రాదు.. వీరికి వ్యవసాయ రుణాలూ రావు. భూమి కౌలుకు ఎక్కువ రేట్లు చెల్లించడం, భూయజమాని కాకపోవడం వల్ల పంట రుణం ఇవ్వడానికి బ్యాంకులు కొర్రీలు పెడుతున్నాయి. కౌలు రైతులు వ్యవసాయం గిట్టుబాటు కాక, యజమానులకు కిస్తీలు కట్టలేక కుదేలై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బీమా పథకం వీరికి వర్తించడం లేదు.

**అన్నదాతను పట్టించుకోరా?**

అన్నం పెట్టే రైతు దినోత్సవాన్ని నిర్వహించే తీరిక వ్యవసాయశాఖ అధికారులకు లేదా? ఇంతకంటే దారుణం మరోటి ఉంటుందా? రైతుకు ఇప్పుడు కావాల్సింది ఎంఎస్పీ, గిట్టుబాటు ధర కాదు. హక్కు ధర కావాలి.

–నక్కా సాయి భాస్కర్‌రెడ్డి,
వ్యవసాయ, పర్యావరణ నిపుణులు

# పోలీసులకు ‘వరంగల్ కేసు’ పాఠాలు

- చిన్నారిపై హత్యాచారం ఉదంతంలో సత్వర స్పందన
- 27 రోజుల్లో దర్యాప్తు పూర్తి, 51 రోజుల్లో తీర్పుతో రికార్డు
- జోన్ల వారీగా క్లాసుల ద్వారా బోధిస్తున్న నాటి దర్యాప్తు అధికారి శ్రీధర్

**సాక్షి, హైదరాబాద్:** దిశ ఉదంతంతో అప్రమత్తమైన నగర పోలీసు విభాగం మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా ప్రతి ఫిర్యాదును కేసుగా నమోదు చేయడంతో పాటు తీవ్రమైన కేసుల్లో దర్యాప్తు, విచారణ అతి తక్కువ సమయంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలోనే అత్యంత వేగవంతమైన దర్యాప్తు, విచారణలతో రికార్డుల్లోకి ఎక్కిన వరంగల్‌లో చిన్నారిపై హత్యాచారం కేసును ఓ కేస్ స్టడీగా మార్చారు. ఈ కేసు దర్యాప్తు, విచారణ తీరుతెన్నులను నాటి దర్యాప్తు అధికారి, ప్రస్తుతం చిక్కడపల్లి ఏసీపీ సీహెచ్ శ్రీధర్ సిటీ పోలీసులకు ప్రత్యేక క్లాసుల ద్వారా వివరిస్తున్నారు. గత వారం నుంచి జోన్ల వారీగా ఈ క్లాసులు చేపడుతున్నారు. వరంగల్‌లో ఈ ఏడాది జూన్ 18 అర్ధరాత్రి చోటు చేసుకున్న తొమ్మిది నెలల చిన్నారిపై అత్యాచారం, హత్య ఉదంతం రాష్ట్రంలో తీవ్ర కలకలం సృష్టించింది. హైదరాబాద్ శివార్లలోని ఇబ్రహీంపట్నంలో ఉన్న విద్యాభారతి ఇంజనీరింగ్ కాలేజీలో పనిచేసే దంపతులు తమ 9 నెలల చిన్నారిని తీసుకుని హన్మకొండ కుమార్‌పల్లిలో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి మేడపై తల్లిదండ్రులతో కలిసి నిద్రిస్తున్న చిన్నారిని అపహరించుకుపోయిన ప్రవీణ్ అనే వ్యక్తి నిర్జన ప్రదేశంలో అత్యాచారం చేసి చంపేశాడు. ఈ దారుణంపై అదే రోజు హన్మకొండ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు కు ఏసీపీ సీహెచ్ శ్రీధర్ దర్యాప్తు అధికారిగా నియమితులయ్యారు. పాశవికమైన ఈ ఉ దంతంపై తీవ్రమైన ప్రజాగ్రహం వ్యక్తమైంది. నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని, తక్షణమే ఉరి తీయాలని డిమాండ్లు వెల్లువెత్తాయి.

**51వ రోజు తీర్పు..**

చిన్నారిపై హత్యాచారం కేసు దర్యాప్తు, విచారణ పూర్తి చేసి ప్రవీణ్‌కు శిక్షపడేలా చేస్తామని వరంగల్ సీపీ వి.రవీందర్ ప్రజలకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం దర్యాప్తు, విచారణ పూర్తి చేయించి, 51వ రోజు తీర్పు వచ్చేలా చేశారు. ఆ కేసు దర్యాప్తు అధికారి శ్రీధర్ ప్రస్తుతం చిక్కడపల్లి డివిజన్ ఏసీపీగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీసు కమిషనర్ అంజనీ కుమార్ ఆ కేస్ స్టడీని నగర పోలీసు అధికారులకు బోధించాల్సిందిగా శ్రీధర్‌ను ఆదేశించారు. దీంతో ఆయన జోన్ల వారీగా ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలకు బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్‌లో శిక్షణ ఇస్తూ, నాటి రికార్డులను పంపిణీ చేస్తూ దర్యాప్తుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఇప్పటికే మూడు జోన్ల అధికారులకు తరగతులు పూర్తి కాగా.. ఈ వారం మరో రెండు జోన్లకు చెందిన వారికి నిర్వహించనున్నారు.



ఏసీపీ శ్రీధర్‌ను అభినందిస్తున్న వరంగల్ సీపీ రవీందర్

### చిన్నారి కేసు వివరాలు..

- అత్యాచారం, హత్య కేసు నమోదైంది: జూన్ 18, 2019
- దర్యాప్తు పూర్తయి చార్జ్‌షీట్ దాఖలైంది: జూలై 11 (27 రోజుల్లో)
- కోర్టులో సాక్షుల విచారణ: జూలై 24, 25, 30, 31, ఆగస్టు 1, 2
- న్యాయస్థానంలో ఇరు పక్షాల వాదనలు: ఆగస్టు 6
- తీర్పు వెలువడింది: ఆగస్టు 8 (51 రోజుల్లో)
- స్థానిక కోర్టు దోషికి ఉరి శిక్ష వేయగా.. ఉన్నత న్యాయస్థానం జీవితఖైదుగా మార్చింది.

## సామాజికాంశాలపై పట్టు సాధించాలి

### విద్యార్థులకు హైకోర్టు సీజే రాఘవేంద్రసింగ్ చౌహాన్ సూచన



**సాక్షి, హైదరాబాద్:** విద్యార్థులు చదువుతోపాటు, సామాజికాంశాలపై దృష్టి సారించాలని, తద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని హైకోర్టు చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. ఆదివారం ఉప్పల్ గ్లోబల్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ 10వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ నర్సింహమూర్తి, సీఆర్పీఎఫ్ సౌత్ సెక్టార్ ఐజీపీ ఎం.ఆర్.నాయక్, డిప్యూటీ కమాండెంట్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సీఆర్పీఎఫ్ 117, 28 బెటాలియన్ అధికారులు సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా జమ్మూ కశ్మీర్ నుంచి తీసుకువచ్చిన విద్యార్థులకు చీఫ్ జస్టిస్ జ్ఞాపికలు అందజేశారు.

# ఎన్నార్సీపై చర్చించలేదు

- కేబినెట్లో కానీ, పార్లమెంట్లో కానీ ఆ విషయంపై చర్చ జరగలేదు
- పౌరసత్వ సవరణ చట్టంతో ప్రమాదమేం లేదు
- భారతీయ ముస్లింలకు ఈ చట్టంతో సంబంధం లేదు
- విపక్షాలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయి
- ఈ చట్టాన్ని రాష్ట్రాలు అమలు చేయాల్సిందే
- ఢిల్లీ బహిరంగ సభలో ప్రధాని మోదీ




ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరిగిన ర్యాలీకి హాజరైన ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ:** జాతీయ పౌర పట్టిక (ఎన్నార్సీ)కు సంబంధించి తన ప్రభుత్వం ఇంతవరకు కేబినెట్‌లో కానీ, పార్లమెంట్లో కానీ చర్చించలేదని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. అస్సాంలో మాత్రం ఎన్నార్సీని సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జరిపారని గుర్తు చేశారు. ఎన్నార్సీపై విపక్షాలు అబద్ధాలను ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో ప్రధాని పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా తీవ్రస్థాయి నిరసనలకు, హింసాత్మక ఆందోళనలకు కారణమైన వివాదాస్పద పౌరసత్వ సవరణ చట్టాన్ని మోదీ గట్టిగా సమర్థించారు. ఆ చట్టాన్ని వ్యతిరేకించే ముందు ఆ చట్టంలోని అంశాలపై అవగాహన తెచ్చుకోవాలని సూచించారు. భారతీయ ముస్లింలకు ఆ చట్టంతో ఏ సంబంధం లేదని స్పష్టం చేశారు. పాకిస్తాన్ నుంచి శరణార్థులుగా వచ్చిన హిందువులు, సిక్కులకు పౌరసత్వం కల్పించాలని గతంలో మహాత్మాగాంధీయే చెప్పారని గుర్తు చేశారు. ఈ విషయాన్ని గాంధీ పేరును తమ పేరుకు తగిలించుకున్న వారు తెలుసుకోవాలని పరోక్షంగా కాంగ్రెస్ అగ్రనేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'మూడు పొరుగు దేశాల్లో మతపరమైన వేధింపులకు గురై భారత్‌కు వచ్చిన వారికి పౌరసత్వ హక్కులు కల్పించేందుకు ఉద్దేశించినదే కానీ.. ఇక్కడి వారి హక్కులను లాగేసుకునేది కాదు' అని పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ) ఉద్దేశాన్ని వివరించారు. ఈ ప్రతిపాదనను గతంలో కాంగ్రెస్, టీఎంసీలు సమర్థించాయని, ఇప్పుడు ఓటుబ్యాంక్ రాజకీయాల కోసం విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ చట్టం అమలైతే ముస్లింలను నిర్బంధ కేంద్రా(డిటెన్షన్ సెంటర్)లకు పంపించేస్తారని కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, పట్టణ నక్సలైట్లు అబద్ధాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. శాంతి పాటించాలని, హింసకు పాల్పడవద్దని కాంగ్రెస్, తృణమూల్, ఆప్, లెఫ్ట్ పార్టీలు సీఏఏ ఆందోళనకారులకు ఎందుకు విజ్ఞప్తి చేయడం లేదని ప్రశ్నించారు. తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయబోమని పలువురు సీఎంలు చేస్తున్న ప్రకటనలపై స్పందిస్తూ.. వీరు తమ న్యాయాధికారులను సంప్రదిస్తే మంచిదన్నారు. పార్లమెంటు చేసిన చట్టాలను రాష్ట్రాలు అమలు చేసి తీరాల్సిందేనని రాజ్యాంగం స్పష్టంగా చెబుతోందన్నారు. ఢిల్లీలోని అక్రమ కాలనీల క్రమబద్ధీకరణ అనంతరం, వారికి యాజమాన్య హక్కులు కల్పించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కృతజ్ఞతాపూర్వక సభలో గంటన్నరకు పైగా ప్రధాని ప్రసంగించారు. ఢిల్లీ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ సభ ఎన్నికల ప్రచార ప్రారంభంగానే కనిపించింది.

## శరణార్థులు వేరు.. అక్రమ వలసదారులు వేరు

శరణార్థులకు, అక్రమ వలసదారులకు తేడా ఉందని, శరణార్థులు తమ వివరాలను దాచేందుకు ప్రయత్నించరని, అక్రమ వలసదారులు మాత్రం తమ వివరాలేవీ బయటపెట్టరని వ్యాఖ్యానించారు. లోక్‌సభ ఎన్నికల్లో తాము మళ్లీ విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేని విపక్షాలు విచ్చిన్న రాజకీయాలకు పాల్పడుతున్నాయని ప్రధాని విరుచుకుపడ్డారు. మైనారిటీలపై పాకిస్తాన్ చూపే వివక్షను ఎండగట్టే అవకాశం వచ్చిందని, అయితే, ఇక్కడి విపక్షాల విభజన రాజకీయాల వల్ల ఆ అవకాశం కోల్పోయామని వ్యాఖ్యానించారు.

### భిన్నత్వంలో ఏకత్వం

'భిన్నత్వంలో ఏకత్వం.. భారతదేశ విశిష్టత' అని నినదిస్తూ ప్రసంగాన్ని మోదీ ప్రారంభించారు. అభివృద్ధిలో తన ట్రాక్ రికార్డును చూడాలని, విపక్షాల టేప్ రికార్డులను వినవద్దని ముస్లింలకు సూచించారు. నిరసనల సందర్భంగా పోలీసుల తీరును ప్రధాని ప్రశంసించారు. వారెప్పుడు ప్రజలకు సహాయకారులుగానే ఉంటారన్నారు.

## 'భయాందోళనలకు కారణం హోంమంత్రే'

సీఏఏపై అపోహలను ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్నాయని ప్రధాని మోదీ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ స్పందించింది. భయాందోళనలకు కారణం తాము కాదని, హోం మంత్రి అమిత్ షానేనని సమాధానమిచ్చింది. సీఏఏ తరువాత ఎన్నార్సీనేనని అమిత్ షా పార్లమెంట్లోనే ప్రకటించారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ గుర్తు చేశారు. భారత్‌లో డిటెన్షన్ సెంటర్లు లేవని ప్రధాని చెప్పడాన్ని శర్మ తప్పుబట్టారు. ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా దేశ యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం ట్విట్టర్లో విమర్శించారు.

## మోదీ సభకు భారీ భద్రత

రామ్‌లీలా మైదానంలో ప్రధాని మోదీ పాల్గొన్న ఈ సభకు అధికారులు భారీగా భద్రత ఏర్పాట్లు చేశారు. పాత ఢిల్లీలో హింసాత్మక ఆందోళనలు జరిగిన దరియాగంజ్‌కు ఈ ప్రాంగణం ఒక కిలోమీటరు దూరంలోనే ఉండటంతో బలగాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాయి. డీసీపీ ర్యాంక్ అధికారులు 20 మంది, దాదాపు వెయ్యిమంది ఢిల్లీ పోలీసులు, డ్రోన్ నిరోధక దళాలు, ఎన్ఎస్‌జీ కమాండోలతో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేపట్టారు.

---

## క్లుప్తంగా...

### పన్ను చెల్లించండి బంగారం గెలవండి

**ముంబై:** పన్ను రాబడి పెంచుకోవడానికి మహారాష్ట్రలోని ఓ గ్రామం వినూత్న ప్రయోగం చేపట్టింది. వచ్చే సంవత్సరం మార్చి 15 లోపు గ్రామపంచాయతీ పన్ను బకాయిలు చెల్లిస్తే వారిని లక్కీడ్రాకు ఎంపిక చేస్తామని, లక్కీడ్రాలో వారు బంగారం గెలుపొందవచ్చని ప్రకటించింది. సంగ్లీ జిల్లా కడేగావ్ తాలూకాలోని వాంగీ అనే గ్రామపంచాయతీ ఈ వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. పన్ను బకాయిలను నిర్ణీత గడువులోగా చెల్లించిన వారి పేర్లతో లక్కీడ్రా తీస్తామని, లక్కీడ్రాలో తొలి రెండు స్థానాల్లో వచ్చినవారు 5 గ్రాములు, 3 గ్రాముల బంగారపు ఉంగరాలు, మూడో స్థానంలో నిలిచిన వారు 2 గ్రాముల బంగారు నాణెం గెలుచుకుంటారని తెలిపింది. ఈ పథకానికి మంచి స్పందన వస్తోందని వాంగీ గ్రామ సర్పంచ్ విజయ్ హన్మానే తెలిపారు.

### కానిస్టేబుల్ ప్రాణాన్ని కాపాడిన పర్సు!

**ఫిరోజాబాద్:** కొన్ని నాణేలు, నాలుగు ఏటీఎం కార్డులు, ఒక శివుడి ఫొటో ఉన్న పర్సు ఓ కానిస్టేబుల్ ప్రాణాన్ని కాపాడింది. అదెలా అనుకుంటున్నారా? పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. శనివారం ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌లో జరుగుతున్న ఆందోళనల్లో కానిస్టేబుల్ విజేందర్ కుమార్ విధులు నిర్వహిస్తున్నారు. 'ఆందోళనకారులెవరో కాల్పులు జరిపారు. దీంతో దూసుకొచ్చిన బుల్లెట్ నా జాకెట్ నుంచి చొచ్చుకుపోయి నా జేబులో ఉన్న పర్సులో చిక్కుకుపోయింది. పర్సులో కొన్ని నాణేలు, ఏటీఎం కార్డులు, శివుని ఫొటో ఉన్నాయి. నిజంగా నాకిది పునర్జన్మగా భావిస్తున్నాను'అని విజేందర్ చెప్పారు.

### పొరుగుదేశాలపై భారత్ ప్రభావం: బంగ్లా మంత్రి

**ఢాకా:** పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ), జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్నార్సీ)భారత్ అంతర్గత వ్యవహారమని బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ మంత్రి ఏకే అబ్దుల్ మొమెన్ అన్నారు. అయితే, భారత్‌లో నెలకొన్న అనిశ్చితి పరిస్థితుల ప్రభావం పొరుగు దేశాలపై పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీఏఏ నిరసనలు తగ్గి త్వరలోనే శాంతియుత పరిస్థితి నెలకొంటుందని ఆకాంక్షించారు. అమెరికాలో ఆర్థిక మాంద్యం నెలకొంటే ప్రపంచ దేశాలపై ప్రభావం చూపిస్తుంది. దీనికి కారణం ఇప్పుడు ప్రపంచం ఒక కుగ్రామంగా మారింది. అలాగే భారత్‌లో ఏ మాత్రం అనిశ్చితి నెలకొన్నా మాకూ ఆందోళనగానే ఉంటుంది'అని అబ్దుల్ మొమెన్ అన్నారు.

### ఏడేళ్ల చిన్నారిపై హత్యాచారం

**థానే:** ఏడేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి, హత్యాచారం చేసిన దుర్ఘటన మహారాష్ట్రలో చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం చిన్నారి మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు తెలపడంతో నిందితుడు కొరి (30)ని అరెస్ట్ చేశారు. భివండి డీసీపీ రాజ్‌కుమార్ షిండే కథనం ప్రకారం.. కరివాలి గ్రామానికి చెందిన కొరి శనివారం రాత్రి రెండో తరగతి చదువుతున్న ఏడేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేశాడు. అనంతరం చిన్నారిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసి, బండరాయితో తలపై మోది చంపేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. ఆదివారం ఉదయం పొదల మాటున చిన్నారిని మృతదేహాన్ని చూసిన బాటసారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కొరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిపై పోక్సో సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు.

# అది ముస్లిం సంస్థల పనే

- 'పౌర' అల్లర్ల వెనుక పీఎఫ్‌ఐ, సిమి ప్రమేయం: యూపీ సర్కార్
- లక్నో విమానాశ్రయంలో టీఎంసీ నేతల అడ్డగింత
- 'పౌర' చట్టం, ఎన్నార్సీలపై జైపూర్‌లో భారీ ర్యాలీ



జైపూర్‌లో రాజస్తాన్ సీఎం గహ్లోత్ నేతృత్వంలో జరిగిన ర్యాలీకి భారీగా హాజరైన జనం

**న్యూఢిల్లీ/లక్నో/మంగళూరు/జైపూర్:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. తమ రాష్ట్రంలో జరిగిన హింసాత్మక ఘటనల్లో బయటివారి ప్రమేయం ఉందని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ అల్లర్లలో పాలుపంచుకున్న ఇస్లామిక్ సంస్థలకు చెందిన ఆరుగురు పశ్చిమబెంగాల్ కార్యకర్తలను అరెస్ట్ చేసినట్లు ప్రకటించింది. 'పౌర' చట్టాన్ని నిరసిస్తూ ఉత్తరప్రదేశ్‌లో మూడు రోజులపాటు జరిగిన హింసాత్మక ఘటనల్లో 18 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. రాజధాని లక్నోతోపాటు గొడవలు ఎక్కువగా చోటుచేసుకున్న మీరట్, ఫిరోజాబాద్, కాన్పూర్, బిజ్నోర్ తదితర ప్రాంతాల్లో ఆదివారం ప్రశాంతత నెలకొంది. కాగా, అల్లర్ల బాధిత కుటుంబాలను కలిసేందుకు వచ్చిన బెంగాల్ అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) నేతలను లక్నో విమానాశ్రయంలోనే పోలీసులు అడ్డుకున్నారు. బిజ్నోర్ జిల్లాలో అల్లర్ల బాధిత కుటుంబాలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ పరామర్శించారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో 'పౌర' చట్టానికి అనుకూలంగా జరిగిన ర్యాలీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పాల్గొన్నారు.

### అల్లర్ల కారకులను అరెస్ట్ చేశాం

రాష్ట్రంలో అల్లర్లకు కారకులైన వారిని గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఆదివారం డిప్యూటీ సీఎం దినేశ్ శర్మ మీడియాకు తెలిపారు. హింసాత్మక ఘటనల వెనుక పశ్చిమబెంగాల్‌కు చెందిన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్‌ఐ), స్టూడెంట్స్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి) కార్యకర్తల హస్తం ఉందన్నారు. వీరు అక్రమ ఆయుధాలను వాడారని తెలిపారు. బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన ఆరుగురు పీఎఫ్‌ఐకు చెందిన వారిని ఇప్పటికే అరెస్ట్ చేశామన్నారు.

### జైపూర్‌లో భారీ ర్యాలీ

పౌరసత్వ సవరణ చట్టం, ఎన్నార్సీలను వ్యతిరేకిస్తూ రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఆధ్వర్యంలో జైపూర్‌లో భారీ ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీలో 3 లక్షల మంది పాల్గొన్నట్లు అంచనా. ఆదివారం ఈశాన్య రాష్ట్రాలతోపాటు ఢిల్లీ, బిహార్, రాజస్తాన్, తమిళనాడు ల్లోనూ ఆందోళనలు ప్రశాంతంగా కొనసాగాయి. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొందరు ఆదివారం దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన తెలిపారు. తమ ప్రాంత స్థానిక ప్రజల హక్కుల కోసం జరుగుతున్న పోరాటాన్ని మరుగున పరిచేలా, 'పౌర' ఆందోళనలకు మతం రంగు పులిమారని వారు ఆరోపించారు. 'మా అజెండాను వేరొకరు హైజాక్ చేయనివ్వం. మా ప్రజల తరఫున మాట్లాడేందుకే ఇక్కడికి వచ్చాం'అని త్రిపుర రాచ కుటుంబ వారసుడు ప్రద్యోత్ దేవ్ వర్మన్ పేర్కొన్నారు.



### నాగపూర్‌లో అనుకూల ర్యాలీ

**నాగపూర్:** పౌరసత్వ సవరణ చట్టం ముస్లింలకు వ్యతిరేకం కాదని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు. ఈ చట్టానికి అనుకూలంగా ఆదివారం నాగపూర్‌లో బీజేపీ, ఆర్ఎస్ఎస్ అనుకూల సంస్థ చేపట్టిన ర్యాలీలో గడ్కరీ ప్రసంగించారు. ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలకు ఎటువంటి అన్యాయం తలపెట్టదన్నారు. పొరుగు దేశాల నుంచి వచ్చిన వారిని వెనక్కి పంపబోదన్నారు. ఈ చట్టంపై తప్పుడు ప్రచారం చేస్తూ కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందన్న విషయం ముస్లింలు గ్రహించాలన్నారు.




గెలిచిన నంబర్‌ను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

## స్పెయిన్‌లో 17 వేల కోట్ల లాటరీ

**బార్సిలోనా:** క్రిస్మస్‌ను పురస్కరించుకొని స్పెయిన్‌లో నిర్వహించిన భారీ లాటరీలో 26590 నంబర్ టికెట్ గెలుపొందింది. లాటరీలో విజేతల ఎంపిక కార్యక్రమాన్ని ఆదివారం ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఎల్ గొర్డోగా పిలిచే ఈ లాటరీలో 26590 టికెట్ నంబర్ కలిగిన వారందరికీ రూ. 3 కోట్లు చొప్పున లభించనున్నాయి. విజేతలు దాదాపు రూ. 60 లక్షలు పన్నుల రూపంలో చెల్లించాలి. ఈ లాటరీ మొత్తం విలువ రూ. 17 వేల కోట్లు. లాటరీ మొత్తంపరంగా చూస్తే ప్రపంచంలో ఇదే అత్యంత విలువైనది. ఈ లాటరీని 1763లో కింగ్ కార్లోస్–3 ప్రారంభించారు. ఇందులో వచ్చే డబ్బును కొందరు దానధర్మాలకు కూడా వినియోగిస్తారు. ఏటా డిసెంబర్ 22వ తేదీన ఈ లాటరీ డ్రా తీస్తారు.

## నేలకు దిగిన బోయింగ్ ఆశలు!

**అంతరిక్ష కేంద్రాన్ని అందుకోకుండానే వెనుదిరిగిన బోయింగ్ స్టార్‌లైనర్**

**కేప్ కెనవెరాల్:** అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లోకి ప్రవేశించాలన్న లక్ష్యంతో నింగిలోకి దూసుకెళ్లిన బోయింగ్ కంపెనీ స్టార్‌లైనర్ క్రూ క్యాప్స్యూల్ డమ్మీ అంతరిక్ష నౌక ఆదివారం న్యూమెక్సికోలోని ఎడారిలో సురక్షితంగా ల్యాండైంది. అయితే అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లకుండానే వెనుదిరిగి రావడంతో వచ్చే ఏడాది వ్యోమగాములతో చేయాల్సిన ప్రయోగంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కిందకు దిగే క్రమంలో మూడు పారాచ్యూట్‌లు తెరుచుకోవడంతోపాటు ఎయిర్‌బ్యాగులు కూడా సరిగా పనిచేయడం వల్ల సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. వారం రోజులకు పైగా అంతరిక్ష కేంద్రంలో ఉండాల్సిన నౌక.. కేవలం ప్రయోగించిన రెండు రోజులకే వెనుదిరగాల్సి వచ్చింది. సురక్షిత ల్యాండింగ్ కావడం కొంతమేర సానుకూల అంశం. నాసా భాగస్వామ్యంతో నిర్మించిన స్టార్‌లైనర్ క్యాప్స్యూల్ డమ్మీ అంతరిక్ష నౌకను మానవరహితంగా ఫ్లోరిడాలోని కేప్ కెనవెరాల్ స్పేస్ సెంటర్ నుంచి శుక్రవారం ప్రయోగించారు. అట్లాస్–5 రాకెట్‌తో నింగిలోకి ఎగిరిన స్టార్‌లైనర్ 15 నిమిషాలకు దాని నుంచి వేరుపడింది. అయితే ఆ తర్వాత కొన్ని నిమిషాలకు తమ అంతరిక్ష నౌక నిర్దేశిత కక్ష్య నుంచి దారి తప్పిందంటూ బోయింగ్ ట్వీట్ చేసింది. దాన్ని సరైన కక్ష్యలోకి తెచ్చే ప్రయత్నాల్లో తాము నిమగ్నమైనట్లు తెలిపింది. వచ్చే ఏడాది వ్యోమగాములను స్టార్‌లైనర్ ద్వారా అంతరిక్ష యాత్రకు పంపాలని సంకల్పించిన క్రమంలో తాజా వైఫల్యం తీవ్ర ఆందోళన కలిగించే అంశం కానుంది. వచ్చే ఏడాది స్టార్‌లైనర్ కాప్స్యూల్‌లో ముగ్గురు వ్యోమగాములను పంపేందుకు బోయింగ్ సన్నాహాలు చేస్తోంది.



న్యూమెక్సికో ఎడారిలో సురక్షితంగా ల్యాండైన స్టార్‌లైనర్ క్రూ క్యాప్స్యూల్

## జనవరి 31న 'బిగ్‌బెన్' బ్రెగ్జిట్ గంటలు



**లండన్:** లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాత బిగ్ బెన్ గడియారం బ్రెగ్జిట్‌ను పురస్కరించుకుని జనవరి 31వ తేదీ రాత్రి ప్రత్యేకంగా గంటలు మోగించనుంది. పార్లమెంట్ ఆవరణలోని ఎలిజబెత్ టవర్‌లో ఉన్న 160 ఏళ్లనాటి ఈ గడియారానికి ప్రస్తుతం రూ.554 కోట్లతో మరమ్మతులు చేపడుతున్నారు. పనుల్లో పాల్గొంటున్న సిబ్బందికి ఇబ్బంది కలగరాదని ప్రస్తుతం ఈ గడియారం ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే గంటలు కొట్టేలా ఏర్పాటు చేశారు. కొత్త సంవత్సరాదిన డిసెంబర్ 31వ తేదీ రాత్రి మోగేందుకు ఏర్పాట్లు చేశారు. దీనిలో గంటలు మోగాలంటే ప్రత్యేకంగా పార్లమెంట్ తీర్మానం చేయాల్సి ఉంటుంది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) నుంచి బ్రిటన్ వేరు పడుతున్న బ్రెగ్జిట్ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని జనవరి 31వ తేదీ రాత్రి 11 గంటలకు బిగ్‌బెన్ గంటలు కొట్టేలా చూడాలంటూ 50 మంది ఎంపీలు చేసిన విజ్ఞప్తికి స్పీకర్ సానుకూలంగా స్పందించారని 'ది సండే టెలిగ్రాఫ్' పత్రిక తెలిపింది.


## సీటు కోసం ప్రజ్ఞాఠాకూర్ పేచీ



**న్యూఢిల్లీ:** తనకు సీటు కేటాయించడంలో విమాన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని బీజేపీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ ఆరోపించారు. ఈ కారణంగా ఢిల్లీ–భోపాల్ విమానం 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. ఎంపీ ప్రజ్ఞా భోపాల్‌కు ప్రయాణించేందుకు స్పైస్‌జెట్ విమానంలో టికెట్ బుక్ చేసుకున్నారు. అయితే ఆమె వీల్ చైర్‌లో రావడంతో విమానం ముందువరసలోని 1–ఏ సీటును కేటాయించేందుకు విమాన సిబ్బంది నిరాకరించారు. వెనుక సీటుకు మారాలని కోరగా ఆమె తిరస్కరించారు. వాదోపవాదాల అనంతరం ఆమె వెనుక సీటుకు వెళ్లేందుకు అంగీకరించారు. దీంతో విమానం 45 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరింది. ఈ విషయంపై ఎంపీ ప్రజ్ఞా భోపాల్ ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భద్రతా కారణాల కారణంగానే ఆమెకు వెనుక సీటు కేటాయించినట్లు స్పైస్ జెట్ ప్రతినిధి తెలిపారు.

# అఫ్గానిస్తాన్ పగ్గాలు మళ్లీ ఘనీకే !

- ప్రాథమిక ఫలితాల్లో స్పష్టమైన మెజార్టీ
- సవాల్ చేస్తానన్న అబ్దుల్లా



అష్రాఫ్ ఘనీ



అబ్దుల్లా

**కాబూల్:** అఫ్గానిస్తాన్ అధ్యక్షుడుగా అష్రాఫ్ ఘనీ మళ్లీ ఎన్నికయ్యారు. ఎన్నికల సంఘం ఆదివారం ప్రాథమిక ఫలితాలను వెల్లడించింది. ఇందులో ఘనీ స్పష్టమైన ఆధిక్యాన్ని సాధించారు. అష్రాఫ్ ఘనీకి 50.64 శాతం ఓట్లు వస్తే, ఆయన ప్రత్యర్థి చీఫ్ ఎగ్జిక్యూటివ్ అబ్దుల్లా అబ్దుల్లాకు 39.52 శాతం ఓట్లు లభించాయి. ఇండిపెండెంట్ ఎన్నికల కమిషన్ (ఈఏసీ) తుది ఫలితాల్ని మరికొద్ది వారాల్లో ప్రకటించనుంది. ఈలోగా ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులెవరైనా ఫలితాలపై తమకేమైనా అభ్యంతరాలుంటే వ్యక్తం చేసే హక్కు ఉంది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేయొచ్చు. ఈ ఎన్నికలు పారదర్శకంగా జరగలేదని, ఫలితాల్ని సవాల్ చేస్తామని అబ్దుల్లా ప్రకటించారు. సెప్టెంబర్ 28న అఫ్గానిస్తాన్‌లో ఎన్నికలు జరిగాయి. అక్టోబర్ 19న ఫలితాల్ని వెల్లడించాల్సి ఉండగా సాంకేతిక సమస్యలు, ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని పదే పదే ఆరోపించడంతో ఫలితాల ప్రకటనలో తీవ్ర జాప్యం జరిగింది. ఎన్నికల పరిశీలకులు, పోటీ చేసిన అభ్యర్థులు ఈఏసీ సక్రమమైన పనితీరును కనబరచలేదని ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు. అయితే 2001లో తాలిబన్ల పాలన అంతం తర్వాత జరిగిన ఈ ఎన్నికలు పారదర్శకంగా జరిగాయని ఐక్యరాజ్య సమితి అంటోంది. జర్మనీ సంస్థ పంపిణీ చేసిన బయోమెట్రిక్ యంత్రాలు బాగా పనిచేశాయని పేరొచ్చింది. కానీ, లక్ష ఓట్ల వరకు గల్లంతైనట్టు ఎన్నికల పరిశీలకులు భావిస్తున్నారు. మరోవైపు తాలిబన్లతో అమెరికా జరిపిన చర్చలతో రాజకీయ అనిశ్చితి నెలకొంది. ఇక వారితో చర్చించడానికేమీ లేదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటిస్తే, అమెరికాతో కుదిరిన ఒప్పందం ప్రకారం అఫ్గానిస్తాన్‌లో ఏర్పడే ప్రభుత్వంతోనే చర్చిస్తామని తాలిబన్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో జరిగిన ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికల సంఘం అధ్యక్షురాలు హవా అలామ్ నురిస్తానీ తమకు అప్పగించిన బాధ్యతను నీతి, నిజాయితీ , చిత్తశుద్ధితో నిర్వహించామన్నారు.

### ఫలితాలు పారదర్శకంగా లేవు: అబ్దుల్లా

ఎన్నికల ఫలితాలు వెలువడగానే అబ్దుల్లా కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో..'మాకు ఓటు వేసిన ప్రజలకి, మద్దతుదారులకి, ఎన్నికల సంఘానికి, అంతర్జాతీయ మిత్రులకి మేం ఒకటే చెబుదామనుకుంటున్నాం. ఎన్నికల ఫలితాల్ని మేం అంగీకరించడం లేదు. చట్టపరంగా మేం చేస్తున్న డిమాండ్లు తీర్చాల్సి ఉంది''అని ఉంది.

# జార్ఖండ్ ఫలితాలు నేడే




రఘుబర్‌దాస్



హేమంత్ సోరెన్

**రాంచి:** జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 81 శాసనసభ స్థానాలకు నవంబర్ 30 నుంచి డిసెంబర్ 20 వరకు అయిదు దశల్లో పోలింగ్ జరిగింది. రాష్ట్రంలోని 24 జిల్లా కేంద్రాల్లో ఎన్నికల సంఘం కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేసింది. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు తొలి ఫలితం వెలువడే అవకాశాలున్నాయి. అధికార బీజేపీ, ప్రతిపక్ష జేఎంఎం–కాంగ్రెస్ కూటమి మధ్య ప్రధాన పోటీ ఉంది. రెండు పార్టీలు ఓటర్లను ఆకర్షించడానికి హోరాహోరీగా తలపడ్డాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా ఒక్కొక్కరు తొమ్మిదేసి ర్యాలీల్లో పాల్గొంటే, కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అయిదు, ప్రియాంక గాంధీ ఒక్క ర్యాలీలో పాల్గొన్నారు. జేఎంఎం నేత ప్రతిపక్ష కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి హేమంత్ సోరెన్ కీలకంగా మారారు. ముఖ్యమంత్రి రఘుబర్ దాస్ పోటీ చేసిన జంషెడ్‌పూర్ తూర్పు నియోజకవర్గంపైనే అందరి దృష్టీ ఉంది. 1995 నుంచి ఆయన ఈ స్థానం నుంచి గెలుపొందుతూ వస్తున్నారు. అయితే రఘుబర్ దాస్ సహచరుడు, మాజీ మంత్రి సరయూ రాయ్ బీజేపీ రెబెల్ అభ్యర్థిగా ఈ స్థానంలో నిలబడడంతో పోటీ రసవత్తరంగా మారింది. మెజార్టీ సంస్థల ఎగ్జిట్ పోల్స్ హంగ్ అసెంబ్లీ వస్తుందని అంచనా వేస్తుంటే, బీజేపీ తామే తిరిగి అధికారాన్ని దక్కించుకోవడం ఖాయమని ధీమాతో ఉంది. ఎవరి అంచనాలు నిజం కానున్నాయో మరికొన్ని గంటల్లో తేలిపోనుంది.



నల్లగొండ | సోమవారం
డిసెంబర్ | 23 | 2019
sakshisahityam@gmail.com


# ఒక ప్రాంతీయ రచయిత సార్వజన ఘోష

● పురస్కారం

"**బా**బ్రీ మసీదును రామజన్మభూమిగా విశ్వసిస్తే తప్ప హిందువు కాడంటే, నేను హిందువును కాను. నాస్తికుడైతే తప్ప కమ్యూనిస్టు కానేరడు అంటే, నేను కమ్యూనిస్టును కాను. అవినీతిని తాత్వీకరించుకున్న దొంగల రాజ్యంలో ఆ దోపిడీ స్వభావపు పాలనాధికారం కోసమే తమ దళిత రాజకీయాలు ఉన్నాయంటే, నేను దళితవాదిని కాను. భిన్న భిన్న ప్రాంతాల వివిధాత్మక జీవితాన్ని గుర్తించి ఆమోదిస్తే తప్ప నేను ప్రాంతీయ తాత్వికుణ్ణి కాలేను,'' అని స్పష్టంగా ప్రకటించుకున్న సాహిత్యకారుడు 'స్వామి'.

మానవ జీవితాన్నే గురువుగా గుర్తించి, తనదైన విలక్షణమైన చూపుతో జీవితపు చలన సూత్రాలను అన్వేషించే సాధకుడు స్వామి అనే పేరుతో ప్రసిద్ధుడైన బండి నారాయణ స్వామి. కథకుడుగా ప్రారంభించి, నవలలు రాసి, యిటీవల కాలంలో రాయలసీమ సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిణామాలపైన పరిశోధన వ్యాసాలు రాసిన స్వామి తొలినుంచీ తనదైన జీవితపు అస్తిత్వ మూలాలను తరచి చూడడంలోనే తన దృష్టినంతా కేంద్రీకరిస్తున్నాడు. యీ అన్వేషణ ఆయన కథల్లో బీజమై పుట్టి, నవలల్లో మర్రిచెట్లంత విశాలంగా పరుచుకుంటూ వస్తోంది. యీ అన్వేషణ క్రమంలోనే, అనంతపురం చారిత్రక నేపథ్యాల్ని సాహిత్యీకరించిన 'శప్తభూమి' నవల రాశాడు. దానికిప్పుడు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చినప్పుడు, తన ప్రాంతపు జీవన సంఘర్షణనిప్పుడు, మిగిలిన ప్రాంతాలవాళ్లు గూడా తెలుసుకుంటారనీ, రచయితలు అభిలషించే వొక ఆదర్శ ప్రపంచంవైపుకు నడవడానికి కొందరైనా సమాయత్తమౌతారనీ మాత్రమే స్వామి సంతోషిస్తాడు.

వానరాలే, నీళ్లు, సావుకూడు, అవశేషం వంటి తొలినాటి కథల్లో అనంతపురం జిల్లాలోని జీవిత పోరాటాల్ని చిత్రించడంతో స్వామి యీ అన్వేషణను ప్రారంభించాడు. "ఎవరు ఎన్ని నీళ్లు వాడతారో తెలిస్తే వాళ్ల నాగరికత ఏపాటిదో చెప్పెయ్యొచ్చు' అనేది ఒక సూక్తి. తాగడానికి ఒక కడవ నీళ్లు నోచుకోలేనివారికి ఏం నాగరికత ఉంటుంది?'' అని ముగిసే 'నీళ్లు' కథలో రచయిత వాపోయినట్టుగా కనిపించినా, అది నిజానికి నాగరికమని అనుకునే సంఘానికీ, ప్రజాస్వామ్యం అని పిలుచుకుంటున్న మన రాజకీయ వ్యవస్థకూ పెద్ద సవాలుగా మిగులుతుంది. పైనుంచీ నంగనాచి మాదిరి చూస్తావుండే ఆకాశం కింద వాన రాక కోసం యెగజూసుకుంటూ సంవత్సరాలకు సంవత్సరాలు గడిపే అనంతపురం జిల్లా రైతుల ఆక్రందనలను సాహిత్యీకరించడమే తన బాధ్యతగా గుర్తెరిగిన రచయిత స్వామి.



కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించిన బండి నారాయణ స్వామి


కరువు సీమలో మొగుడు చచ్చిపోయిన తర్వాత జరిగిన దివసాల రోజున, బంధువులు అందరూ మాంసాహారాల్ని గొంతుల వరకూ తిని వెళ్లిపోయిన తర్వాత, యింకా యేడుస్తూ కూర్చున్న ముసలాయన పెండ్లాం యేడుస్తున్నదెందుకో తెలిసేదెవరికి? "ఎవురెవురికి పుట్టిన నా కొడుకులో వచ్చి, గొంతువరకూ సించుకొని పోయిరి. నా ఇస్తరాకులో మాత్రము నాలుగు తునకలు ఎయ్యకపోతిరి కదరా! మీ కడుపులు దొక్కా! మీరు తునకలు తిని నా మొగానికి నీల్లు కలిపిన పులుసు పోస్తిరి కదరా!'' అంటూ ఆ ముసలావిడ తిట్టడం మొదలెడుతుంది. యివీ కరువు సీమల వ్యధలు.

వ్యక్తి, కుటుంబము, వూరు, సమాజము, మతము, రాజ్యం, ప్రపంచం– మనిషితో ముడిబడిన యీ విషయాల పైనంతా స్వామికి అక్కరే! "ప్రపంచం కుగ్రామం కావడం కాదు. కుగ్రామమే ఒక ప్రపంచం కావాలి'' అని యెలుగెత్తి చెప్పేవాడు స్వామి. అందుకే పై అంశాలలో దేన్నీ వదలకుండా అన్వేషిస్తాడు. యీ అన్వేషణలోనే ఆయన భారతీయమైన తాత్విక చింతనలోనూ మునిగిపోతాడు. జీవితపు మూల తత్వాన్ని తెలుసుకునే ప్రయత్నంలో నీడలమెట్లు, రెండు అబద్ధాలు, చమ్కీదండ, పద్మపాదం వంటి కథలూ అనేకం రాశాడు. వెతికేవాడికి యేదైనా దొరుకుతుందనీ, వొక్కోసారి ఎంత వెదికినా ఏదీ దొరక్కపోవచ్చుననీ, దొరికేదేదైనా వుంటే అది వాడిపోనీ, వాసన లేనీ చమ్కీదండే అవుతుందనీ స్వామి గ్రహిస్తాడు.

స్వామికున్న యీ అస్తిత్వ, సాంఘిక, రాజకీయ అన్వేషణలు కథల్లో వేరువేరుగా కనిపించినా, ఆయన యిటీవలి నవలల్లో మాత్రం ముప్పేటగా పెనవేసుకుపోతాయి.

నిత్య విద్యార్థిగా భారతీయ తాత్విక చింతనను అవుపోసన పట్టిన స్వామే అగ్ర శూద్ర కులాల రాజకీయ ఆధిపత్యంపైనా, జాతి ముఖంపైన రుద్దిన బ్రాహ్మణ కుల సంస్కృతిపైనా, రాజకీయ పాలెగాళ్లపైనా తిరుగుబాటును నిర్ద్వంద్వంగా ప్రకటిస్తాడు 'మీ రాజ్యం మీరేలండి' నవలలో. దళితుడు మరో దళిత కులంపైన అనుకంపన చెందే ఔన్నత్యాన్నీ, సనాతన సంస్కృతిని చెమట పరం చేసే శూద్రకులాల మూలాల్నీ, వ్యక్తిగత 'నేను'ను విచ్ఛేదం చేసే అద్వైత చింతననూ, కమ్యూనిస్టు సమాజాన్నీ ఆయన తన గమ్యంగా చూపిస్తాడు. అందుకే ఆ నవలను అంబటి సురేంద్రరాజు 'శూద్ర గాథా సప్తశతి అను అనంత జీవన ఇతిహాసం' అని పేర్కొంటాడు. కులాలూ, మతాలూ గాఢంగా వేర్లూనుకున్న భారతదేశంలో వైవిధ్యాలు లేని ఆర్థిక వర్గమొకటి రూపొందించగలమనే యూరోపియన్ భావనను వ్యతిరేకిస్తూ, ప్రతి అట్టడుగు కులమూ తనదైన సాంస్కృతిక వైవిధ్యాన్ని తాను పోషించుకుంటూనే, మిగతా అట్టడుగు కులాలతో కలిసి ఒక రాజకీయ ఎజెండా కింద ఐక్యమయ్యే బహుజన తాత్వికతను ఆపాదిస్తూ స్వామి 'రెండు కలల దేశమ్' నవల రాశాడు.

**రౌద్రమూ, బీభత్సమూ, విషాదమూ ముప్పిరిగొనే శప్తభూమి నవల చారిత్రక విభాత సంధ్యలో మానవ కథ వికాసమెట్టిదో నిరూపిస్తుంది.**



ప్రస్తుతాన్ని అర్థం చేసుకోడానికి చరిత్రలోకి ప్రయాణం చేసే లక్షణం స్వామిలో తొలినుంచీ వుంది. 'అవశేషం' కథలో ఆయన కురవ కులం వాళ్ల ఆచార వ్యవహారాలను చిత్రించిన తీరులో యీ ధోరణి స్పష్టంగా కనబడుతుంది. అనంతపురం చరిత్రను తెలుసుకోడానికి రచయిత కైఫీయత్తులను, శిలాశాసనాలనూ, గెజిట్‌లనూ, వీరగల్లులనూ అధ్యయనం చేశాడు. తన పరిశోధనలను తనదైన సామాజిక, తత్వశాస్త్ర అవగాహనలతో సాహిత్యీకరించి, 'శప్తభూమి' చారిత్రక నవలగా మలిచాడు. హండె హనుమప్ప నాయకుడి వంశస్థుడు సిద్దరామప్ప నాయుడి పరిపాలన కాలంలో జరిగిన సంగతులతో శప్తభూమి ప్రారంభమవుతుంది. ఆ కాలంనాటి ఆచారాలూ, వ్యవహారాలూ, నమ్మకాలూ, మొత్తం ఆనాటి సమాజాన్నీ, పాలేగాళ్ల వంటి రాజుల అరాచకపు పాలననూ, వాళ్ల పాదాల కింద పడి నలిగిపోయిన దళిత, బహుజన సముదాయాల ఘోషనూ యీ నవల నినదిస్తుంది.

రౌద్రమూ, బీభత్సమూ, విషాదమూ ముప్పిరిగొనే ఈ నవల చారిత్రక విభాత సంధ్యలో మానవ కథ వికాసమెట్టిదో నిరూపిస్తుంది. రచనతో బాటూ రచయిత గూడా ప్రయాణం చేయడం, దారిలో కొత్త సత్యాల్ని తెలుసుకోవడం యీ నవలలో గమనించవచ్చు. నవలను రాస్తున్నప్పుడు, అణగారిన వర్గాల వాళ్లంతా దళిత బహుజన కులాల వాళ్లేనని తెలిసిందనీ, అలా యీ నవల క్రమంగా రాయలసీమ దళిత బహుజన చారిత్రక నవలగా మారిందనీ రచయితే చెప్పుకున్నాడు.

చారిత్రక నవలలు పాశ్చాత్య సాహిత్యంలో చాలా వున్నాయి. చారిత్రక నేపథ్యాన్నీ, సత్యాల్నీ, కల్పనాత్మకమైన పాత్రలతోనూ, కథలతోనూ ముడిబెట్టే పాశ్చాత్య చారిత్రక నవలల్లాగే

'చెంఘిజ్‌ఖాన్'(తెన్నేటి సూరి), 'గోన గన్నారెడ్డి'(అడవి బాపిరాజు), విశ్వనాథ సత్యనారాయణ రాసిన నేపాళీ కాశ్మీరు రాజవంశ నవలలు కొన్ని తెలుగు చారిత్రక నవలా రచనకు దారి చూపించాయి. స్వామికి తనదైన తమ ప్రాంతపు మౌఖిక ధోరణిలో, తమ అనంతపురం మాండలికంలో రాయడమే యిష్టం. ఆయన శప్తభూమిని చారిత్రక నవల అని పిలిచినా ఆ నవల మునుపున్న చారిత్రక నవలల ధోరణిలో కాకుండా, తన స్వభావానికి అనుగుణమైన రూపంలో, సహజంగా రూపొందాలనే అనుకుంటాడు. శప్తభూమి, స్వామి ముద్ర స్పష్టంగా ఉన్న నవల. నవలంతా రచయితదైన కంఠస్వరం స్పష్టంగా వినబడుతూ వుంటుంది. చివరిలో రచయిత పజ్జెనిమిదవ శతాబ్దానికంతా గొంతుగా మారిపోయి "యిది ఈ సీడెడ్ జిల్లాల కథ. వదిలించుకున్న జిల్లాల కథ. పాలకులు పట్టించుకోని అనాథ భూమి కథ. ప్రతి కొత్తలోనూ ఒక పాత కొనసాగుతూవుండటమే వర్తమాన చరిత్ర. కరువు కాటకాలూ, పాలేగాళ్ల కొనసాగింపే కదా ఇప్పటికీ ఈ శప్తభూమి గాథ'' అని వ్యాఖ్యానిస్తాడు.

ఈ నవలకు అవార్డు రావడం సాహిత్యకారులందరికీ ఆమోదం కలిగించే విషయం. యీ శప్తభూమిని యికపైన అయినా సుఖసంతోషాల తీరం చేర్చే చిత్తశుద్ధి వున్న ప్రయత్నాలు మొదలైతేనే, సాహిత్యకారులతోబాటు రచయితా సంతోషపడతాడు.

◆ మధురాంతకం నరేంద్ర

● కొంత భాగం


## యజ్ఞమూ, మాంత్రికతా

**ఓ**రోజు సాయంత్రం అట్లాంటిక్ సముద్ర తీరంలో ఉన్న (ఐర్లాండ్) గ్రామంలో జార్జి థామ్సన్ పచార్లు చేస్తూ ఊరి బావి దగ్గరకు వెళ్లాడు. అక్కడ తెలిసినామె కనిపించింది. ఆమె ఒక వృద్ధ రైతుమహిళ. అప్పుడే బొక్కెనలో నీళ్లు నింపుకుని సముద్రం వైపు తదేకంగా చూస్తూ నిలబడి వుంది. ఆమె భర్త చనిపోయాడు. ఏడుగురు కొడుకులు. ఏడుగురూ 'కట్టకట్టుకుని'(ఆమె అభివ్యక్తి) మసాచూసెట్స్‌లోని స్ప్రింగ్‌ఫీల్డ్‌కు వెళ్లిపోయారు. కొద్ది రోజుల క్రితమే ఒక కొడుకు దగ్గరనుంచి ఆమెకు ఉత్తరం వచ్చింది. 'ఈ చివరి రోజుల్లో మా దగ్గర సుఖంగా ఉందువుగాని, వచ్చెయి, నువ్వు సరేనంటే ప్రయాణానికి డబ్బు పంపిస్తా'మని దాని సారాంశం. ఈ విషయం ఆమె థామ్సన్‌తో చెప్పింది. కొండలు, బండలు ఎక్కుతూ, ఎగుడు దిగుడు పచ్చికబీళ్ల మీద నడుస్తూ జీవితంలో తను పడిన కష్టాల గురించి, తను పోగొట్టుకున్న కోళ్ల గురించి, పొగచూరిన చీకటి గుయ్యారం లాంటి తన చిన్న ఇంటి గురించి వర్ణించుకుంటూ వచ్చింది. తర్వాత అమెరికా గురించి మాట్లాడటం మొదలుపెట్టింది. ఆమె ఊహలో అమెరికా అంటే బంగారపు దేశం. అక్కడ కాలిబాటల మీద కూడా బంగారం దొరుకుతుందట. ఆ తర్వాత, కొడుకులుండే కార్క్ నగరానికి రైలు ప్రయాణం గురించి, అట్లాంటిక్ దాటడం గురించి మాట్లాడింది. ఆపైన తన శరీరం ఐరిష్ మట్టిలోనే కలిసిపోవాలన్న తన చివరి కోరిక గురించి చెప్పింది.

ఆమె మాట్లాడుతున్నకొద్దీ ఉత్తేజితురాలు కావడం ప్రారంభించింది. ఆమె భాష క్రమంగా మరింత ప్రవాహగుణాన్ని సంతరించుకోసాగింది. అది మరింత ఆలంకారికతను, లయాత్మకతను, శ్రావ్యతనూ పుంజుకుంటూ వచ్చింది. ఆమె దేహం స్వాప్నికమైన ఒక ఊయలలో ఊగిపోతున్నట్టు అనిపించింది.

తను కవినన్న భావన ఏ కోశానా లేని ఈ నిరక్షరాస్య వృద్ధమహిళ మాటల్లో కవిత్వానికి ఉండే అన్ని లక్షణాలూ ఉన్నాయంటాడు థామ్సన్.

*పురా చరిత్రగా, సామాజిక పరిణామ చరిత్రగా మహాభారతాన్ని పరిశీలిస్తూ కల్లూరి భాస్కరం రాసిన వ్యాసాల సంపుటి 'మంత్ర కవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే'. హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించిన ఈ 800 పేజీల పుస్తకంలోంచి కొంత భాగం.*



ఇదొక పూనకం; కవిత్వం ఒక ప్రత్యేకమైన వాక్కు అంటాడు. కవిత్వం పుట్టుక గురించి తెలుసుకోవాలంటే వాక్కు ఎలా పుట్టిందో తెలుసుకోవాలి. వాక్కు ఎలా పుట్టిందో తెలుసుకోవడమంటే, మనిషి ఎలా అవతరించాడో తెలుసుకోవడమే. వాక్కు సామూహిక శ్రమలో భాగంగా పుట్టింది. శ్రమ చేసేటప్పుడు కండరాల కదలికకు అది సాయపడుతుంది. శ్రమలో భాగమైన వాక్కును శ్రమకు కారణంగా, లేదా చోదకంగా మనిషి అర్థం చేసుకున్నాడు. ఇప్పుడు మనం మాట అనుకుంటున్నది, అతని దృష్టిలో మాట కాదు, మంత్రం!

శ్రమ సాంకేతికత అభివృద్ధి చెందినకొద్దీ, శ్రమలో గొంతు పాత్ర తగ్గిపోతూ వచ్చింది. వ్యక్తులు సమూహంగానే కాక విడివిడిగా కూడా పనిచేసే స్థాయికి ఎదిగారు. అయితే సామూహిక ప్రక్రియ వెంటనే అదృశ్యం కాలేదు. అది, ఒక అసలు కార్యాన్ని ప్రారంభించబోయే ముందు ప్రదర్శించే రిహార్సల్ రూపంలో మిగిలింది. ఇంతకుముందు అసలు కార్యంలో భాగమైన సామూహిక కదలికలే ఒక నృత్యరూపంలో రిహార్సల్స్‌గా మారాయి. ఈ మూకాభినయ నృత్యం ఇప్పటికీ ఆదిమజాతులలో ఉంది. అయితే, నృత్యంలో వాచికాభినయం ఉన్న చోట, అది మాంత్రిక రూపం తీసుకుంది. అందుకే అన్ని భాషలలోనూ రెండు రకాల వాగ్రూపాలు కనిపిస్తాయి. నిత్యజీవితంలో మాట్లాడుకునే సాధారణ వాక్కు, కవితాత్మకమైన వాక్కు. ఈ విధంగా చూసినప్పుడు సాధారణ వాక్కు కంటే కవితాత్మకమైన వాక్కే ప్రాథమికమని తేలుతుంది.

వాళ్లకు తెలిసిన కవిత్వ రూపం పాట ఒక్కటే. వారి పాట, తీరిక సమయంలో పాడుకునేది కాదు. పనిలో భాగంగా పాడుకునేది. పని ద్వారా ఏ భౌతిక ప్రయోజనాన్ని ఆశిస్తారో పాట ద్వారా కూడా అదే భౌతిక ప్రయోజనాన్ని ఆశిస్తారు.

ఈ సందర్భంలో మావోరీలు(న్యూజిలాండ్) జరిపే పొటాటో నృత్యాన్ని థామ్సన్ ప్రస్తావించాడు. ఆడపిల్లలు ఆలుగడ్డలు పండించే పొలానికి వెళ్లి పంట ఎదుగుదలకు అవసరమైన తూర్పు గాలి వీస్తున్నట్టు, వర్షం పడుతున్నట్టు, పంట మొలకెత్తి పెరుగుతున్నట్టు తమ శరీరపు కదలికల ద్వారా సూచిస్తూ పాడుతూ నృత్యం చేస్తారు. అంటే, వాస్తవంగా తాము కోరుకునేది ఊహాత్మకంగా సాధిస్తారు. వాస్తవికమైన క్రియకు భ్రాంతిపూర్వక క్రియను జోడించడమే మాంత్రికత.

యుద్ధంలో విజయం సాధించడానికి ముందు యాగం జరుపుతారు. అది యుద్ధానికి రిహార్సల్స్. అందులో విజయాన్ని భ్రాంతిపూర్వకంగా ముందే సాధిస్తారు. ఆ భ్రాంతిపూర్వక విజయం అసలు విజయాన్ని కట్టబెడుతుందని నమ్మకం. వర్షాలు పడనప్పుడు సహస్రఘటాభిషేకం చేస్తారు. ఆ జల పుష్కలత్వం గురించిన భ్రాంతివాస్తవికత, వాస్తవికమైన జలపుష్కలత్వాన్ని ఇస్తుందని నమ్మకం.


మహాభారతంలో ఇటువంటి మాంత్రికతకు అద్దం పట్టిన ఘట్టాలలో సర్పయాగం, ద్రౌపదీ, దృష్టద్యుమ్నుల జన్మవృత్తాంతం ప్రముఖంగా చెప్పుకోదగినవి.

◆ కల్లూరి భాస్కరం

● ముందుమాట

## జీవనారణ్యంలో సాహసయాత్ర

*తానా నవలల పోటీలో రెండు లక్షల బహుమతి గెలుచుకున్న సన్నపు రెడ్డి వెంకటరామిరెడ్డి 'కొండపొలం'కు జంపాల చౌదరి రాసిన ముందుమాటలోంచి కొంతభాగం:*



**ద**ట్టమైన అడవిలో కొండలమీద చెట్లకింద పడుకున్న అనుభవం నాకు లేదు. అప్పుడప్పుడూ అడవులగుండా ప్రయాణం చేసినా, కారు అద్దాల భద్రత వెనుక నుండే నేను అడవిని చూసింది. నాకు తెలిసినవారిలోనూ అడవిలో బతికిన అనుభవం ఉన్న వాళ్లు తక్కువ. కానీ ఈ ఇరవై ఒకటవ శతాబ్దంలో ఇప్పటికీ, తెలుగుదేశంలో కొంతమంది మధ్యతరగతి మనుషులు తమ మీద ఆధారపడిన జీవాలను బతికించుకోవడానికి తమ గ్రామాలు విడిచి, కొన్ని నెలలపాటు అడవుల్లో సంచారం చేస్తూ, వందలయేళ్లకు ముందు తమ పూర్వీకులు బతికినట్టు బతకవలసి వస్తుందని తెలిసినప్పుడు ఆశ్చర్యం వేసింది.

నల్లమల అడవుల చుట్టుపక్కల గ్రామాల్లో వర్షాభావం చేత గొర్రెలకు తినడానికి మేత, తాగటానికి నీరు లేనప్పుడు, వర్షాలు పడేవరకు తమ గొర్రెలని బతికించుకోవటం కోసం గొర్రెలకాపరులు అడవిబాట పడతారు. మళ్లీ తమ ఊరిలో వానలు పడి గొర్రెలకు నీరు, మేత దొరికే వరకు అడవుల చుట్టూ సంచరిస్తుంటారు. ఇలా చేసే వనవాసాన్ని స్థానికులు కొండపొలం వెళ్లటం అని వ్యవహరిస్తారు. కొన్ని తరాలుగా ఈ గొర్రెల కాపరుల కుటుంబాలకు ఇలా తరచు కొండ పొలం పోవలసి రావటం తప్పకపోవటంతో, ఒక ప్రత్యేకమైన జీవనవిధానం, పద్ధతులు, ఆచారాలు ఏర్పడ్డాయి.

ఈ వనవాసానికి గుండె ధైర్యం ఉండాలి. ఎడగండునీ, చిరుబులినీ గుర్తుపట్టగలగాలి. పెద్ద పులి ఆనుపానులు తెలుసుకోగలగాలి. కొండ జ్వరం రాకుండా చూసుకోవాలి. ఈ నిత్యజీవిత సాహసయాత్రలో మనల్ని భాగస్వాములను చేస్తుంది ఈ కొండపొలం నవల.

ఈ సాహసయాత్రలో మనం వందలాది గొర్రెలను కాచుకొంటూ ఓబిలం (అహోబిలం) చుట్టుపక్కల పల్లెలపాయ, బింగోని బావి, గద్ద గూడుకొండ, చింతల సడ్డు, ఇనప సరూట్లు, రేగిమానుకొండ, గాలికుప్ప, తుమ్మమాని ఏనె, మబ్బుసెల, రాసాల చేను, పెద్దపులి సెల, దొంగ చెలిమ, కులుకుడు గుండాలు, జివ్విమాను బండ, ఒన్నూరమ్మ కోట, బాలప్పబావి వంటి ప్రాంతాలు తిరుగుతాము. అక్కడి బోడులు, మిట్టలు, పేటలు, కొండలు, ఏనెలు, సెలలు, వాగులు, వంకలు మనకు పరిచయమౌతాయి. భిల్లు, చందనం, ఏపె, సీకరేణి, సిరిమాను, పొలికె, తాండ్ర, మద్ది, సండ్ర వంటి రకరకాల చెట్లను చూస్తాము. పరిక్కాయ, ఈతకాయ, టూకీపండు, మోవిపండుల రుచులు తెలుస్తాయి. కొండల పైన, సెలలలోన మొలిచే అనేక రకాల గడ్డి మనకు కనిపిస్తుంది. నేంద్రగడ్డి కనిపిస్తే గొర్రెలు దబ్బగోగడిని, పీచుగోగడిని, బొచ్చుగడ్డినీ మూచూడవని గమనిస్తాము. ఎడుగండు ఎదురు పడితే గట్టిగా హడలుకొడితే చాలని, కానీ పెద్దపులి అలా జడవదని, మనమే దూరంగా తప్పుకోవాలని మన అనుభవానికి వస్తుంది. ముచ్చుగొర్రెకూ, బొల్లిగొర్రెకూ తేడా తెలుస్తుంది. మందలో కారుపొట్టేలు, దొడ్డిపొట్టేలు, తలపొట్టేళ్ల తరతమ స్థానాలు అర్థమవుతాయి. ఎదగొర్రెల యవనదశల వెంపర్లాటే కాదు; కొండచిలువల ప్రణయ కాండ గురించి కూడా తెలుస్తుంది.


ఆధునిక సాహిత్యంలో పశుపోషణ ముఖ్యాంశంగా ఉన్న కథలు, నవలలు తక్కువ. ఉన్న కొద్ది కథల్లోనూ వ్యవసాయానికి అవసరమైన పశువుల (ఎద్దుల) ప్రసక్తే ఎక్కువ. మన ప్రాంతాల్లోనూ, ప్రపంచపు నలుమూలల సంస్కృతులలోనూ కనిపించే గొర్రెల గురించి, గొర్రెలకాపరుల జీవితాల గురించి తెలుగులో వ్రాసినది తక్కువ. అలాగే తెలుగులో అడవి ముఖ్యపాత్రగా ఉండే పుస్తకాలూ తక్కువే; ఉన్న కొద్ది కూడా గిరిజనుల జీవితాల గురించి లేక నక్సలైటు ఉద్యమం గురించి రాసినవే. ఈ రెండు వస్తువులనీ కలుపుకొంటూ ఒక ప్రత్యేక జీవనపోరాటాన్ని మన కళ్ల ముందు ఆవిష్కరిస్తున్నారు సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి.

◆ జంపాల చౌదరి

● రారండోయ్

- అంపశయ్య నవీన్ 79వ జన్మదిన కార్యక్రమాలు డిసెంబర్ 24న సా. 5:30కు హన్మకొండలోని హరిత హోటల్‌లో జరగనున్నాయి. 'యాభై ఏళ్ల అంపశయ్య' స్వర్ణోత్సవ జ్ఞాపిక, 'కన్యాశుల్కం నాటకాన్ని తెలుగువాళ్లెవరూ సరిగ్గా అర్థం చేసుకోలేదా' వ్యాస సంపుటి ఆవిష్కరణ జరగనుంది. ఆవిష్కర్తలు: ఘంటా చక్రపాణి, బన్న అయిలయ్య. అంపశయ్య నవీన్ లిటెరరీ ట్రస్టు ప్రథమ నవలా పురస్కారాలను నామని సుజనాదేవి (ఐ లవ్ మై ఇండియా), తాళ్లపల్లి యాకమ్మ (ఉద్యమ కెరటం), ఝాన్సీ కొప్పిశెట్టి (అనాచ్ఛాదిత కథ)కి అందిస్తారు.
- సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 'కొండపొలం' ఆవిష్కరణ డిసెంబర్ 25న ఉదయం 10:30కు రవీంద్రభారతి మినీ ఆడిటోరియంలో జరగనుంది. శీలా వీర్రాజు, కె.శ్రీనివాస్, మృణాళిని, కాత్యాయనీ విద్మహే, అంపశయ్య నవీన్, వాసిరెడ్డి నవీన్ పాల్గొంటారు. నిర్వహణ: కథాసాహితి.
- దేశరాజు 'దుర్గాపురం రోడ్' పరిచయ సభ డిసెంబర్ 25న సాయంత్రం 6 గంటలకు హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జరగనుంది. శివారెడ్డి, దర్భశయనం, సిద్ధార్థ, శ్రీరామ్ పాల్గొంటారు. నిర్వహణ: ఛాయ.
- తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర స్థాయి కథా రచన కార్యశాల డిసెంబర్ 25, 26 తేదీల్లో కరీంనగర్‌లోని ఆల్ఫోర్స్ స్కూల్‌లో జరగనుందని తెరవే ప్రధాన కార్యదర్శి కొండి మల్లారెడ్డి తెలియజేస్తున్నారు. ప్రారంభ సమావేశంలో అంపశయ్య నవీన్, అల్లం రాజయ్య, రామా చంద్రమౌళి, జూకంటి జగన్నాథం, నలిమెల భాస్కర్, గాజోజు నాగభూషణం పాల్గొంటారు.
- కల్లూరి భాస్కరం 'మంత్రకవాటం తెరిస్తే మహాభారతం మన చరిత్రే' ఆవిష్కరణ డిసెంబర్ 29న సాయంత్రం 5:30కు హైదరాబాద్ బుక్ ఎగ్జిబిషన్ ప్రాంగణం, ఎన్టీఆర్ స్టేడియంలో జరగనుంది. అధ్యక్షత: బి.విజయ భారతి. వక్తలు: వాడ్రేవు చినవీరభద్రుడు, పూడూరి రాజిరెడ్డి. ప్రచురణ: హైదరాబాద్ బుక్ ట్రస్ట్.
- 'అంబర్‌పేట: ఆకాశానికి పూచిన మందారం' ఆవిష్కరణ డిసెంబర్ 29న ఉ. 10 గం.కు అంబర్‌పేటలోని అశోక ఫంక్షన్ హాల్‌లో జరగనుంది. ఆవిష్కర్తలు: జి.కిషన్ రెడ్డి, వి.హనుమంతరావు. నిర్వహణ: లయ పబ్లికేషన్స్.
- రాజాం రచయితల వేదిక ఆధ్వర్యంలో డిసెంబర్ 29న ఉదయం 9:30కు రాజాంలోని విద్యానికేతన్‌లో 'వివిధ రామాయణ గాథలు-విభిన్న ఆలోచనలు' అంశంపై రౌతు గణపతిరావు నాయుడు ప్రసంగిస్తారు.
- ఆచార్య వాసిరెడ్డి భాస్కరరావు పేరిట వరంగల్ అభ్యుదయ రచయితల సంఘం ఇస్తున్న సాహితీ పురస్కారాన్ని 'వెంట వచ్చునది' కథా సంపుటికిగానూ ఎమ్వీ రామిరెడ్డికి ఇవ్వనున్నారు. ప్రదానం, డిసెంబర్ 29న హన్మకొండలో జరిగే కార్యక్రమంలో. పెనుగొండ లక్ష్మీనారాయణ, ఆర్.వి.రామారావు పాల్గొంటారు.
- 'సోమనాథ కళా పీఠం – 2018' పురస్కారాలను డిసెంబర్ 29 నాడు పాలకుర్తిలో ప్రదానం చేయనున్నారు. పురస్కార గ్రహీతలు: సత్తెనపల్లి బాబు, 'లింగైక్య' కొండ బసవరాజు, ఏరుకొండ రామదాసు, మౌనశ్రీ మల్లిక్, ఐత చంద్రయ్య, ఎస్.ఆర్. పృథ్వీ, పెంతల సుధాకర్.
- 2019 సంవత్సరపు రంగినేని ఎల్లమ్మ సాహిత్య పురస్కారానికి శ్రీరామ్ పుప్పాల కవితా సంపుటి 'అద్వంద్వం' ఎంపికైనట్టు కార్యదర్శి మద్దికుంట లక్ష్మణ్ తెలియజేస్తున్నారు. పురస్కారం కింద పదిహేను వేల నగదు ఇస్తారు. 2020 జనవరి మూడో వారంలో సిరిసిల్లలోని రంగినేని సుజాతా మోహన్‌రావు ట్రస్ట్ ఆవరణలో జరిగే కార్యక్రమంలో ప్రదానం ఉంటుంది.

● ఈవారం పుస్తకాలు



**అస్తిత్వ: ప్రాతినిధ్య తెలంగాణ కథలు**
సంపాదకులు: నందిని సిధారెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి, కె.పి.అశోక్ కుమార్, ఆడెపు లక్ష్మీ పతి, ఏనుగు నరసింహారెడ్డి; పేజీలు: 440 ; వెల: 250

**నాగర్‌కర్నూల్ జిల్లా సాహిత్య చరిత్ర**
రచన: గుడిపల్లి నిరంజన్; పేజీలు: 100 ; వెల: 40

**వనపర్తి జిల్లా సాహిత్య చరిత్ర**
రచన: కోట్ల వెంకటేశ్వర రెడ్డి; పేజీలు: 60 ; వెల: 30
అన్నింటి ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమీ, కళాభవన్, రవీంద్ర భారతి ప్రాంగణం, హైదరాబాద్-4. ఫోన్: 040-29703142

### గ్రహం అనుగ్రహం

శ్రీవికారినామ సంవత్సరం. దక్షిణాయనం, హేమంత ఋతువు. మార్గశిర మాసం. తిథి బ.ద్వాదశి ప.1.45 వరకు, తదుపరి త్రయోదశి. నక్షత్రం విశాఖ రా.7.23 వరకు, తదుపరి అనూరాధ. వర్జ్యం రా.10.10 నుంచి 11.43 వరకు. దుర్ముహూర్తం ప.12.19 నుంచి 1.05 వరకు, తదుపరి ప.2.30 నుంచి 3.14 వరకు. అమృత ఘడియలు ఉ.9.54 నుంచి 11.26 వరకు

**సూర్యోదయం:** 6.30 **సూర్యాస్తమయం :** 5.27
**రాహుకాలం :** ఉ.7.30 నుంచి 9.00 వరకు.
**యమగండం :** ఉ.10.30 నుంచి 12.00 వరకు

### నమాజ్ వేళలు

ఫజర్ : 5.25
జొహర్ : 12.15
అసర్ : 4.12
మగ్రీబ్ : 5.48
ఇషా : 7.05

● రీ విజిట్

**అ**ఫ్సర్ నలభై యేళ్ల సమగ్ర కవిత్వం (1979–2019) 'అప్పటినుంచి ఇప్పటి దాకా' ఈ శుక్రవారం సాలార్జంగ్ మ్యూజియంలో ఆవిష్కరణ అయింది. ప్రచురణ: చిత్రలేఖ ప్రొడక్షన్స్. దానికిముందు కవి జీవితపథాన్ని తెలియజేసే ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభించారు, ఒక వీడియో ప్రదర్శించారు(ప్రొడ్యూసర్: కిరణ్ చర్ల), కొన్ని కవితల్ని ఫ్రేములు కట్టి వేలాడదీశారు. ఏ కవి అయినా కలలుగనే, ఎంతటివారికైనా పట్టదేమో అనిపించేంతటి యోగం! సాహిత్య పోషకుడు బి.నర్సింగరావు ఇల్లే ఇది సాధ్యపడి ఉంటుంది. ఫ్రేముల్లోని ఒక కవిత:



## దూరం

**మ**రణాన్ని అడిగి
ఓ మూడు క్షణాలు
అరువు తెచ్చుకున్నాను.

మరుక్షణం
మరణం నెత్తిమీద
నా నాలుగో క్షణాన్ని
యుద్ధానికి పంపాను.


తీగ మీద నడక
ఎంత కష్టం!

ప్రతీసారి తీగమీద ఆరేయలేక
రాలిపోయిన ఎన్ని మాటల్ని
ఎన్ని శ్వాసల్ని ఏరుకుని
మళ్ళా
జేబులో దోపుకొని వచ్చేస్తుంటానో!
పలికిన మాటల మధ్య
పలకని మాటల నిశ్శబ్దం బాధిస్తుంది.

పెదాల చప్పుడొక్కటే విని
గుండె చప్పుడిని
సమాధి చేసుకుని
వెనక్కి వచ్చేస్తాను.

◆ అఫ్సర్

'మూఢ నమ్మకాల మాటొద్దు'
అనే నా ఈ కొత్త పుస్తకాన్ని
ఆవిష్కరించడానికి మంచి ముహూర్తం
చూడండి గురూజీ!



మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం ॥ 23-12-2019



శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్



కింగ్ లిన్స్ స్టేషన్‌లో రైలు నుంచి దిగుతున్న బ్రిటన్ రాణి



# రాణి వెడలె

**క్రిస్మస్‌కింకా రెండు రోజుల సమయం ఉంది. బ్రిటన్ ప్రజలు మాత్రం గత శుక్రవారమే అధికారికంగా క్రిస్మస్ మూడ్‌లోకి వచ్చేశారు. ఇది ఏటా ఉండేదే. క్వీన్ ఎలిజబెత్-2 లండన్‌లోని తన అధికార నివాసం బకింగ్‌హామ్ ప్యాలెస్ నుంచి అక్కడికి నూట పన్నెండు మైళ్ల దూరంలోని శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌కు రైల్లో బయల్దేరగానే బ్రిటన్ అంతటా క్రిస్మస్ సందడి మొదలౌతుంది.**

**తొం**భై మూడేళ్ల బ్రిటన్ రాణిగారు ఎప్పటిలా ఈ ఏడాది కూడా సాధారణ ప్రయాణీకుల రైల్లోనే తనకోసం ప్రత్యేకంగా ఒక బోగీని రిజర్వు చేయించు కుని డిసెంబరు 20న కింగ్ లిన్స్ స్టేషన్‌లో దిగారు. శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్ అక్కడికి దగ్గర్లోనే ఉంటుంది. ఆమె తండ్రి ఆరవ జార్జి, తాత ఐదవ జార్జి నివసించిన రాజప్రాసాదం అది.

**అతి ముఖ్యులు ఆఖర్న**

ప్రతి క్రిస్మస్‌కీ కుటుంబంతో పాటు శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లో గడిపి వెళ్తారు క్వీన్ ఎలిజబెత్. మొదట ఆమె, ఆమె భర్త ప్రిన్స్ ఫిలిప్ వెళ్తారు. వాళ్ల వెనుక మిగతావాళ్లు. ఆ మిగతావాళ్లు కూడా ఎవరు పడితే వాళ్లు రైలు ఎక్కేయడానికి లేదు. దానికో క్రమం ఉంటుంది. క్వీన్, ప్రిన్స్ వెళ్లాక.. ఇక ఆ వంశంలో వయసులో బాగా చిన్నవాళ్లు ఎవరైతే ఉన్నారో వాళ్లు బయల్దేరి వెళ్లారు. అందరి కన్నా చివర్లో 'అతి ముఖ్యులు' ఎస్టేట్‌కు చేరుకుంటారు. ఆ అతి ముఖ్యులు ఎవరంటే.. వారసత్వ స్థానానికి ప్రాధాన్యతా క్రమంలో ఉన్న క్వీన్ కుమారుడు ప్రిన్స్ చార్లెస్, ఆ కుమారుడి కుమారుడు ప్రిన్స్ విలియమ్స్, విలియమ్స్ భార్య కేట్ మిడిల్‌టన్.. అలా ఉంటుంది సంప్రదాయం. ఈసారి క్వీన్ ఎలిజబెత్‌తో పాటు ప్రిన్స్ ఫిలిప్ కూడా శాండ్రింగ్‌హామ్ ప్రయాణానికి సిద్ధం అయినప్పటికీ శుక్రవారం ఉదయం ఒంట్లో కాస్త నలతగా అనిపించడంతో ఆయన్ని లండన్‌లోని కింగ్ ఎడ్వర్డ్ సెవెన్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు తరలించవలసి వచ్చింది. ''98 ఏళ్ల వయసులో ఇవి అవసరమైన పరీక్షలే తప్ప అకస్మాత్తు పరీక్షలేమీ కావు'' అని రాజ వైద్యుడు చెప్పడంతో క్వీన్ తన మనసును కుదుటపరచుకుని తనొక్కరే శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌కు వెళ్లవలసి వచ్చింది. ముందుగా నిర్ణయించిన సమయం కాబట్టి వెళ్లి తీరవలసి వచ్చింది.

**రెండు విందు భోజనాలు**

ఏటా రాజ కుటుంబం అంతా ఈ ఎస్టేట్ లోనే క్రిస్మస్ ఈవ్, క్రిస్మస్ డే వేడుకలు జరుపుకుంటుంది. క్రిస్మస్ ఈవ్, క్రిస్మస్ ఒకటి కాదు. క్రిస్మస్ కోసం ఎదురు చూసే ముందురోజు సాయం సమయం అంతా క్రిస్మస్ ఈవ్ అయితే, ఆ మర్నాడు చేసుకునేది క్రిస్మస్. శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లో క్రిస్మస్ ఈవ్‌కి రాజకుటుంబం 'బ్లాక్ టై డిన్నర్' చేస్తుంది. కానుకలు ఇచ్చిపుచ్చుకుంటుంది. క్రిస్మస్ రోజు టర్కీ కోడి విందు భోజనం ఎలాగూ ఉంటుంది. ముఖ్యమైన బయటి వ్యక్తులతో కలిసి చేసే డిన్నర్ 'బ్లాక్ టై డిన్నర్' అయితే, కుటుంబ సభ్యులు మాత్రమే కలిసి చేసేది టర్కీ కోడి విందు. దీనినే టర్కీ ఫీస్ట్ అంటారు. ఇలా అనడం వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. పూర్వం రైతులు పాల కోసం పశువుల్ని, గుడ్ల కోసం కోళ్లను తమ దగ్గర ఉంచుకుని, టర్కీ కోళ్ల ను మాత్రమే మాంసం కోసం అమ్మేవారట! పైగా అప్పట్లో పశువులు, కోళ్ల ధర ఎక్కువగా ఉండటం అందుకొక కారణం అంటారు. ఏదైనా టర్కీ ఫీస్ట్ అనేది బ్రిటన్‌లోనే కాదు, ఒక్క క్రిస్మస్ రోజే కాదు.. అన్ని పాశ్చాత్య దేశాలలో, అన్ని వేడుకలలో సంప్రదాయం అయింది.

**గిలిగింతల కానుకలు**

క్రిస్మస్ ఈవ్‌కి రాజమాత కుటుంబ సభ్యులు ఇచ్చిపుచ్చుకునే కానుకలు కూడా ప్రత్యేకమైనవిగా ఉంటాయి. ప్రత్యేకమైనవే తప్ప ఖరీదైనవి కాదు. పైగా మనసును ఉల్లాసపరిచేలా ఉంటాయి. తేనీటి విందు సమయంలో అందరూ కూర్చొని ఆ కానుకలను తెరచి చూసుకుంటారు. ఓ క్రిస్మస్ ఈవ్‌కి ప్రిన్స్ హ్యారీ తన నానమ్మకి (క్వీన్ ఎలిజబెత్‌కి) షవర్ క్యాప్‌ని గిఫ్టుగా ఇచ్చారు! షవర్ క్యాప్ అంటే స్నానం చేసేటప్పుడు తలపై షవర్ నీళ్లు పడకుండా పెట్టుకునేది. ఆ క్యాప్‌పైన 'ఎయింట్ లైఫ్ ఎ బి****' అని రాసి ఉంది. దాన్ని చూసి క్వీన్ తన మనవడి తాత్వికతకు మురిపెంగా నవ్వుకున్నారు. కష్టాలు వెంటపడి తరుముతున్నప్పుడు. 'జీవితం ఏం బాగాలేదు' అని చెప్పడానికి మొరటుగా వాడే మాట ఇది. హ్యారీ భార్య మేఘన్ మార్కెల్ ఇచ్చిన సింగింగ్ హామ్‌స్టర్ (మైకు పట్టుకుని పాట పాడే ఎలుక బొమ్మ) కూడా క్వీన్ ఎలిజబెత్‌ను నవ్వించింది. ఎలిజబెత్ ఏకైక కుమార్తె ప్రిన్సెస్ యాన్ తన అన్న ప్రిన్స్ చార్లెస్‌కి లెదర్ టాయిలెట్ సీట్‌ను కానుకగా ఇచ్చారు. కేట్ మిడిల్టన్ తన మరిది ప్రిన్స్ హ్యారీకి 'గ్రో-యువర్-ఓన్-గర్ల్‌ఫ్రెండ్' కిట్‌ను ఇచ్చారు. ఎదిగే ఆడపిల్లలకు ఇచ్చే బొమ్మల కిట్ అది. ఈ నవ్వుల కానుకల సంప్రదాయం గురించి తెలియక ప్రిన్సెస్ డయానా రాజప్రాసాదంలో కొత్త కోడలిగా అడుగు పెట్టిన మొదటి ఏడాది క్రిస్మస్ ఈవ్‌కి ఇంట్లో వాళ్లందరికీ ఖరీదైన కాష్మియర్ స్వెట్టర్లు, (కశ్మీర్ స్వెట్టర్లు కాదు), మెహెయిర్ స్కార్ఫ్‌లు ఇస్తే అందరూ ఆమెను ఆటపట్టించారట. ఈ క్రిస్మస్‌కి ఎవరు ఎవరికి ఎలాంటి కానుకలు సిద్ధం చేసి ఉంచారో మరి.

**ఈసారి కొంచెం లేట్**

వాస్తవానికి క్వీన్ ఎలిజబెత్ ఇంకాస్త ముందుగానే శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌కి వెళ్లవలసి ఉన్నప్పటికీ ఇటీవలి బ్రిటన్ ఎన్నికల కారణంగా ఆమె ప్రయాణం కొంచెం ముందుకు జరిగింది. ఇప్పుడిక క్రిస్మస్ అయ్యాక కూడా రాణిగారు ఆ ఎస్టేట్ లోనే మరికొన్ని రోజులు గడిపే అవకాశాలు ఉన్నాయి. పిల్లలు, మనవలు, మునిమనవలు.. అంతా ఒకేసారి, ఒకే చోట ఆనందంగా కలుసుకునేందుకు ఏటా క్రిస్మస్ తనకు ఇచ్చే మహద్భాగ్యాన్ని రాణిగారు అంత తేలిగ్గా ఏమీ విడిచి పెట్టరు అని బ్రిటన్ రాజకుటుంబీకుల వర్తమానాన్ని ఎప్పటికప్పుడు లిఖిస్తుండే బయోగ్రఫర్‌లు అంటుంటారు.

---

## వరుడి వేట

# అమ్మకు పెళ్లి

**పెద్దవాళ్లకు పిల్లలు పెళ్లి చేయడం అనే కాన్సెప్ట్‌ని 'మా నాన్నకు పెళ్లి' సినిమాలో చూశాం. ఆ రీల్ లైఫ్‌లో కొడుకు తన తండ్రి కోసం వధువును వెతుకుతాడు. ఈ రియల్ లైఫ్‌లో పిల్లలు కుదిర్చిన పెళ్లిళ్లన్నీ అమ్మల కోసమే.**

''మా అమ్మకు అందమైన యాభై ఏళ్ల వరుడి కోసం అన్వేషిస్తున్నాం. వరుడు శాకాహారి అయి ఉండాలి. మద్యం అలవాటు ఉండకూడదు. జీవితంలో చక్కగా ఎదిగిన వ్యక్తి అయి ఉండాలి'' – ఇది ఆస్థా వర్మ అనే ఢిల్లీకి చెందిన లా స్టూడెంట్ పెట్టిన ట్వీట్. ఈ ట్వీట్ తోపాటు తల్లితో తానున్న ఫొటో కూడా పెట్టింది ఆస్థా వర్మ. ఈ ట్వీట్‌కి 33 వేల లైక్‌లు వచ్చాయి. ఏడు వేల రీ ట్వీట్‌లు వచ్చాయి. వారిలో ఎక్కువ మంది ఆమె ప్రయత్నాన్ని హర్షించారు. కొద్దిమంది మాత్రం 'ఇదేం పని' అని అన్నారు. మరికొందరైతే ఏకంగా ట్రోలింగ్‌కి దిగారు. ట్విట్టర్‌లో తనకు వ్యతిరేకంగా వచ్చిన రెస్పాన్స్‌కు ఆస్థా వర్మ ఏ మాత్రం వెనుకడుగు వేయలేదు. ''మా అమ్మ టీచర్. ఉన్నత విద్యావంతురాలు. ఎక్కువమంది నా ప్రయత్నాన్ని అర్థం చేసుకున్నందుకు కృతజ్ఞతలు. మా అమ్మకు దూరమైన ప్రేమను ఆమెకు తిరిగి అందివ్వాలనుకుంటున్నాను'' అని తిరిగి ట్వీట్ చేసింది.

•••

గోకుల్ శ్రీధర్‌ది కేరళ, కొల్లాం జిల్లా. గోకుల్ తల్లి మినీ అయ్యప్పన్‌ది విషాదభరితమైన వైవాహిక జీవితం. గోకుల్ పదవ తరగతికి వచ్చే వరకు తన తండ్రి తరచూ తల్లిని కొట్టడం, తల్లి మౌనంగా భరించడం చూస్తూనే ఉన్నాడు. ఓ రోజు తండ్రి కొట్టిన దెబ్బలకు తల్లి నుదురు చిట్లి రక్తం కారడం చూసిన గోకుల్ ''ఎందుకమ్మా మౌనంగా భరిస్తున్నావ్'' అని అడిగాడు. ''నీ కోసమే'' అంటూ కొడుకును దగ్గరకు తీసుకుంది ఆమె. ''మనిద్దరం మన కష్టంతో బతుకుదాం రామ్మా'' అని తల్లిని ఇంటి నుంచి తీసుకొచ్చేశాడు గోకుల్. మినీ కొల్లాంలో లైబ్రేరియన్‌గా చేరింది. కొన్నేళ్లకు గోకుల్ పైచదువుల కోసం తల్లిని వదిలి వెళ్లాల్సి వచ్చినప్పుడు ''అమ్మా! కష్టాల కడలి నుంచి నిన్ను బయటకు తీసుకొచ్చాను. ఇప్పుడు నిన్ను ఒంటరిగా వదిలి దూరంగా వెళ్తున్నాను. నా చదువు పూర్తయ్యే వరకు నాకు టైమివ్వు. జీవితంలో నువ్వు కోల్పోయిన ప్రేమను, నిన్ను ప్రేమించే వ్యక్తిని నీ కోసం వెదకి తెస్తాను'' అని మాటిచ్చాడు. కొడుకు మాటలకు నవ్వి ఊరుకుంది మినీ. ఆ సంగతి మర్చిపోయింది కూడా. అయితే గోకుల్ ఇంజనీరింగ్ పూర్తయిన తరవాత తన పెళ్లి కోసం ప్రయత్నాలు చేస్తున్నాడని తెలిసి అయోమయంలో పడిందామె. ఒంటరి జీవితానికి అలవాటు పడుతున్నానని, తనను ఇలాగే జీవించనివ్వమని చెప్పింది. తల్లిని కన్విన్స్ చేయడంతో పాటు ఆమె పరిస్థితిని అర్థం చేసుకునే వ్యక్తిని వెతికి పెట్టాడు గోకుల్. తల్లి కోసం వెతికిన పెళ్లి కొడుకు పేరు కె. వేణు. ఆర్మీలో కల్నల్‌గా రిటైర య్యారు. భార్య మరణించింది. ఒక కొడుకు, కూతురు. వాళ్లు జీవితాల్లో స్థిరపడ్డారు. గోకుల్ చేసిన ఈ పెళ్లిని సోషల్ మీడియాలో 43 వేల మంది లైక్ చేశారు.



• గోకుల్ శ్రీధర్; వేణు – మినీ అయ్యప్పన్



• తల్లి గీత వివాహం నిర్వహించిన సంహిత (మధ్య)



• తల్లితో ఆస్థా వర్మ



• నాథూభాయ్ పటేల్ – తార

•••

గుర్‌గావ్‌కి చెందిన సంహిత అగర్వాల్ తన తల్లి గీతకు రెండేళ్ల కిందట ఇలాగే పెళ్లి చేసింది. నాలుగు వందల మంది అతిథులతో వైభవంగా పెళ్లి వేడుక నిర్వహించింది సంహిత.

అలాగే భర్తను కోల్పోయిన తారకు ఆమె కొడుకు సుశాంత్, కోడలు నేహ కలిసి పెళ్లి ఖాయం చేశారు. ''యాభై ఏళ్ల వయసులో ఒంటరితనాన్ని భరించడం చాలా కష్టమని, స్నేహం, ప్రేమ లేకుండా రోజు గడపడం దుర్భరంగా ఉంటుందని' ఆమెకు నచ్చచెప్పి ఒప్పించారు. సుశాంత్ తన తల్లి కోసం ఓఎన్‌జీసీలో ఉద్యోగం చేస్తున్న 57 ఏళ్ల నాథూభాయ్ పటేల్‌తో ఇటీవలే పెళ్లి కుదిర్చాడు.

గోకుల్, సుశాంత్, సంహిత అమ్మ కోసం వరుణ్ని వెతికారు. ఇప్పుడు తాజాగా ఆస్థావర్మ కూడా వాళ్ల అమ్మ కోసం వరుణ్ని వెతికే పనిలో పడింది. జీవితం విలువ తెలిసిన ఈ పిల్లలు కొత్త ట్రెండ్‌ని సెట్ చేస్తున్నారు. సమాజానికి కొత్త విలువల పాఠాలు చెబుతున్నారు.

**– మను**

---

## ఛపక్

# ధైర్య ప్రదాతలు

**'యాసిడ్ పడింది మా ముఖం మీద మాత్రమే, మా మనో ధైర్యం అలాగే ఉంది'.. యాసిడ్ బాధితులు ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్తున్న మాట ఇది. యాసిడ్ దాడికి గురైన లక్ష్మీ అగర్వాల్ జీవితం 'ఛపక్' పేరుతో సినిమాగా వస్తోంది. చిన్నతనంలో భయంకరమైన యాసిడ్ దాడికి గురైన లక్ష్మీ అగర్వాల్ పెద్దయిన తర్వాత ప్రభుత్వం యాసిడ్ అమ్మకాల మీద నియంత్రణ విధించే వరకు పోరాటాన్ని కొనసాగించారు. ఆ పాత్రనే ఛపక్‌లో దీపికా పదుకోన్ నటిస్తున్నారు. సినిమా జనవరి 10న విడుదల అవుతోంది. ఇప్పటికే ట్రెయిలర్ రిలీజ్ అయ్యి ప్రశంసలను అందుకుంటోంది.**

**లక్ష్మి**లా.. భస్మం నుంచి ఫీనిక్స్‌లా లేచిన ధీరలెందరో. వాళ్లు నేటి సమాజంలో పోరాడుతూ ఉన్నారు, సమాజంతో పోరాడుతూ ఉన్నారు. వారిలో ముగ్గురు... ప్రగ్యాసింగ్, దౌలత్ బీ ఖాన్, అన్‌మోల్ రోడ్రిగ్స్. ఈ ముగ్గురి గురించి క్లుప్తంగా.



'ఛపక్'లో దీపికా పదుకోన్



• లక్ష్మి అగర్వాల్

### పెళ్లొద్దన్నందుకు

ప్రగ్యా సింగ్ 2006లో వారణాసి నుంచి ఢిల్లీ వస్తోంది. అప్పటికి ఆమెకు 23 ఏళ్లు, పెళ్లయి పన్నెండు రోజులైంది. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో, ఆమె రైల్లో గాఢ నిద్రలో ఉండగా ఒక్కసారిగా ఆమె ముఖం మీద యాసిడ్ చిమ్మింది. దాడి చేసిన వ్యక్తి గతంలో ఆమెను పెళ్లాడాలని అడిగి ఆమె నిరాకరించడంతో కోపం పెట్టుకున్నవాడు. అతడి ప్రకోపానికి గురయింది ప్రగ్యాసింగ్. ప్రాణాపాయం నుంచి కోలుకున్న తర్వాత ఆమె మామూలు కావడానికి పదిహేనుకు పైగా సర్జరీలయ్యాయి. ఇప్పుడామె.. భర్త, స్నేహితుల సహకారంతో 'అతిజీవన్ ఫౌండేషన్' అనే ఎన్‌జీవోను స్థాపించి, యాసిడ్ బాధితులకు ధైర్యాన్నిస్తోంది. ఉచితంగా ట్రీట్‌మెంట్ ఇప్పిస్తోంది. వాళ్ల కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులు నిర్వహిస్తోంది. ఇద్దరు బిడ్డలతో సంతోషంగా జీవిస్తున్న తన జీవితాన్నే ఆదర్శంగా తీసుకోవలసిందిగా ఆమె బాధితుల్లో స్ఫూర్తిని పెంచుతోంది.



• ప్రగ్యాసింగ్

### గృహ హింస



• దౌలత్

దౌలత్ బీ ఖాన్‌ది ముంబయి. ఇరవై ఆరేళ్ల వయసులో తన పెద్దక్క, బావల నుంచే గృహ హింసలో భాగంగా యాసిడ్ దాడికి గురైందామె! ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొంటూ 2016లో 'సాహస్ ఫౌండేషన్' స్థాపించి యాసిడ్ దాడికి గురైన బాధితులకు భరోసాగా నిలుస్తోంది. వైద్య సహాయంతో పాటు వారికి న్యాయపరమైన సహాయం కూడా అందిస్తోంది. బాధితులు సౌకర్యంగా పని చేసుకోగలిగిన ఉద్యోగాలను గాలిస్తూ వారిని ఆ ఉద్యోగాల్లో చేరుస్తోంది దౌలత్.

### పాపాయిగా ఉన్నప్పుడే!




• అన్‌మోల్

అన్‌మోల్ పరిస్థితి మరీ ఘోరం. రెండు నెలల పాపాయిగా ఉన్నప్పుడు యాసిడ్ దాడికి గురైంది. ఆడపిల్ల పుట్టిందని భార్యాబిడ్డలను హతమార్చాలనుకున్నాడు ఆమె తండ్రి. బిడ్డకు పాలిస్తున్న భార్య మీద, పాలు తాగుతున్న బిడ్డ మీద యాసిడ్ కుమ్మరించాడు. అన్‌మోల్ తల్లి ప్రాణాలు కోల్పోయింది, అన్‌మోల్ బతకడం కూడా ఒక అద్భుతమనే చెప్పాలి. ఆమె బాల్యమంతా హాస్పిటల్ బెడ్, ఆపరేషన్ థియేటర్‌లలో గడిచిపోయింది. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత అనాథ శరణాలయం ఆమె అడ్రస్ అయింది. బాల్యంలో తోటి పిల్లల ప్రశ్నార్థకపు చూపులను తట్టుకుని గట్టి పడిపోయిందామె. అదే ధైర్యంతో స్కూలు, కాలేజ్ చదువు పూర్తి చేసి ఫ్యాషన్‌రంగాన్ని కెరీర్‌గా మలుచుకుంది. ఇప్పుడామె సక్సెస్‌ఫుల్ మోడల్. తాను మోడలింగ్ చేస్తూ, మరో పక్క ఇరవై మంది యాసిడ్ సర్వైవర్స్‌కి సహాయం చేసింది. వారికి బతుకు మీద ధైర్యాన్ని కల్పించడం, బతుకుకు ఒక మార్గాన్ని చూపించడం అన్‌మోల్ చేస్తున్న సహాయం. నిజమే... యాసిడ్ పడింది వాళ్ల ముఖం మీద మాత్రమే. వాళ్ల మనోధైర్యం మీద కాదు.

**– మంజీర**

---

## ముగ్గు-ముచ్చట






మద్దుల పద్మావతి
తెనాలి,
గుంటూరు జిల్లా

25 చుక్కల నుండి
1 చుక్క వచ్చు వరకు
చుక్కలు చూసి పెట్టవలెను.

15 చుక్కలు.. చుక్కవిడిచి చుక్క
7 వరుసలు, 7 వచ్చేవరకు





బలుపాల సునీత సుధాకర్
పెబ్బేరు గ్రామం, వనపర్తి జిల్లా






**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్,
హైదరాబాద్–34.
muggulu.sakshi@gmail.com

---

## తిరుప్పావై 8వ పాశురం

**కీళ్ వానం వెళ్లెన్రెఱుమై శిఱు వీడు**
**మెయ్యాన్ పరందాన కాణ్ మిక్కుళ్ళ పిళ్ళైగళుమ్**
**పోవాన్ పోగిన్రారై ప్పోగామల్ కాత్తు ఉన్నై**
**క్కూవువాన్ వందు నిన్రోమ్ కోదుగలం ఉడైయ**
**పావాయ్ ! ఎళున్దిరాయ్ పాడి ప్పఱై కొండు**
**మావాయ్ పిళందానై మళ్ళరై మాట్టియ**
**దేవాదిదేవనై చ్చెన్రు నామ్ శేవిత్తాల్**
**ఆవా ఎన్రారాయుందరుళ్ - ఏలోర్ ఎమ్బావాయ్**



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్


**త**మ భాగవతగోష్ఠిలోకి వచ్చిచేరమని ఆండాళ్ మరొక గోపకాంతకు పిలుపునిస్తున్నది. గోకులంలోని గోపాలకులు మూడు విధములైన సంపద కలవారు. గోవులు, గొఱ్ఱెలు, ఎనుములు. ఈ పాశురంలో ఆండాళ్ తాను కూడా ఒక గొల్లపిల్లగా మారి గోకులంలో సుప్రభాత దృశ్యాన్ని కళ్లకుకడుతుంది. అక్కడ తెల్లవారక మునుపే పశువులను మేతకు వదులుతారు.

'భగవానుని పట్ల ఉత్సాహం, కుతూహలం మెండుగా ఉన్న ఓ సౌందర్యరాశీ! అరుణోదయవేళ కావస్తున్నది,తూర్పుదిక్కు ఎర్రబారింది. లే! ఆకలితో ఉన్న ఎనుములను లేత గడ్డిమేత కోసం గోపాలకులు పచ్చిక బయళ్ళకు తోలారు. నువ్వు వస్తావని నీ కోసం వ్రతనిరతులందరినీ నీ ఇంటి ముందు ఆపివుంచాను. నిన్ను లేపి వెంటబెట్టుకుని తీసువెళ్లే నిమిత్తం తలుపు వద్ద వేచియున్నాను, లే! భగవానుని మహిమలను స్తుతిస్తే ఆయన మనకు వ్రతోపకరణాలు, అంటే వ్రతానికి అవసరమయ్యే సామగ్రి (భేరీ తదితరాలను) ప్రసాదిస్తాడు. అశ్వరూపంలో వచ్చిన కేశి అనే అసురుని నోరు చీల్చి వధించాడు, ముష్టిక చాణూరులను కంస సభలో తుదముట్టించాడు. అలాంటి పరమపురుషుని సమక్షంలో సమర్పణభావంతో వినమ్రులమై వంగి నమస్కరించాలి. అప్పుడే ఆ దేవాధిదేవుడు ప్రసన్నుడై, కరుణించి మన యోగక్షేమాలను విచారిస్తాడు'.

**– శ్రీదేవి మురళీధర్**

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
సోమవారం
23-12-2019

# యాక్షన్ షురూ



● నాగార్జున

కొత్త దర్శకులతో సినిమాలు చేయడం నాగార్జునకు కెరీర్ స్టార్టింగ్ నుంచి అలవాటే. తాజాగా మరో కొత్త దర్శకుణ్ణి ఇండస్ట్రీకి పరిచయం చేయబోతున్నారాయన. భారీ యాక్షన్‌తో కూడిన ఓ పోలీస్ ఆఫీసర్ కథతో నాగార్జున కొత్త చిత్రం ఉంటుందని సమాచారం. 'ఊపిరి, మహర్షి' సినిమాల్లో రచనా విభాగంలో పనిచేసిన సాల్మన్ దర్శకత్వంలో నాగార్జున ఓ సినిమా చేయడానికి అంగీకరించారు. ఇందులో ఆయన పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్నారు. ఈ సినిమాలో యాక్షన్ మోతాదు ఎక్కువగా ఉండబోతోందని టాక్. హాలీవుడ్ స్టంట్ మాస్టర్స్ ఈ సినిమాకు పని చేయనున్నారట. ప్రస్తుతం ప్రీ–ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాని వచ్చే ఏడాది వేసవిలో థియేటర్స్‌లోకి తీసుకురావాలని సన్నాహాలు చేస్తున్నారు.

# మత్తు వదలరా ఎంతో నచ్చేసింది

\- రాజమౌళి



● రాజమౌళి, కీరవాణి, శ్రీ సింహా, రితేష్ రానా, అతుల్య, చెర్రీ, కాలభైరవ

''మత్తు వదలరా' సినిమా చూశాను. తీపి, కారం ఒకేసారి తిన్నట్టు అనిపించింది. చూస్తున్న కొద్దీ సినిమా ఎంతో నచ్చేసింది. ప్రతి ఫ్రేమ్ నన్ను ఆకట్టుకుంది. ఇక జనాలకు నచ్చాలి'' అని డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. సంగీత దర్శకుడు కీరవాణి తనయుడు శ్రీసింహా హీరోగా పరిచయమవుతోన్న చిత్రం 'మత్తు వదలరా'. రితేష్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై చిరంజీవి (చెర్రీ), హేమలత నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో రాజమౌళి మాట్లాడుతూ– ''రితేష్ ఐడియా నాకు బాగా నచ్చింది. సింహా, కాలభైరవకు చక్కటి భవిష్యత్తు ఉంది. నా 'యమదొంగ' చిత్రానికి నిర్మాత చెర్రీనే. నా కెరీర్‌లో అతి తక్కువ సమయంలో తీసిన చిత్రం 'యమదొంగ'.. దానికి కారణ చెర్రీ ప్లానింగే'' అన్నారు. ''మా పిల్లల్ని నేను ఎప్పుడూ తిడుతూ ప్రోత్సహిస్తుంటాను. కానీ, ఇప్పుడు చూస్తుంటే గర్వంగా ఉంది'' అన్నారు సంగీత దర్శకుడు కీరవాణి. ''సంగీత దర్శకుణ్ణి కావాలనే నా కల ఈ సినిమాతో తీరింది'' అన్నారు సంగీత దర్శకుడు కాలభైరవ. ''ఈ సినిమా చూసిన వారు థ్రిల్ ఫీలవుతారు'' అన్నారు నిర్మాతలు. ''అందరూ కొత్త వాళ్లు నిర్మించిన సినిమా ఇది'' అన్నారు శ్రీసింహా. ''కథపై నమ్మకంతో నిర్మాతలు రాజీ పడలేదు'' అన్నారు రితేశ్. కెమెరామేన్ సురేష్ పాల్గొన్నారు.



● కీర్తి సురేశ్

## రజనీ కూతురు?

రజనీకాంత్ హీరోగా శివ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ ఓ సినిమాను తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో ఖుష్బూ, మీనా, కీర్తీ సురేష్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఓ పాట చిత్రీకరణతో ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించారని తెలిసింది. శనివారం ఖుష్బూ ఈ సినిమా సెట్‌లో జాయినయ్యారు. దాదాపు 28ఏళ్ల తర్వాత రజనీ–ఖుష్బూ కలిసి నటిస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ సినిమాలో రజనీ కూతురి పాత్రలో కీర్తి సురేష్ నటిస్తున్నారని, ఆల్రెడీ ఆమె షూటింగ్‌లో పాల్గొంటున్నారన్నది తాజా సమాచారం. అలాగే ఈ సినిమాలో రజనీ రెండు పాత్రలు చేస్తున్నారనే వార్త కూడా ప్రచారంలో ఉంది. ప్రకాష్‌రాజ్, సూరి కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తున్నారు.

# రెండేళ్ల ప్రయాణం ఇద్దరిలోకం ఒకటే

\- 'దిల్' రాజు



● జీఆర్ కృష్ణ, 'దిల్' రాజు, రాజ్ తరుణ్

''రెండేళ్ల ప్రయాణమే 'ఇద్దరి లోకం ఒకటే' సినిమా. కృష్ణ చెప్పిన ఐడియా నచ్చింది. ఇద్దరు ముగ్గురు హీరోలను అనుకున్నాం కానీ కుదర్లేదు. ఆ తర్వాత రాజ్ తరుణ్‌తో ప్రాజెక్ట్ ఓకే అయింది'' అన్నారు 'దిల్' రాజు. జీఆర్.కృష్ణ దర్శకత్వంలో రాజ్‌తరుణ్, షాలినీ పాండే జంటగా నటించిన చిత్రం 'ఇద్దరి లోకం ఒకటే'. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ–రిలీజ్ వేడుకలో 'దిల్' రాజు మాట్లాడుతూ– ''మిక్కి జె.మేయర్, సమీర్ రెడ్డి వంటి టాప్ టెక్నీషియన్స్ ఈ సినిమాకు పనిచేశారు. హీరోయిన్ విషయంలో ముగ్గురు, నలుగుర్ని అనుకున్నాం.. కానీ, శిరీష్ మాత్రం షాలినీ పేరును చెప్పి ఒప్పించాడు. రాజ్ తరుణ్, షాలినీ పాండే మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా కుదిరింది. ఫస్ట్ హాఫ్ చూసిన తర్వాత నాకు ఎక్కలేదు.. ఆ విషయాన్ని డైరెక్టర్‌కి చెప్పాను. మళ్లీ మార్పులు చేర్పులు చేసి సినిమాను చూపించాడు. ఫైనల్ సినిమా చూసి డైరెక్టర్‌కి షేక్ హ్యాండ్ ఇచ్చాను. ఫస్టాఫ్ టైమ్‌పాస్‌లా ఉంటుంది. సెకండాఫ్ గుడ్. ముఖ్యంగా క్లైమాక్స్ వెరీగుడ్ అనిపిస్తుంది. నిజాయతీగా చేసిన చిత్రమిది. ఈ ఏడాది 'ఎఫ్2, మహర్షి' తర్వాత ఈ సినిమాతో సక్సెస్ కొడితే హ్యాట్రిక్ వచ్చేసినట్టే'' అన్నారు. ''ఇదో అందమైన ప్రేమకథ. సినిమా అందరికీ నచ్చుతుంది. థియేటర్‌లోనే సినిమా చూడండి.. పైరసీని ప్రోత్సహించొద్దు'' అన్నారు రాజ్ తరుణ్. ''పుట్టుక నుండి చివరి వరకు ఇద్దరి వ్యక్తుల జర్నీ ఈ సినిమా'' అన్నారు దర్శకుడు జీఆర్ కృష్ణ. ఈ కార్యక్రమంలో నిర్మాత బెక్కం వేణుగోపాల్, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# రాకీ భాయ్ ఈజ్ బ్యాక్



● యష్

'కేజీఎఫ్ ఛాప్టర్ 1' సినిమా మాస్ ప్రేక్షకులకు విందు భోజనం అందించింది. రెండో పార్ట్‌కోసం ఈ సినిమా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఫస్ట్ పార్ట్ విడుదలైన మొదటి వార్షికోత్సవానికి సెకండ్ పార్ట్ ఫస్ట్ లుక్ విడుదల చేసింది చిత్రబృందం. యష్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రమిది. కైకాల సత్యనారాయణ సమర్పణలో విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. శ్రీనిధీ శెట్టి కథానాయిక. సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నారు. యష్ చేసిన రాకీ భాయ్ పాత్రకు మంచి ఆదరణ లభించింది. 'సామ్రాజ్యాన్ని సరికొత్తగా నిర్మిస్తూ' అనే క్యాప్షన్‌తో విడుదలైన ఈ ఫస్ట్‌లుక్ ఆకట్టుకునేలా ఉంది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో ఈ సినిమా విడుదల కానుంది.

# సస్పెన్స్ థ్రిల్లర్



● ఆది సాయికుమార్

ఆది సాయికుమార్ కొత్త చిత్రానికి పచ్చజెండా ఊపారు. నేడు తన పుట్టినరోజు సందర్భంగా తర్వాతి చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు ఆది. డైరెక్టర్ పూరి జగన్నాథ్ వద్ద పనిచేసిన జి.బి.కృష్ణ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. మహంకాళీ మూవీస్ పతాకంపై మహంకాళీ దివాకర్ ఈ సినిమా నిర్మించనున్నారు. ఈ సందర్భంగా మహంకాళీ దివాకర్ మాట్లాడుతూ– ''సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్న చిత్రమిది. ఆది గత సినిమాల కంటే ఈ సినిమా భిన్నంగా ఉంటుంది. హిట్ కొట్టాలని కసి మీద ఉన్న ఆదికి సరైన కథ దొరికింది. జీబీ కృష్ణ కథ నచ్చడంతో వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు ఆది. కథ నచ్చడంతో ఎక్కడా రాజీ పడకుండా క్వాలిటీగా సినిమాని నిర్మించనున్నాం. జనవరిలో షూటింగ్ స్టార్ట్ చేసి సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేస్తాం. వేసవిలో సినిమా విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో చెబుతాం'' అన్నారు. ఈ చిత్రానికి నిర్మాణ నిర్వాహణ : శంకర్.

# మహాప్రస్థానం మొదలైంది

తనీష్, ముస్కాన్ సేథీ జంటగా జానీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'మహాప్రస్థానం'. 'జర్నీ ఆఫ్ యాన్ ఎమోషనల్ కిల్లర్' అనేది ఉపశీర్షిక. 'వరుడు' ఫేం భానుశ్రీ మెహ్రా, కబీర్ దుహాన్ సింగ్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తనీష్ మాట్లాడుతూ– ''సినిమా సెట్‌లో నేను అడుగుపెట్టి ఏడాదిన్నర అవుతోంది. కథలు వింటున్నా నచ్చడం లేదు. జానీగారు చెప్పిన 'మహాప్రస్థానం' కథ నాలో ఎంతో స్ఫూర్తి నింపింది. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే కథ ఇది'' అన్నారు. ''నేను గతంలో 'అంతకుమిం చి' చిత్రాన్ని తెరకెక్కించా. 'మహాప్రస్థానం' నా రెండో సినిమా. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే ఇంటెన్స్ లవ్ స్టోరీ ఇది'' అన్నారు జాని. శుభాంగీ పంత్, గగన్ విహారి, అమిత్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: బాల్ రెడ్డి.



● తనీష్



● రకుల్

## మళ్లీ జోడీ

ఈ ఏడాది విడుదలైన హిందీ చిత్రం 'దేదే ప్యార్ దే' విజయం రకుల్‌ప్రీత్ సింగ్‌కు బాలీవుడ్‌లో అవకాశాలను తెచ్చిపెడుతోంది. ఇందులో అజయ్ దేవగణ్ హీరోగా నటించారు. మళ్లీ అజయ్, రకుల్‌ప్రీత్ సింగ్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. 'దే దే ప్యార్ దే' హిట్‌తో హిట్ జోడీ అనిపించుకున్న అజయ్, రకుల్ మళ్లీ ఈ చిత్రంతో హిట్ అందుకుంటారనే అంచనాలు ఉన్నాయి. 'ధమాల్' ఫ్రాంచైజీ డైరెక్టర్ ఇంద్రకుమార్ ఈ సినిమాను తెరకెక్కిస్తారు. ఇందులో యంగ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా కూడా ఓ హీరోగా నటిస్తారు. ఈ సినిమా చిత్రీకరణ మార్చిలో ప్రారంభించనున్నారట. యాక్షన్–కామెడీ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా ఉంటుందట. మరోవైపు హిందీలో అర్జున్ కపూర్, జాన్ అబ్రహాం చిత్రాల్లో కథానాయికగా నటించడంతో పాటు కమల్‌హాసన్ 'ఇండియన్ 2' చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తూ రకుల్ ప్రస్తుతం ఫుల్ బిజీ.

# నవ్విస్తూనే హృదయాలను హత్తుకుంది

\- సుకుమార్



● తమన్, సుకుమార్, సాయితేజ్, రాశీఖన్నా, మారుతి, 'బన్నీ' వాస్

''యంగ్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే సినిమాలను రూపొందించే మారుతి, 'ప్రతిరోజూ పండగే' లాంటి భావోద్వేగాలకు సంబంధించిన కథను అద్భుతంగా తీశారు'' అని సుకుమార్ అన్నారు. సాయితేజ్, రాశీఖన్నా జంటగా మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ప్రతి రోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్ నిర్మించారు. గత శుక్రవారం విడుదలైన ఈ చిత్ర సక్సెస్ మీట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ – ''సినిమా మొత్తం బాధ అనే ఎమోషన్ ఉన్నా ప్రేక్షకులు నవ్వుతూ ఎంజాయ్ చేస్తున్నారని నాతో 'బన్నీ' వాస్ అన్నాడు. సినిమా చూశాక అతను చెప్పింది కరెక్టే కదా అనిపించింది. ఆద్యంతం నవ్విస్తూనే హృదయాలను హత్తుకుంది ఈ సినిమా. సాయితేజ్‌కి మేనమామ పోలికలు ఎక్కువగా కనిపిస్తాయి'' అన్నారు. ''కొన్ని ఫ్లాప్స్ ఎదురవగానే నా కెరీర్ అయిపోయిందని చాలామంది జోక్స్ వేసుకున్నారు. ఈ సినిమా రూపంలో మంచి హిట్ దక్కింది. నా కెరీర్‌లో నిలిచిపోయే సినిమా ఇచ్చారు మారుతి'' అన్నారు సాయితేజ్. ''నిర్మాతగా నేను ఈస్థాయిలో ఉండటానికి 'దిల్'రాజు గారు, అల్లు అరవింద్‌గారితోపాటు సుకుమార్ గారు కూడా ఓ కారణం. నన్ను నిర్మాతను చేయడానికి '100% లవ్' తీశారు'' అన్నారు 'బన్నీ' వాస్. ''థియేటర్‌లో ప్రేక్షకుల స్పందన చూస్తుంటే వాళ్లను ఇంకా నవ్వించాలనే కసి పెరిగింది. సుకుమార్‌గారు మా సినిమాని అభినందించడం హ్యాపీ'' అన్నారు మారుతి. ఈ కార్యక్రమంలో తమన్, రాశీఖన్నా, రావు రమేశ్, పరుచూరి గోపాలకృష్ణ పాల్గొన్నారు.

# మా ప్రయత్నాన్ని ఆదరించారు

\- బాలకృష్ణ



● సి.కల్యాణ్, వేదిక, బాలకృష్ణ

''రూలర్ సినిమాకి మంచి విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మేం ఓ మంచి ప్రయత్నం చేశాం.. మా ప్రయత్నానికి విజయాన్ని అందించారు. సి.కల్యాణ్‌గారితో నేను చేసిన మూడో సినిమా ఇది. మంచి కథా విలువలున్న చిత్రం చేయాలని భావించే ఆయనకు నా తరపున, అభిమానుల తరపున కృతజ్ఞతలు'' అని బాలకృష్ణ అన్నారు. కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో బాలకృష్ణ హీరోగా, వేదిక, సోనాల్ చౌహాన్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'రూలర్'. హ్యాపీ మూవీస్ బ్యానర్‌పై సి.కల్యాణ్ నిర్మించిన ఈ సినిమా గత శుక్రవారం (డిసెంబర్ 20) విడుదలైంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన సమావేశంలో బాలకృష్ణ మాట్లాడుతూ– '' పరుచూరి మురళి గారు మంచి కథ, డైలాగ్స్‌ను అందించారు. ఈ కథలో మంచి సందేశాన్ని కూడా చొప్పించినందుకు ఆయనకు థ్యాంక్స్. ఆర్టిస్టుల దగ్గర నుంచి తనకు ఏం కావాలో రాబట్టుకునే దర్శకుడు కె.ఎస్.రవికుమార్‌గారు. ఆయన నిర్మాతల దర్శకుడు కూడా. మా సినిమాలో భాగమైన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు. సి.కల్యాణ్ మాట్లాడుతూ– ''జై సింహా' తర్వాత మా కాంబినేషన్‌లో వచ్చిన 'రూలర్' సినిమాను హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. మా కాంబినేషన్‌లో వచ్చే తర్వాతి చిత్రం 'రూలర్' కంటే మంచి చిత్రం అవుతుంది'' అన్నారు. ''మా సినిమాని ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకుంటున్నందుకు వెరీ హ్యాపీ'' అన్నారు వేదిక. ''జైసింహా' తర్వాత అదే కాంబినేషన్‌లో వచ్చిన 'రూలర్'కి సినిమాటోగ్రఫీ అందించడం సంతోషంగా ఉంది'' అన్నారు కెమెరామేన్ రాంప్రసాద్. ''కల్యాణ్‌గారితో కలిసి పనిచేయడం సంతోషంగా ఉంది'' అని పరుచూరి మురళి అన్నారు.







సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
23-12-2019

పరిచయం | సుష్మ కళ్లెంపూడి

**రోడ్డు మీద ఉన్నాం. రద్దీలో ఉన్నాం.
అత్యవసరంగా పక్కకు వెళ్లాలి.
మగాళ్లయితే ఏదో
ఒక పక్కకు వెళ్లొచ్చేస్తారు.
ఆడవాళ్ల మాటేమిటి?
సిటీల్లో పెద్ద సమస్య ఇది!
'షీ' అని ఉన్న చోటును చూసుకుని
వచ్చే అవసరమా ఏమన్నానా?!
సుష్మకూ ఇలాంటి సమస్యే ఎదురైంది.
బాగా ఆలోచించి..
'షీ'నే అవసరం ఉన్న దగ్గరకు రప్పించే
మొబైల్ 'షీ' టాయ్‌లెట్‌ను ప్లాన్ చేసింది.
ఇది ఆమె పరిచయం మాత్రమే కాదు.
'ఆమె' పరిచయం కూడా. చదవండి.
సుష్మను అభినందించడానికి మీకింకా
అనేక కారణాలు కనిపిస్తాయి.**



# ఆమె అవసరం

సుష్మ కళ్లెంపూడి వైజాగ్‌లో పుట్టి పెరిగింది. గీతం యూనివర్శిటీలో బీటెక్ చేసి హైదరాబాద్‌లో సత్యం కంప్యూటర్స్‌లో ఉద్యోగం. ఇదంతా 2004లో. ఆ తర్వాత ఏడాది కోదాడ కుర్రాడు సుధీర్‌ని పెళ్లి చేసుకుని యూఎస్‌లో అడుగుపెట్టింది. తిరిగి పన్నెండేళ్ల తర్వాత దంపతులు కుటుంబం సహా ఇండియాకి వచ్చారు. ఇండియాకి ఏదైనా చేయాలని వచ్చారు.

'సంపాదనలో విరామం– సమాజానికి సహాయం' అని స్టెల్లా అనే అమెరికన్ ఫ్యామిలీ ఫ్రెండ్ చెప్పిన సూక్తిని ఒంటపట్టించుకుని మరీ ఇండియాకి వచ్చారీ దంపతులు. బాగా ఆలోచించాక.. మహిళలకు ఇల్లు దాటి బయటికి వచ్చినప్పుడు ఎదురయ్యే వాష్‌రూమ్ ఇబ్బందికి చెక్ పెట్టడం కోసం 'షీ మొబైల్ టాయిలెట్' అనే కాన్సెప్ట్‌ని రూపొందించుకున్నారు సుష్మ. ''అయితే అందుకు బీజం పడింది మాత్రం అమెరికా వెళ్లకముందే..'' అని చెప్పారామె. పెళ్లికి ముందు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నప్పుడు సెలవు రోజుల్లో ఫ్రెండ్స్‌తో కోఠీ వంటి రద్దీగా ఉండే మార్కెట్ స్థలాలకు వెళ్లినప్పుడు ఎదురైన అవసరాన్ని, అసౌకర్యాన్ని గుర్తు చేసుకున్నారు. 'మీ వాష్‌రూమ్ వాడుకుంటాం' అని దుకాణాలు, రెస్టారెంట్‌ల వాళ్లను అడగడం ఎంత ఇబ్బందిగా ఉండేదో తలుచుకున్నారు. షిరిడీకి వెళ్లేటప్పుడు బస్ ప్రయాణం కదా అని నీళ్లు తక్కువగా తాగినప్పటికీ ఏసీ బస్సు కావడంతో వాష్‌రూమ్ అవసరం తప్పని సరి అయిన సందర్భాన్ని వివరించారు. హిస్టరెక్టమీ చేయించుకున్న తన అత్తగారు కోదాడ నుంచి హైదరాబాద్‌కి బస్సులో ప్రయాణించేటప్పుడు ఎదుర్కొన్న విపత్కర పరిస్థితినీ ప్రస్తావించారు.

వీటన్నింటి తర్వాత ఇండియాలో.. ఏడేళ్ల కొడుకు వేదాన్ష్ కోదాడ, వెంకటాపురం ప్రభుత్వ పాఠశాలలో స్కూల్లో వాష్‌రూమ్ బాగాలేదని మొండికేయడం, బహిరంగంగా మూత్ర విసర్జన ఎందుకు చేయాలని ప్రశ్నించడంతో ఈ సమస్య తీవ్రతను మరోసారి సమీక్షించుకున్నారు సుష్మ. ఇండియాలో స్వచ్‌భారత్‌లు వచ్చినా, నగరాల్లో సులభ్ కాంప్లెక్స్‌లున్నా వాష్‌రూమ్ అవసరాన్ని భర్తీ చేసే స్థాయిలో సర్వీస్ లేదని గమనించారు. ''పెద్ద మాల్స్‌లో షాపింగ్ చేసే వాళ్లకు ఆ మాల్సే వాష్‌రూమ్ సర్వీస్‌నిస్తున్నాయి. కానీ సామాన్య మహిళల పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదు. ఆ మహిళలు రోజు వారీ పనులు, కొనుగోళ్ల కోసం కోసం బహిరంగ మార్కెట్ మీదనే ఆధారపడుతున్నారు. మళ్లీ వాళ్లు ఇంటికి వెళ్లే వరకు ఊపిరి బిగపట్టినంత ఆ నరకాన్ని భరిస్తూనే ఉండాలి. వీటన్నిటికీ పరిష్కారంగా నాకు వచ్చిన ఆలోచనే ఈ 'మొబైల్ షీ టాయిలెట్స్'' అన్నారు సుష్మ.

**ఇండియా అంతే... అనుకోరాదు**

''ఊహ తెలిసిన తర్వాత అమెరికా సమాజాన్ని మాత్రమే చూసిన మా పెద్దబ్బాయి వేదాన్ష్‌కు భారతీయ సమాజం పరిచయం కావాలనే ఆలోచనతో కార్పొరేట్ స్కూల్ కాకుండా కొంత కాలం పాటు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాం. 'మా తాతగారిల్లు, మా నాన్న చదివిన స్కూలు' అని ఫొటోల్లో చూడడం కాదు, పిల్లలకు ప్రాక్టికల్‌గా అనుభవంలోకి రావాలనేదే మా ఆలోచన. స్కూలుకి వెళ్లిన మొదటి రోజు నుంచి 'స్కూల్లో వాష్‌రూమ్‌తో మొదలు పెట్టి స్కూల్లో బెంచీల్లేవేంటి, బిల్డింగ్‌కి పగుళ్లున్నాయేంటి' అని రోజుకో కంప్లయింట్ చేసేవాడు. దాంతో మా మామగారు (జలగం రంగారావు) పూనుకుని స్కూల్ రిపేర్‌లు, బెంచ్‌లు, డిజిటల్ క్లాస్ రూమ్‌కు అవసరమైన మెటీరియల్ డొనేట్ చేశారు. మన కళ్ల ముందున్న ప్రతి సమస్యకూ 'ఇండియాలో ఇంతే' అని సమాధానం చెప్పుకోవడం కాదు, మనవంతుగా ఓ పరిష్కారాన్ని ఆలోచించాలి'' అని చెప్పారు సుష్మ.

**కరెంటు ఉత్పత్తి**

ఆఫ్రికాలో మొబైల్ టాయిలెట్ వ్యర్థాల నుంచి వాళ్లు కరెంట్ ఉత్పత్తి చేస్తున్నారు, హ్యూమన్ వేస్ట్ ఎరువుగా మారే టెక్నాలజీని ఫాలో అవుతున్నారు వాళ్లు. వినడానికి మనకు విచిత్రంగా ఉండవచ్చు కానీ, చైనాలో స్కూళ్లలో పండించే కూరగాయలు, పండ్లకు ఎరువు ఆయా స్కూళ్ల టాయిలెట్‌ల హ్యూమన్ వేస్టే. మామూలుగా అయితే హ్యూమన్ వేస్ట్ ఎరువుగా మారడానికి ఆరు నెలలు పడుతుంది. పార్థివ దేహాన్ని దహనం చేసే టెక్నాలజీని ఇక్కడ ప్రవేశ పెడితే నిమిషాల్లో బూడిదయిపోతుంది. దానిని హరిత హారంలో మొక్కలకు ఉపయోగించవచ్చు. ఇలా పూర్తి స్థాయిలో ఒక వాహనం తయారు చేయాలంటే పదిలక్షలు ఖర్చవుతుంది. అయితే మొదటగా ప్రాథమికంగా ఉపయోగించుకోగలిగిన పరిస్థితిలో వాహనాన్ని తయారు చేయమని చెప్పారు జీహెచ్‌ఎంసీ వాళ్లు. నా ఆలోచన సంక్రాంతి నాటికి ఆచరణలోకి వస్తుంది. ఆ తర్వాత షీ టాయిలెట్స్‌ను దేశమంతటికీ విస్తరిస్తాను'' అని భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు సుష్మ.

**మూడు దేశాల ఆచరణ**

''నేను, నా భర్త సుధీర్ అమెరికా, కెనడా, యూకెల్లో ఉద్యోగాలు చేశాం. యూకె టెక్నాలజీ సాయంతో నైరోబీ, ఉగాండా, కెన్యాల్లో టాయిలెట్‌ల నిర్వహణ తీరును మనదేశంలో షీ టాయిలెట్‌ల కోసమే స్టడీ చేశాను. ఒక వెహికల్‌లో టాయిలెట్ కమోడ్, వాటర్ ట్యాంక్, సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటు చేసి రద్దీగా ఉన్న ప్రదేశాల్లో ఆ వాహనాన్ని అందుబాటులో ఉంచాలనేది మా ఉద్దేశం. మహిళలు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ఇందుకోసం ఒక పార్ట్ పుణె నుంచి, మరో పార్ట్ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫరా బాద్ నుంచి తీసుకు వచ్చాక మరి కొంత వర్క్ హైదరాబాద్‌లో జరగాల్సి ఉంది. ఇందుకోసం జీహెచ్‌ఎంసీని సంప్రదించాం. అడిషనల్ కమీషనర్ హరిచందన సానుకూలంగా స్పందించారు'' అని చెప్పారు సుష్మ.



● షీ మొబైల్ టాయిలెట్ వాహనం

**స్కూళ్లను అద్దెకిద్దాం**

ప్రభుత్వ భవనం లేకపోతే అద్దె భవనంలో స్కూళ్లు నడపడం గురించి మాత్రమే మనకు తెలుసు. సుష్మ మాటల్లో మన పాఠశాలలు అనుసరించదగిన మరో సూచన కూడా తెలియవచ్చింది. ''అమెరికాలో వారాంతాలు, ఇతర సెలవు రోజుల్లో స్కూలు ఆవరణను, గదులను సమావేశాలకు అద్దెకిస్తారు. పాఠశాల భవనాలను చక్కగా నిర్వహించుకుంటే మన దగ్గర కూడా అలా రెంట్‌కిచ్చి ఆ వచ్చే డబ్బుతో స్కూల్‌కి అవసరమైన పనులు చేసుకోవచ్చు'' అని తెలిపారు సుష్మ.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

## కాఫీ విత్ ప్రిన్సిపల్

స్కూల్ నిర్వహణ గురించి పూర్తిగా ప్రభుత్వాల మీదనే ఆధారపడడం కాదు, పేరెంట్స్ కూడా బాధ్యత పంచుకోవాలి. అప్పుడే సమస్యలు మొగ్గదశలోనే తీరిపోతాయి. అలా నాకు వచ్చిన ఇంకో ఆలోచనే 'టీ విత్ హెడ్ మాస్టర్'. యూఎస్‌లో 'కాఫీ విత్ ప్రిన్సిపల్' ప్రోగ్రామ్ ఉంటుంది. విద్యార్థుల పేరెంట్స్ తప్పని సరిగా ప్రిన్సిపల్‌ని కలుస్తారు. పేరెంట్స్ స్కూల్‌కి అవసరమైన సర్వీస్ కూడా చేస్తారు. ఇదే కాన్సెప్ట్‌ని మా వెంకటాపురం స్కూల్ నుంచి 'టీ విత్ హెడ్ మాస్టర్' అని ప్రారంభించామన్నమాట. అలా ఏపీ, తెలంగాణల్లో పాతిక స్కూళ్లలో ఈ ప్రోగ్రామ్ పెట్టి, వాళ్లకు గైడెన్స్ కోసం కొన్ని సమావేశాలకు నేను స్వయంగా హాజరయ్యాను. ఏపీ విద్యామంత్రి, తెలంగాణ విద్యామంత్రిని కలిసి కాన్సెప్ట్ వివరించాం. గత ఏపీ ప్రభుత్వం రెస్పాండ్ కాలేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ కాన్సెప్ట్‌ని అడాప్ట్ చేసుకుని బీసీ వెల్ఫేర్ హాస్టళ్లకు వర్తింప చేసింది.

– సుష్మ, మొబైల్ షీ టాయిలెట్స్ ఫౌండర్


● పిల్లలు వేదాన్ష్, జేష్ణవ్‌లతో సుష్మ దంపతులు

పరి పరిశోధన

# కనికట్టు కాదు.. త్రీడీ భవనమే..



తాపీమేస్త్రీలు, కూలీలకు ఇక కాలం చెల్లినట్లేనా? ఇళ్లు కట్టడం ఇకపై చిటికేస్తే కాదుకాదు... మీటనొక్కితే జరిగిపోయే వ్యవహారమేనా? ఫొటోలో ఉన్న ఇంటి వివరాలు తెలిస్తే మీరూ అవునంటారు. దుబాయిలో కట్టారు దీన్ని. కట్టారు అనడం కంటే ప్రింట్ చేశారనడం సబబేమో. ఎందుకంటే ఆపిస్ కోర్ అనే కంపెనీ భారీసైజు త్రీడీ ప్రింటర్‌ను వాడి దీన్ని ముద్రించేసింది మరి. ఇలాంటివి గతంలోనూ అక్కడక్కడా ఒకట్రెండు ప్రింట్ చేశారుగానీ... ఈ సైజులో, సంక్లిష్టమైన డిజైన్‌తో మాత్రం ఇదే తొలిసారి. ఆపిస్ కోర్ త్రీడీ ప్రింటర్‌ను ఎప్పుడు ఎక్కడికి కావాలంటే అక్కడికి తరలించవచ్చు. ఓ క్రేన్ ఉంటే సరిపోతుంది. ముగ్గురు మనుషులు మాత్రమే పాల్గొన్నారు ఈ నిర్మాణంలో. అది కూడా పునాదులు తవ్వడానికి, కిటికీలు, తలుపులు బిగించడానికి మాత్రమే. మిగిలిన పనులన్నీ చక్కబెట్టింది త్రీడీ ప్రింటరే. ఆపిస్ కోర్ కంపెనీ గతంలో నాసా నిర్వహించిన ఓ త్రీడీ ప్రింటింగ్ పోటీలో బహుమతి కూడా సాధించింది. అమెరికాలోని పలు ప్రాంతాల్లో చౌక ధరలతో ఇళ్లు కట్టేందుకు ప్రస్తుతం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీని మలచడం ఎలా అన్నదీ ఆలోచిస్తున్నామని కంపెనీ సీఈవో నికితా చెన్యుయతాయి చెప్పారు. దుబాయి మున్సిపాలిటీ కోసం కట్టిన ఈ భవనం ద్వారా తాము టెక్నాలజీపై ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నామని, వాటన్నింటిని ఉపయోగించి భవిష్యత్తులో రెట్టింపు వేగంతో ప్రాజెక్టులు పూర్తి చేయగలమని వివరించారు.

## కాలేయాన్ని రూపొందించారు



అవసరానికి తగ్గట్టు పరిశోధనశాలల్లో మానవ అవయవాలు లభించడం అన్నది శాస్త్రవేత్తలు చాలాకాలంగా ప్రయత్నిస్తున్న అంశం. బ్రెజిల్ శాస్త్రవేత్తల ప్రయత్నాల కారణంగా ఇప్పుడు ఈ అద్భుతం సాకారమయ్యేందుకు ఓ ముందడుగు పడింది. అచ్చం మనిషి కాలేయం మాదిరిగానే పనిచేసే అవయవభాగాన్ని (ఆర్గనాయిడ్) వీరు తయారు చేశారు. ప్రొటీన్లు తయారు చేయడం మొదలుకొని విటమిన్లను నిక్షిప్తం చేసుకోవడం, జీర్ణరసాలను ఉత్పత్తి చేసి విడుదల చేయడం వంటి అన్ని రకాల కాలేయ పనులను ఈ ఆర్గనాయిడ్ చేసేస్తుంది. ఇంకేముంది కాలేయం అవసరమైన వారందరికీ వీటిని పంపిణీ చేసేద్దాం అంటున్నారా? ఊహూ... ఇప్పుడే సాధ్యం కాదు. ఎందుకంటే ఇది పూర్తి స్థాయి కాలేయం కాదు. మరికొన్ని పనులు, దశలు దాటిన తరువాతే వీటిని వాడగలమని అంటున్నారు మయానా జాట్జ్. బయోఫ్యాబ్రికేషన్ జర్నల్ తాజా సంచికలో ప్రచురితమైన ఈ పరిశోధన ప్రకారం... ఇలాంటి కృత్రిమ కాలేయాలను రోగి కణాల ఆధారంగానే తయారు చేస్తారు కాబట్టి... రోగి శరీరం తిరస్కరించే అవకాశం ఉండదని మయానా తెలిపారు. గతంలో మాదిరిగా కణాలను ఒక్కటొక్కటిగా చేరుస్తూ ఆర్గనాయిడ్‌లను తయారు చేసే టెక్నాలజీలు అందుబాటులో ఉండగా... తాజాగా సిద్ధం చేసింది మాత్రం భిన్నమైన పద్ధతిలో. కణాలను గుంపులు, గుంపులుగా చేసి ఆ గుంపులతో కృత్రిమ కాలేయాన్ని ముద్రించారు.

స్ట్రేంజ్ ఫ్యాక్ట్స్



# ఇదో చిత్రమైన అలర్జీ

**మీకు తెలుసా? కొందరిలో కొన్ని పదార్థాలతో వచ్చే అలర్జీలు మనకు చాలా విచిత్రంగా అనిపించవచ్చు. ఇందుకు ఓ ఉదాహరణ అరటి, కీవీ పండ్ల వల్ల వచ్చే అలర్జీ. మనకు చిత్రంగా అనిపించినా ఇది వాస్తవం.**



సాధారణంగా కొందరిలో రబ్బర్ ఉత్పాదనలనుంచి అలర్జీ వస్తుంటుంది. ఉదాహరణకు చేతికి వేసుకునే రబ్బర్ గ్లౌవ్స్, షూస్, మాస్కులు, స్లిప్పర్ల వంటి ఎన్నెన్నో వస్తువులతో ఈ తరహా అలర్జీ కనిపిస్తుంది. దీని కారణంగా చర్మం ఎర్రబారడం, మేనిపై చిన్న చిన్న గుల్లలు, దద్దుర్లు, ర్యాష్ రావడం మొదలు కొని, అవి చాలా తీవ్రంగానూ చర్మంపై పగుళ్ల రూపంలో కనిపించేలా ఈ అలర్జిక్ రియాక్షన్ తీవ్రత ఉంటుంది. మరికొందరిలో రబ్బర్‌తో వచ్చే అలర్జీ రియాక్షన్ కనిపించగానే చేతులు లేదా కాళ్లు నల్లబారడం లేదా రంగుమారడం జరుగుతుంది. ఈ రియాక్షన్‌ను అది వచ్చిన ప్రాంతాన్ని బట్టి దాన్ని 'బ్లాక్ రబ్బర్ హ్యాండ్' లేదా 'బ్లాక్ రబ్బర్ ఫీట్' అని అంటుంటారు.

ఇలా రబ్బర్‌తో అలర్జీ ఉన్న కొంతమందిలో కాస్తంత అరుదుగానైనా అరటి, కీవీ పండ్ల వల్ల కూడా అలర్జీ కనిపించవచ్చు. అరటి, కీవీ పండ్ల చెట్లు కూడా ఇంచుమించుగా రబ్బర్ మొక్క కుటుంబానికి చాలా దగ్గరి జాతివి కావడమే ఇందుకు కారణం. ఇలా అటు రబ్బర్‌కూ... ఇటు ఈ అరటి, కీవీ పండ్లకూ అలర్జీ కలిగి ఉండటాన్ని 'లాటెక్స్–ఫ్రూట్ సిండ్రోమ్' అని వ్యవహరిస్తారు.

కేవలం ఆ కుటుంబానికి చెందిన పండ్లకు మాత్రమే కాకుండా... మరికొందరికి అవకాడో, చెస్ట్‌నట్, పీచ్, టొమాటో, ఆలూ, బెల్‌పెప్పర్, మామిడి, స్ట్రాబెర్రీ వంటి పండ్లూ కూరగాయలతో కూడా అలర్జీ వస్తుంటుంది. వీటిల్లో లాటెక్స్ పాళ్లు లేనప్పటికీ కనిపించే ఈ రుగ్మతను కూడా 'లాటెక్స్–ఫ్రూట్ సిండ్రోమ్' అనే వ్యవహరిస్తారు. ఆయా పదార్థాలు వారికి సరిపడకపోవడమే ఇందుకు కారణం.

గ్రాస్ రూట్ ఆర్ట్

# గడ్డిపరకళ

వరిగడ్డితో కళాఖండాలు

**పచ్చని పంటచేలో మట్టితో మమేకమయ్యే ఆ చేతులు...
గడ్డిపోచలతో విన్యాసాలు చేస్తాయి.
గిత్తల గిట్టల చప్పళ్లతో జత కలిసి నాగేటిచాళ్లలో తిరగాడే ఆ కాళ్లు...
సన్నటి గడ్డి దారాలను రూపొందించడంలో, పేనడంలో సాయం పడతాయి.
బంగారు వర్ణాల కంకులను చూసి మెరిసిపోయే ఆ కళ్లు...
నిశిత దృక్కులతో పెక్కు కళాఖండాలను ఆవిష్కరిస్తాయి.
సత్తువ ఉడుగుతుందని అనుకునే ఎనిమిది పదులకు చేరుతున్న ఆయన వయసు
ఉరకలెత్తుతున్న ఆ నైపుణ్యం ముందు తలవాల్చి ఎందరికో స్ఫూర్తినిస్తుంది.
ఆయనే కృష్ణమూర్తి అనే ఓ మామూలు రైతు.**


● గడ్డితో నేసిన వరి చీర, జాకెట్టు



గడ్డిపరకల విన్యాసం కాదది... గడ్డిపర'కళ'ల కళావైభవం. ఈ గరికపర'కళ'లను ఆవిష్కరిస్తున్న ఆయన పేరు మువ్వా కృష్ణమూర్తి. ఊరు ప్రకాశం జిల్లాలోని పర్చూరు మండలానికి చెందిన వీరన్నపాలెం గ్రామం.

వరిగడ్డి పశువులమేతకు తప్ప మరెందుకూ పనికిరాదని మనలో చాలామంది అనుకుంటుంటారు. కానీ కృష్ణమూర్తి దాన్ని అబద్ధం చేశారు. అందరిలాగే తానూ పంటలు పండించటం వరకే పరిమితమైతే ఏం లాభం... తనకంటూ ప్రత్యేకత ఉండాలని భావించాడా కృషీవలుడు. ఆసక్తి ఉండాలే గానీ మామూలు వ్యవసాయదారుడు కూడా కళాకారుడవుతాడని నిరూపించాడా నిరుపేదరైతు. అద్భుత కళాఖండాలను సృష్టిస్తున్నారాయన. ఆ కళాకృతులను చూస్తే ఆశ్చర్యాలే. వాటిని మలిచే ఆ ముడిసరుకును చూస్తే అబ్బురాలే.

అటు గరికపోచలే కాదు... కొన్నిసార్లు తుంగ పీచులు, జొన్నఈనెలు, ఈతఆకులు వగైరాలతో సున్నితంగా పేనుకుంటూ, వాటిని ప్రయోజనకరమైన వస్తువులుగా రూపొందించేందుకు పూనుకుంటున్నారు. కొన్ని అందమైన పనిముట్ల నమూనాలను కూడా మలుస్తుంటారు. అయితే సహజంగా సేద్యం చేసేవాడు కదా... తన వ్యవసాయాభిరుచితో, తన కళాభిరుచిని కలగలిపి 'పొలంపనిముట్ల' నమూనాలనూ తయారు చేస్తుంటారు.


● జాతీయ జెండా నేతలో...



**ఎవరీ కృష్ణమూర్తి...**

మువ్వా కృష్ణమూర్తి ప్రకాశం జిల్లా, పర్చూరు మండలం, కొమర్నేనివారిపాలెం గ్రామంలో 07-04-1942న పుట్టారు. తండ్రి పేరు సుబ్బన్న, 1965లో తన పెళ్లయినప్పట్నుంచి వీరన్నపాలెం గ్రామంలో నివాసం ఉంటున్నారు. చదివింది ప్రాథమిక విద్య మాత్రమే. పిల్లలంతా స్థిరపడ్డారు. ప్రస్తుతం తన కూతురు వద్దే నివాసం. అందరిలోనూ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకోవాలనే తపన చిన్న నాటినుంచీ ఉండేది. దాంతో... కళాత్మకమైన వస్తువులు, పనిముట్లు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. ఆ ప్రయత్నంలో వరిగడ్డి, తుంగనార, జొన్నఈనెలు, తాటాకులు, కొబ్బరి నార, చిప్పెరకంకి, జమ్ము... ఇలా రకరకాలైన వస్తువులతో తొలుత వస్తువుల తయారీకి ప్రయత్నించాడు.


● గడ్డితో నాగలి

**'పరకా'యించి చూశాడు...**

ఒకరోజు గడిపరకను పరకాయించి చూస్తుండగా ఓ ఆలోచన వచ్చింది. గడ్డిపరకలతో చీరనేస్తే ఎలా ఉంటుందన్నదే ఆయన యోచన. తన యోచననూ... ఆలోచననూ కార్యరూపంలో పెట్టాడు. పని మొదలైంది కానీ పట్టుచిక్కలేదు. ఎన్నిసార్లు నేసినా గడ్డి విరిగిపోతోంది. దాంతో వరిగడ్డిని తొలుత బాగా ఎండనిచ్చారు. దానిని చాకుతో సన్నగా నిలువుగా కత్తిరించారు. ఆ పోగులను సన్నని దారాలుగా పేనారు. ఆ చిన్న చిన్న దారం ముక్కలను కలుపుకుంటూ పొడవైన దారంగా మలచుకున్నారు. వీటికోసం ఆయన ఎలాంటి పరికరాలనూ వాడలేదు. ఏ ఉపకరణాలనూ ఉపయోగించలేదు. అన్నీ తన చేతుల్తోనే. ఓర్పుగా, నేర్పుగా చేసుకుంటూ పోతున్నకొద్దీ తన నిపుణతలోనూ మార్పు కనిపించింది. ఎంతో శ్రమించి చెర్నోకోల, నాగలి, సిగమారలు, చిక్కాలు, కండువ, చీర, రవిక, చేతి సంచులు వంటి వస్తువులను తయారు చేశారు. వరిగడ్డి త్వరగా చేడిపోదు కాబట్టి దానిని భద్రపరచ డంలో ఇబ్బంది ఏమీ ఉండదని అంటారాయన. ఈ కళాకారుడి ప్రతిభకి స్థానికుల నుంచే కాక, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా అనేక ప్రశంసలు అందాయి. తాను నేసిన వరికండువాను భారత రాష్ట్రపతికీ, ప్రధానమంత్రికీ బహూకరించాలన్నది కృష్ణమూర్తి ఆలోచన. వరిగడ్డితో రూపొందించిన ఆ కళాకృతులను చూసిన ఎందరో పెద్దల నుంచి ప్రశంసలే కాదు... రెండు పదులకు మించి మరెన్నో పురస్కారాలందుకున్నారు మువ్వా కృష్ణమూర్తి. రాష్ట్రస్థాయిలో పశు సంవర్ధక శాఖతో పాటు అనేక సంస్థల నుంచి నుంచి చాలా సత్కారాలనూ, పురస్కారాలను పొందారు. తనతోనే ఈ కళ అంతరించిపోకుండా తర్వాత కూడా కొనసాగాలన్నదే ఆయన కోరిక.

– పాలేరు శ్రీనివాసరావు,
సాక్షి ప్రతినిధి, పర్చూరు

**ముందుకెవ్వరూ రావడం లేదు**

నా వయసిప్పుడు 78 ఏళ్లు. ఇప్పటికీ నా పనులు నేనే చేసుకుంటుంటాను. ఎప్పుడూ ఉత్సాహంగా ఉంటాను. నాలో ఓపిక నశించేలోగా నా కళను ఇతరులకు నేర్పాలన్నది నా ఆలోచన. ఔత్సాహికులెవరైనా ముందుకొస్తే తప్పకుండా నేర్పుతాను.

– మువ్వా కృష్ణమూర్తి



# సాక్షి భవిత

సోమవారం నుంచి శుక్రవారం వరకు

స్పర్థయా వర్ధతే విద్య

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

సోమవారం
23-12-2019


**తెలుగు రాష్ట్రాల్లో త్వరలో ఎంసెట్ తేదీలు వెలువడే అవకాశముంది. మరోవైపు ఇంటర్మీడియెట్ పరీక్షలు దగ్గరపడుతున్నాయి. దీంతో రెండింటినీ సమన్వయం చేసుకొనే విషయంలో విద్యార్థులు ఒకింత ఒత్తిడికి లోనవుతున్నారు. స్పష్టత, ఆత్మవిశ్వాసంతో అడుగులేస్తే.. రెండింట్లోనూ విజయం సాధించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. తెలుగు రాష్ట్రాల్లో ఎంసెట్, ఇంటర్ అభ్యర్థులకు ఉపయోగపడేలా ఇంటర్+ ఎంసెట్ ఉమ్మడి ప్రిపరేషన్ గైడెన్స్..**




# ఇంటర్ + ఎంసెట్

» ఇంజనీరింగ్‌లో ఎక్కువ మందికి ప్రవేశం కల్పించే పరీక్ష ఎంసెట్
» ఎంసెట్‌లో టాప్ ర్యాంకు సాధనలో కీలకంగా మారుతున్న మ్యాథ్స్
» ఇంటర్‌తోపాటే ఎంసెట్‌కూ ప్రిపరేషన్ సాగించాలంటున్న నిపుణులు

### ఎంసెట్‌తో కోర్సులు

ఎంసెట్(ఎంపీసీ) ర్యాంకు ద్వారా ప్రధానంగా ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశం లభిస్తుంది. దీనితోపాటు బీటెక్(అగ్రికల్చర్ ఇంజనీరింగ్), బీటెక్ (బయోటెక్నాలజీ), బీటెక్ (డెయిరీ టెక్నాలజీ),బీటెక్(ఫుడ్ టెక్నాలజీ), బీఫార్మసీ(బ్యాచిలర్ ఆఫ్ ఫార్మసీ), ఫార్మ్-డి(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ) తదితర కోర్సుల్లోనూ అడ్మిషన్ పొందొచ్చు.

### పరీక్ష స్వరూపం


ఎంసెట్‌ను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. మూడు గంటల వ్యవధిలో మొత్తం 160 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, తెలుగు మాధ్యమాల్లో ఉంటుంది.

### ఇంజనీరింగ్ స్ట్రీమ్

| సబ్జెక్టు | ప్రశ్నలు |
|---|---|
| మ్యాథమెటిక్స్ | 80 |
| ఫిజిక్స్ | 40 |
| కెమిస్ట్రీ | 40 |
| **మొత్తం** | **160** |

## మ్యాథమెటిక్స్.. 50శాతం వెయిటేజీ

ఎంపీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్‌కు సంబంధించి జాతీయ స్థాయిలో జేఈఈ మెయిన్, జేఈఈ అడ్వాన్స్‌డ్ వంటి పలు పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కువ మందికి ఇంజనీరింగ్‌లో ప్రవేశం కల్పించే పరీక్ష ఎంసెట్. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సమాన వెయిటేజీ ఉంటుంది. కానీ, ఎంసెట్‌లో ఒక్క మ్యాథమెటిక్స్‌కే 50 శాతం వెయిటేజీ ఉంది. కాబట్టి విద్యార్థులు ఎంసెట్ కోణంలో మ్యాథ్స్‌పై ఎక్కువ సమయం వెచ్చించాలి. మ్యాథ్స్ సిలబస్ పరంగా ఎన్‌సీఈఆర్‌టీ,




స్టేట్ సిలబస్‌కు వ్యత్యాసం లేదు. కాబట్టి జేఈఈ వంటి ప్రవేశ పరీక్షలకు సాగించిన ప్రిపరేషన్.. అటు ఇంటర్ పరీక్షలకు, ఇటు ఎంసెట్ పరీక్షలకు సైతం ఉపయోగపడుతుంది.

### ముఖ్య చాప్టర్లు

- ఇంటర్ మ్యాథ్స్ సిలబస్‌ను ఆల్‌జీబ్రా, క్యాల్కులస్, జామెట్రీ, వెక్టార్ ఆల్‌జీబ్రా, ట్రిగనోమెట్రీగా విభజించొచ్చు. విద్యార్థులు బోర్డు పరీక్షల కోసం లిమిట్స్ అండ్ కమ్యూనిటీ, డిఫరెన్షియేషన్, అప్లికేషన్స్ ఆఫ్ డెరివేటివ్స్, ఇంటిగ్రేషన్స్, డిఫైనెట్ ఇంటెగ్రల్, డిఫెరెన్షియెల్ ఈక్వేషన్స్‌పై ఫోకస్ పెట్టాలి. జామెట్రీ నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. ఇందులో 2డీ, 3డీ జామెట్రీ, లోకస్, ట్రాన్స్‌ఫర్మేషన్ ఆఫ్ యాక్సెస్, స్ట్రెయిట్ లైన్స్, సర్కిల్, సిస్టమ్ ఆఫ్ సర్కిల్స్, పారాబోలా, ఎల్లిప్స్, డైరెక్షన్ కొసైన్స్, డైరెక్షన్ రేషియోస్, ప్లేన్ తదితరాలు కీలక అంశాలు.
- ఎంసెట్ పరంగా ఆల్‌జీబ్రాను కీలక చాప్టర్‌గా చెప్పొచ్చు. దీన్నుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయి. ఫంక్షన్లు, మ్యాథమెటికల్ ఇండక్షన్, మ్యాట్రిసెస్, కాంప్లెక్స్ నంబర్స్, డిమోవియర్స్ థీరమ్, క్వాడ్రాటిక్ ఎక్స్‌ప్రెషన్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, బైనామియల్ థీరమ్ తదితరాలపై ఫోకస్ పెట్టాలి. ట్రిగనోమెట్రి నుంచి 10-15 ప్రశ్నలు అడుగుతున్నారు. ట్రిగనోమెట్రి రేషియోస్ అప్‌టు ట్రాన్స్‌ఫర్మేషన్స్, ట్రిగనోమెట్రిక్ ఈక్వేషన్స్, ఇన్వెర్స్ ట్రిగనోమెట్రిక్ ఫంక్షన్స్, హైపర్ బోలిక్ ఫంక్షన్స్, ప్రాపర్టీస్ ఆఫ్ ట్రయాంగల్ టాపిక్స్‌ను సమగ్రంగా అధ్యయనం చేయాలి. వెక్టర్ ఆల్‌జీబ్రా నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వస్తున్నాయి. అడిషన్ ఆఫ్ వెక్టర్స్, ప్రొడక్ట్ ఆఫ్ వెక్టర్స్, మెజర్స్ ఆఫ్ డిస్పెర్షన్ అండ్ ప్రాబబిలిటీలో మెజర్స్ ఆఫ్ డిప్రెషన్, ప్రాబబిలిటీ, ర్యాండమ్ వేరియబుల్స్, ప్రాబబిలిటీ డిస్ట్రిబ్యూషన్స్‌పై పట్టుసాధించాలి. అభ్యర్థులు సూత్రాలపై పట్టుసాధించాలి. త్రికోణమితిలో సూత్రాలు ఎక్కువగా ఉంటాయి. వాటిని గుర్తుపెట్టుకొని సరైన చోట అన్వయించగలిగేలా ప్రిపరేషన్ సాగించాలి. దీంతోపాటు వేగం, కచ్చితత్వంపై దృష్టిసారించాలి.


### ప్రాక్టీస్ ముఖ్యం

బోర్డు పరీక్షలయినా, ఎంసెట్ అయినా మ్యాథమెటిక్స్‌లో ఎక్కువ మార్కులు సాధించాలంటే.. ప్రాక్టీస్ తప్పనిసరి. షార్ట్‌కట్ నైపుణ్యాలను పెంచుకుంటే.. ఎంసెట్ పరంగా విద్యార్థులకు ప్రయోజనం ఉంటుంది. విద్యార్థులు ప్రతి చాప్టర్‌లోని సినాప్సిస్‌పై పట్టు సాధించాలి. ఎంసెట్‌లో 50 నుంచి 60 ప్రశ్నలు నేరుగా అడుగుతారు. కాబట్టి గత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి. బోర్డు పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఎంసెట్ ప్రిపరేషన్‌కు రోజూ రెండు నుంచి మూడు గంటల సమయం కేటాయించాలి.

**-ఎం.ఎస్.రావు**, శ్రీ చైతన్య విద్యాసంస్థలు

## ఫిజిక్స్

ఎంసెట్‌లో అత్యధికంగా హీట్ అండ్ థర్మోడైనమిక్స్ నుంచి ప్రశ్నలు వస్తున్నాయి. ఈ చాప్టర్ నుంచి దాదాపు పది ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది. దీని తర్వాత వర్క్ ఎనర్జీ పవర్, సిస్టమ్ ఆఫ్ పార్టికల్స్ అండ్ రొటేషనల్



మోషన్, లాస్ ఆఫ్ మోషన్, మోషన్ ఇన్ ఎ ప్లేన్, మూవింగ్ చార్జెస్ అండ్ మ్యాగ్నటిజం చాప్టర్ల నుంచి ఐదు లేదా ఆరు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. గ్రావిటేషన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆసిలేషన్స్, వేవ్స్, ఎలక్ట్రోస్టాటిక్ పొటెన్షియెల్ అండ్ కెపాసిటెన్స్ చాప్టర్ల నుంచి నాలుగు ప్రశ్నల చొప్పున అడిగే వీలుంది. వీటి తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఎలక్ట్రో మ్యాగ్నెటిక్ ఇండక్షన్, రే ఆప్టిక్స్, ఆల్టర్నేటింగ్ కరెంట్, వేవ్ ఆప్టిక్స్, మోషన్ ఇన్ ఎ స్ట్రెయిట్ లైన్, మెకానికల్ ప్రాపర్టీస్ ఆఫ్ ఫ్లూయిడ్స్, ఎలక్ట్రిక్ చార్జెస్ అండ్ ఫీల్డ్స్, డ్యూయెల్ నేచర్ ఆఫ్ రేడియేషన్ అండ్ మేటర్, న్యూక్లియై, సెమికండక్టర్ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టిపెట్టాలి.


### మెకానిక్స్‌పై ఫోకస్

ఎంసెట్ ప్రిపరేషన్ పరంగా విద్యార్థులు మెకానిక్స్‌పై ఫోకస్ పెట్టాలి. పరీక్షలో అత్యధిక వెయిటేజీ దీనికే దక్కుతోంది. తర్వాత ఎలక్ట్రిసిటీ, మోడ్రన్ ఫిజిక్స్ పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎంసెట్ మల్టిపుల్ చాయిస్ విధానంలో జరుగుతుంది. బోర్డు పరీక్షలకు సంబంధించి డిస్క్రిప్టివ్ తరహాలో ప్రిపరేషన్ సాగించాల్సి ఉంటుంది. బోర్డు పరీక్షలకు ప్రిపేరయ్యే సమయంలో బిట్‌లు అడిగేందుకు ఆస్కారం ఉన్న అంశాన్ని గుర్తించి దాన్ని ప్రత్యేకంగా నోట్ చేసుకోవడం లాభిస్తుంది.

**-టి.పావని**, ఎస్ఆర్ఐ విద్యాసంస్థలు

## కెమిస్ట్రీ

- ఫిజికల్ కెమిస్ట్రీలో సొల్యూషన్స్ చాప్టర్ నుంచి ప్రధానంగా ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు అడుగుతున్నారు. దీంతోపాటు రౌల్ట్స్‌లా, ఐడియల్, నాన్ ఐడియల్ సొల్యూషన్స్, సొల్యుబిలిటీ, మొలారిటీ, మొలాలిటీ, వేపర్ ప్రెజర్ ఆఫ్ లిక్విడ్ సొల్యూషన్స్ తదితరాలపై దృష్టిపెట్టాలి. సాలిడ్‌స్టేట్‌లో క్లాసిఫికేషన్ ఆఫ్ క్రిస్టలైన్ సాలిడ్స్, ఎక్స్‌రే క్రిస్టలోగ్రఫీ,బ్యాండ్ థియరీ ఆఫ్ మెటల్స్, మ్యాగ్నెటిక్ ప్రాపర్టీస్, ఎలక్ట్రో కెమిస్ట్రీ చాప్టర్స్‌లో నెర్న్స్ ఈక్వేషన్‌పై ప్రాబ్లమ్ బేస్డ్ ప్రశ్నలు, ఎలక్ట్రాలసిస్ రిలేటెడ్ ప్రాబ్లమ్స్‌పై ఫోకస్ పెట్టాలి. IA,IIA,II-IA,IVA గ్రూపు మూలకాలు, బాయిలింగ్, మెల్టింగ్ పాయింట్లు, ఎలక్ట్రోపాజిటివిటీ, ఎలక్ట్రోనెగిటివిటీ, ఫస్ట్ ఆర్డర్ రియాక్షన్, టైప్స్ ఆఫ్ ఎలిమెంట్స్, స్టాండర్డ్ రిడక్షన్, పొటెన్షియల్ వాల్యూమ్ టాపిక్స్‌పై దృష్టిపెట్టాలి. II-IA గ్రూపులో బోరాక్స్, డైబోరేన్ స్ట్రక్చర్, ప్రిపరేషన్, ప్రాపర్టీస్, IVA గ్రూపులో డైమండ్, గ్రాఫైట్ స్ట్రక్చర్లు, సిలికాన్ల గురించి క్షుణ్నంగా చదవాలి. వీటితోపాటు డీ, ఎఫ్-బ్లాక్ ఎలిమెంట్లు, స్టాండర్డ్ రిడక్షన్ పొటెన్షియల్ వాల్యూ, వెస్పర్ థియరీ తదితరాలపై ఫోకస్ పెట్టాలి.
- ఆర్గానిక్ కెమిస్ట్రీని జనరల్, హైడ్రోకార్బన్లు, హాలో కాంపౌండ్లుగా విభజించుకొని చదవాలి. ఇందులో హైడ్రోకార్బన్లు, ఆల్కీన్లు, ఆల్కైన్లు, హోమోజినైజేషన్, రియాక్షన్ విత్ బేయర్స్ రియేజెంట్, హాలోజన్, ఎస్ఎల్ మెకానిజమ్స్, యాసిడ్ స్ట్రెంత్ ఆఫ్ ఫీనాల్స్, కార్బాక్సిలిక్ యాసిడ్స్, అమైన్స్‌పై దృష్టిపెట్టాలి. పరీక్ష సమయం దగ్గరపడుతుందనగా బయోమాలిక్యుల్స్, గ్లూకోస్, ఫ్రక్టోజ్, సుక్రోజ్ స్ట్రక్చర్లు, కెమిస్ట్రీ ఇన్ ఎవ్రీడే లైఫ్ ఎగ్జాంపుల్స్‌పై దృష్టిపెట్టడం లాభిస్తుంది.



- ఎంసెట్ పరంగా కెమిస్ట్రీని ఆర్గానిక్, ఇనార్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలుగా విభజించుకొని చదవాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీని ఎంత బాగా ప్రిపేరైతే అంత మంచి ర్యాంకు వస్తుంది. కాబట్టి దానిపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇనార్గానిక్ తర్వాత వెయిటేజీ పరంగా వరుసగా ఆర్గానిక్, ఫిజికల్ కెమిస్ట్రీలు నిలుస్తాయి. కెమిస్ట్రీ అంటే సహజంగా చాలామందికి తెలియని భయం ఉంటుంది. కాని ఆ భావనను పక్కనబెట్టి ప్రిపేరైతే కెమిస్ట్రీలోనూ మంచి మార్కులు పొందొచ్చు.

**-ఎం.రామకృష్ణ**, వాగ్దేవి అకాడమీ.

---

### ఉద్యోగ సమాచారం

#### డబ్ల్యూసీడీ-190


**ఢిల్లీ**లోని ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ విభాగం తాత్కాలిక ప్రాతిపదికన 190 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** బ్లాక్ కో ఆర్డినేటర్-95, బ్లాక్ ప్రాజెక్ట్ అసిస్టెంట్-95.
- **అర్హత:** గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత, కంప్యూటర్ నాలెడ్జ్‌తో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
- **ఎంపిక:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తుకు చివరితేదీ:** డిసెంబర్ 31, 2019
- **వెబ్‌సైట్:** www.wcddel.in

#### ఐఓసీఎల్-37

**ఇం**డియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్).. 37 జూనియర్ ఇంజనీర్ అసిస్టెంట్-4 పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ప్రొడక్షన్-33, మెక్ ఫిట్టర్ కమ్ రిగ్గర్-2, ఇన్‌స్ట్రుమెంటేషన్-2.
- **అర్హత:** పోస్టులను బట్టి సంబంధిత సబ్జెక్టుల్లో డిప్లొమా, కంట్రోల్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణత, అనుభవం ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్/ప్రొఫిషియన్సీ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 17, 2020.
- **దరఖాస్తు హార్డ్‌కాపీ పంపడానికి చివరితేదీ:** ఫిబ్రవరి 1, 2020.
- **రాత పరీక్ష తేదీ:** ఫిబ్రవరి 2, 2020.
- **వెబ్‌సైట్:** www.iocl.com



**చార్టర్డ్ అకౌంటెన్సీ.. సీఏ!**
**కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ.. సీఎంఏ!**
**ఇవి ఎవర్ గ్రీన్ కామర్స్ ప్రొఫెషల్ కోర్సులు!! వీటిని పూర్తిచేసుకుంటే.. కార్పొరేట్ కొలువులు సొంతమవుతాయి. కాని చాలామంది సీఏ, సీఎంఏ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించడం చాలా కష్టమని భావిస్తుంటారు. అయితే విద్యార్థులు కోర్సుల్లో చేరిన మొదటి రోజు నుంచే నిర్దిష్ట ప్రణాళికతో ఇష్టంగా ప్రిపరేషన్ సాగిస్తే.. విజయం పెద్ద కష్టమేమీ కాదంటున్నారు నిపుణులు. ఇటీవల కాలంలో సీఏ, సీఎంఏ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో..సీఏ, సీఎంఏ కోర్సుల తీరుతెన్నులు, విజయానికి మార్గాలు...**




# సీఏ, సీఎంఏ
# ఇష్టముంటే కష్టంకాదు!

» కామర్స్ ప్రొఫెషనల్స్‌కు పెరుగుతున్న అవకాశాలు
» తక్కువ ఖర్చుతోనే కోర్సు పూర్తిచేసుకోవచ్చు
» ఆసక్తి ఉంటేనే చేరడం మేలంటున్న నిపుణులు

**చార్టర్డ్** అకౌంటెన్సీ(సీఏ), కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ(సీఎంఏ).. ప్రాధాన్యం సంతరించుకుంటున్న కామర్స్ ప్రొఫెషనల్ కోర్సులు. వ్యాపార, వాణిజ్య రంగాల్లో కార్యకలాపాల నిర్వహణకు ఈ వృత్తి నిపుణుల సేవలు చాలా కీలకం. తాజాగా జీఎస్‌టీ అమల్లోకి రావడంతో వీరికి డిమాండ్ మరింత పెరిగింది. ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో, కార్పొరేట్ కంపెనీల్లో సీఏ, సీఎంఏలకు అవకాశాలు లభిస్తున్నాయి.

### చార్టర్డ్ అకౌంటెన్సీ

సీఏ కోర్సులో మొత్తం మూడు దశలు.. ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ ఉంటాయి.

పదో తరగతి తర్వాత ఎంఈసీ చదువుతూ.. సీఏ తొలిదశ ఫౌండేషన్ కోర్సులో చేరొచ్చు. లేదా ఇంటర్మీడియెట్‌లో ఏ గ్రూప్‌తో ఉత్తీర్ణత సాధించినా.. సీఏ కోర్సుకు నమోదు చేసుకోవచ్చు. పదో తరగతి తర్వాత నమోదు చేసుకున్న విద్యార్థులు ఆరున్నరేళ్లు;ఇంటర్మీడియెట్ తర్వాత చేరిన విద్యార్థులు నాలుగున్నరేళ్లలో కోర్సు పూర్తిచేసుకోవచ్చు.

### కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ

గతంలో ఐసీడబ్ల్యూఏగా పేర్కొన్న కోర్సునే ఇప్పుడు కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ(సీఎంఏ)గా పిలుస్తున్నారు. ఇందులో ఫౌండేషన్, ఇంటర్, ఫైనల్ అనే మూడు దశలు ఉంటాయి. పదోతరగతి తర్వాత చేరిన విద్యార్థులు ఐదేళ్లలో; ఇంటర్మీడియెట్ తర్వాత అడుగుపెట్టిన విద్యార్థులు మూడేళ్లలో సీఎంఏ కోర్సును పూర్తి చేసుకోవచ్చు.

### ఉత్తీర్ణత శాతంలో పెరుగుదల

వాస్తవానికి సీఏ, సీఎంఏ కోర్సుల్లో చేరాలంటే.. గతంలో విద్యార్థులు వెనుకంజ వేసేవారు. కారణం ఉత్తీర్ణత శాతం తక్కువ అనే అభిప్రాయం ఉండటమే. కాని ప్రస్తుతం ఇంటర్మీడియెట్‌తో ఈ కోర్సుల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. అందుకుతగ్గట్టే ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. ఇంటర్ తర్వాత సీఏలో చేరే అవకాశం కల్పించిన తర్వాత కాలంలో సీఏ ఉత్తీర్ణత శాతం మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగిందని ఐసీఏఐ గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది. దీనికి ప్రధాన కారణం ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన వెంటనే ఈ కోర్సులో చేరిన విద్యార్థులు ఏకాగ్రతతో చదివే విధంగా వ్యవహరిస్తుండటమే.

### సమాంతరంగా డిగ్రీ

ఇంటర్మీడియెట్ అర్హతతో సీఏ, సీఎంఏ కోర్సుల్లో చేరిన విద్యార్థులు.. సమాంతరంగా బ్యాచిలర్ డిగ్రీ సైతం పూర్తి చేసుకోవచ్చు. ఫలితంగా విద్యార్థులకు ఒకే సమయంలో రెండు సర్టిఫికెట్లు చేతికందుతాయి. ఒకవేళ సీఏ, సీఎంఏలలో ఆశించిన ఫలితం రాకపోయినా, లేదా మధ్యలో ఆపేసినా.. డిగ్రీ అర్హతతో నిర్వహించే పోటీ పరీక్షలు రాసుకోవచ్చు. ఉన్నత విద్యపై ఆసక్తి ఉంటే.. డిగ్రీ అర్హతతో 'లా', ఎంబీఏ వంటి కోర్సుల్లో చేరొచ్చు. సీఏ, సీఎంఏ కోర్సులు మధ్యలో ఆపేసిన విద్యార్థులు సైతం అకౌంటింగ్ విభాగాల్లో ఉద్యోగావకాశాలు అందుకునే వీలుంది. సదరు విద్యార్థులు అప్పటికే అకౌంటింగ్ విభాగంలో నైపుణ్యాలతోపాటు ప్రాక్టికల్ ట్రైనింగ్ కూడా పూర్తి చేసుకొని ఉండటమే ఇందుకు కారణం.

### అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సు

సీఏ కోర్సు పరంగా విద్యార్థులకు ప్రస్తుతం కలిసొస్తున్న మరో ముఖ్యమైన అంశం.. అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సు. సీఏ రెండోదశ (ఇంటర్మీడియెట్)లోని గ్రూప్-1లో ఉత్తీర్ణత సాధించి, ఏడాది పాటు ఆర్టికల్‌షిప్ పూర్తి చేసిన వారు అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సుకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సు పూర్తి చేసుకున్న వారికి సీఏ ఇన్‌స్టిట్యూట్.. అకౌంటింగ్ టెక్నీషియన్ సర్టిఫికెట్‌ను అందిస్తుంది. ఈ సర్టిఫికెట్ ద్వారా కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా స్వయం ఉపాధి పరంగా ఇన్‌కమ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్, సేల్స్ ట్యాక్స్ ప్రాక్టీషనర్ లేదా జీఎస్‌టీ ప్రాక్టీషనర్‌గా రాణించే వీలుంది. మూడు దశల సీఏలో మూడోదశ(ఫైనల్)లో చేరని విద్యార్థులకు ఈ అకౌంటింగ్ టెక్నీషియన్ కోర్సు చక్కటి ఉపాధి మార్గంగా మారింది.

### ఎంఈసీతో బెటర్

సీఏ, సీఎంఏ కోర్సులతో ఉన్నత ఉద్యోగావకాశాలు లభిస్తున్న మాట వాస్తవం. అయితే ఈ కోర్సుల్లో చేరే విద్యార్థులు ఆసక్తితో అడుగుపెట్టడం అవసరం. ఇతరుల సలహాలు, సూచనల ఆధారంగా సీఏ, సీఎంఏల్లో చేరడం సరికాదు. ఇంటర్మీడియెట్ ఎంఈసీ గ్రూప్‌లో చేరితే ఈ కోర్సుల్లోనూ రాణించడానికి బలమైన పునాది ఏర్పడుతుంది. ఇతర కోర్సులతో పోల్చితే తక్కువ ఖర్చుతోనే సీఏ, సీఎంఏ పూర్తి చేసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా భవిష్యత్తులో ఉన్నత అవకాశాలు సొంతం చేసుకునే వీలుంది.



**-ఎం.ఎస్.ఎస్.ప్రకాశ్,**
డైరెక్టర్,
మాస్టర్ మైండ్స్

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
23-12-2019



## 229

ఈ మ్యాచ్ ద్వారా పేస్ బౌలర్ నవదీప్ సైనీ భారత్ తరఫున వన్డేల్లో అరంగేట్రం చేసిన 229వ క్రికెటర్‌గా నిలిచాడు. ఓవరాల్‌గా ఈ సంవత్సరం భారత్ తరఫున ఐదుగురు ఆటగాళ్లు సిరాజ్, విజయ్ శంకర్, శుబ్‌మన్ గిల్, శివమ్ దూబే వన్డేల్లో అరంగేట్రం చేశారు.

## 10

వెస్టిండీస్‌పై వరుసగా పదో ద్వైపాక్షిక వన్డే సిరీస్‌ను భారత్ గెల్చుకుంది. ఓ ప్రత్యర్థిపై అత్యధిక వరుస సిరీస్ విజయాలు సాధించిన జట్టుగా టీమిండియా నిలిచింది. శ్రీలంకపై సాధించిన తొమ్మిది వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ (2005 నుంచి) సవరించింది.



# కలిసి కట్టుగా... పది పట్టుగా...

*ఓపెనర్లు శుభారంభం చేసినా చేయకపోయినా... ఛేదనలో మాత్రం కోహ్లి ఆటే కీలకం. అదెన్నోసార్లు రుజువైంది కూడా! మరిపుడు రోహిత్, రాహుల్ చక్కని ఆరంభమే ఇచ్చారు. కోహ్లి కూడా బాగా ఆడాడు. కానీ మిడిలార్డరే తమకు పట్టనట్టుగా చేతులెత్తేసింది. దీంతో ఒకదశలో విజయానికి ఎంతో దూరంలో భారత్ నిలిచింది. ఇలాంటి దశలో విరాట్ కడదాకా ఉండాల్సిందే. కానీ గెలిపించే ఈ నాయకుడు కూడా లక్ష్యానికి 30 పరుగుల దూరంలో అవుటయ్యాడు. ఈ పరిణామంతో స్టేడియమే కాదు... యావత్ దేశమే షాకయ్యింది. పరాజయం ఖాయమనుకుంది. కానీ జడేజాకు టెయిలెండర్ శార్దుల్ ఠాకూర్ (6 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) జతయ్యాడు. ఇద్దరూ గెలిపించే మెరుపులతో అలరించారు. కీలకదశలో స్ఫూర్తిదాయక బ్యాటింగ్‌తో భారత్‌ను విజయతీరాలకు చేర్చారు. విండీస్‌పై భారత్‌కు వరుసగా పదో ద్వైపాక్షిక వన్డే సిరీస్ దక్కడంలో ముఖ్యపాత్ర పోషించారు.*

- చివరి వన్డేలో భారత్ 4 వికెట్లతో విజయం
- 2–1తో సిరీస్ కైవసం
- విండీస్‌పై వరుసగా పదో సిరీస్ నెగ్గిన టీమిండియా
- నిలిచి, గెలిపించిన జడేజా, శార్దుల్
- మెరిసిన కోహ్లి, రోహిత్, రాహుల్
- పొలార్డ్, పూరన్ మెరుపులు వృథా


**కటక్:** విజయవంతమైన సారథి విరాట్ కోహ్లి ఖాతాలో మరో వన్డే సిరీస్ జమ అయింది. వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన చివరిదైన మూడో వన్డేలో భారత్ నాలుగు వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. దాంతో టీమిండియా 2–1తో సిరీస్ నెగ్గింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 315 పరుగుల భారీ స్కోరు చేసింది. నికోలస్ పూరన్ (64 బంతుల్లో 89; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ పొలార్డ్ (51 బంతుల్లో 74 నాటౌట్; 3 ఫోర్లు, 7 సిక్సర్లు) చెలరేగారు. భారత్ తరఫున అరంగేట్రం చేసిన పేస్ బౌలర్ నవదీప్ సైనీకి 2 వికెట్లు దక్కాయి. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ 48.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ కోహ్లి (81 బంతుల్లో 85; 9 ఫోర్లు), రాహుల్ (89 బంతుల్లో 77; 8 ఫోర్లు, 1 సిక్స్), రోహిత్ (63 బంతుల్లో 63; 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'... రోహిత్‌కు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' లభించాయి.

**మందకొడిగా ఆరంభం...**

టాస్ నెగ్గిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో విండీస్ పరుగుల ఆట మొదలు పెట్టింది. కరీబియన్ ఆట చాలా నెమ్మదిగా మొదలైంది. 3 ఓవర్లు ముగిసినా స్కోరు బోర్డులో మూడే పరుగులున్నాయి. ఆ తర్వాత షై హోప్ బ్యాట్‌కు పనిచెప్పడంతో కాస్త వేగం పెరిగింది. లూయిస్ కూడా అడపాదడపా బౌండరీలు బాదినా 10 ఓవర్లలో విండీస్ స్కోరు 44/0. మందకొడిగా సాగుతున్న ఇన్నింగ్స్‌కు జడేజా బ్రేక్ ఇచ్చాడు. లూయిస్ (21)ను పెవిలియన్ చేర్చాడు. కాసేపటికి హోప్ (50 బంతుల్లో 42; 5 ఫోర్లు)ను షమీ క్లీన్‌బౌల్డ్ చేశాడు. 20 ఓవర్లలో విండీస్ 2 వికెట్ల నష్టానికి 70 పరుగులే చేయగలిగింది. చాలా ఆలస్యంగా 26వ ఓవర్లో 100 పరుగులు దాటింది. ఈ రన్‌రేట్‌తో ఇక లాభం లేదనుకున్నాడేమో హెట్‌మైర్ ధాటిని పెంచాడు. 2 ఫోర్లు 2 సిక్స్‌లు కొట్టిన హెట్‌మైర్ (33 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు)ను సైనీ ఔట్ చేశాడు. కాసేపటికే చేజ్ (48 బంతుల్లో 38; 3 ఫోర్లు) కూడా సైనీనే పెవిలియన్ చేర్చాడు. ఈ దశలో పూరన్, పొలార్డ్ విండీస్‌ను ఆదుకున్నారు. ముందుగా నిలదొక్కుకున్నాక భారత బౌలర్ల భరతం పట్టారు. ఐదో వికెట్‌కు 135 పరుగుల భాగస్వామ్యం అందించారు.



పొలార్డ్



పూరన్

**ధనాధన్, ఫటాఫట్**

వెస్టిండీస్ భారీ స్కోరుకు ఆఖరి మెరుపులే దోహదం చేశాయి. 45 ఓవర్లదాకా కరీబియన్ స్కోరు 238/4. హిట్టర్లు పూరన్, పొలార్డ్ క్రీజులో ఉండటం, అప్పటికే క్రీజులో పాతుకొని పోవడంతో ధనాధన్‌కు ఎదురే లేకుండా పోయింది. ఈ ఐదు ఓవర్లలో భారత్ 77 పరుగులు సమర్పించుకుంది. సైనీ 46వ ఓవర్లో పూరన్ 3 బౌండరీలు సహా మొత్తం 14 పరుగులు చేశాడు. 47వ ఓవర్లో షమీ మొదటి బంతికే పొలార్డ్ సిక్స్ బాదాడు. ఈ ఓవర్లో విండీస్ 10 పరుగులు పిండుకుంది. శార్దుల్ వేసిన 48వ ఓవర్లో పూరన్ ఔటైనా అంతకుముందే అతను 2 ఫోర్లు, ఓ సిక్స్ కొట్టాడు. ఆఖరి బంతిని హోల్డర్ బౌండరీకి తరలించడంతో ఈ ఓవర్లో 21 పరుగులు వచ్చాయి. తర్వాత సైనీ, షమీ ఓవర్లలో పొలార్డ్ భారీ సిక్స్‌లతో విరుచుకుపడ్డాడు. దీంతో విండీస్ స్కోరు 300 దాటేసింది.

**వేట మొదలైందిలా...**

లక్ష్యం కష్టమైందే కానీ ఫ్లాట్ పిచ్ దృష్ట్యా నిలబడితే ఛేదించే స్కోరిది. అందుకేనేమో భారత ఓపెనర్లు రోహిత్ శర్మ, లోకేశ్ రాహుల్ ఒక్కో పరుగును జతచేస్తూ, వీలైనపుడే బౌండరీకి తరలిస్తూ పరుగుల వేటకు శ్రీకారం చుట్టారు. కాట్రెల్ తొలి ఓవర్ మెయిడెన్ కాగా... రెండో ఓవర్లో రాహుల్ ఫోర్‌తో భారత పరుగు మొదలైంది. మూడు, నాలుగు ఓవర్లో రోహిత్ ఫోర్లు, సిక్సర్‌తో వేగం పెరిగింది. రాహుల్ కూడా అదుపు తప్పిన బంతులను బౌండరీలకు తరలిస్తూ 'హిట్‌మ్యాన్'ను అనుసరించాడు. 10 ఓవర్లలో జట్టు వికెట్ కోల్పోకుండా 59 పరుగులు చేయగలిగింది.



రోహిత్



రాహుల్

**రోహిత్, రాహుల్ ఫిఫ్టీ–ఫిఫ్టీ...**

ఆ తర్వాత కూడా ఓపెనర్లు అనవసర షాట్లకు వెళ్లకుండానే చేయాల్సిన రన్‌రేట్‌ను ఓ కంట కనిపెడుతూనే స్కోరును నడిపించారు. జట్టు స్కోరును 16వ ఓవర్లో 100 పరుగులు దాటించారు. ఆ వెంటనే రాహుల్ 49 బంతుల్లో, రోహిత్ 52 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. 22వ ఓవర్లో హోల్డర్ ఈ జోడీని విడగొట్టడంతో 122 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రోహిత్ కీపర్ హోప్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు.

**మిడిల్...కుదేల్...**

కోహ్లి అండతో రాహుల్ జోరు పెంచే ప్రయత్నం చేశాడు. జోసెఫ్ వేసిన 28వ ఓవర్లో డీప్ స్క్వేర్ లెగ్ దిశగా భారీ సిక్సర్ బాదాడు. అతని నిలకడైన ఆటతీరు చూస్తుంటే సెంచరీ ఖాయమనిపించింది. కానీ జోసెఫ్ మరుసటి ఓవర్లోనే రాహుల్ లూజ్ షాట్‌తో వెనుదిరిగాడు. బంతిని సరిగా అంచనా వేయలేకపోగా అదికాస్తా రాహుల్ గ్లౌజ్‌ను తాకుతూ కీపర్ చేతుల్లోకి వెళ్లింది. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (7) ఎంతోసేపు క్రీజులో నిలువలేకపోయాడు. జట్టు స్కోరు 200 పరుగులు దాటాకా, సారథి కోహ్లికి సహకరించాల్సిన పంత్ (7)... అనవసరంగా వికెట్లపై కి ఆడుకొని బౌల్డయ్యాడు. కేదార్ జాదవ్ (9)ను కాట్రెల్ బౌల్డ్ చేశాడు. జట్టు స్కోరు 228/5. సగం వికెట్లు కోల్పోగా ఉన్న స్పెషలిస్ట్ బ్యాట్స్‌మన్ కోహ్లి ఒక్కడే! జడేజాను అట్టిపెట్టుకుని లక్ష్యం దిశగా తీసుకెళ్లే బాధ్యత మోశాడు. అర్ధసెంచరీ సాధించాడు. ఆరో వికెట్‌కు 58 పరుగులు జోడించాక కీమో పాల్ బౌలింగ్‌లో కోహ్లి బౌల్డయ్యాడు.



కోహ్లి

## స్కోరు వివరాలు

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** ఎవిన్ లూయిస్ (సి) సైనీ (బి) జడేజా 21; షై హోప్ (బి) షమీ 42; రోస్టన్ చేజ్ (బి) సైనీ 38; హెట్‌మైర్ (సి) కుల్దీప్ యాదవ్ (బి) సైనీ 37; నికోలస్ పూరన్ (సి) జడేజా (బి) శార్దుల్ 89; కీరన్ పొలార్డ్ (నాటౌట్) 74; జేసన్ హోల్డర్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (50 ఓవర్లలో 5 వికెట్లకు) 315.**

**వికెట్ల పతనం:** 1–57, 2–70, 3–132, 4–144, 5–279. **బౌలింగ్:** శార్దుల్ ఠాకూర్ 10–0– 66–1, షమీ 10–2–66–1, నవదీప్ సైనీ 10–0–58–2, కుల్దీప్ 10–0–67–0, జడేజా 10–0–54–1.

**భారత్ ఇన్నింగ్స్:** రోహిత్ శర్మ (సి) షై హోప్ (బి) హోల్డర్ 63; కేఎల్ రాహుల్ (సి) షై హోప్ (బి) జోసెఫ్ 77; కోహ్లి (బి) కీమో పాల్ 85; శ్రేయస్ అయ్యర్ (సి) జోసెఫ్ (బి) కీమో పాల్ 7; రిషభ్ పంత్ (బి) కీమో పాల్ 7; కేదార్ జాదవ్ (బి) కాట్రెల్ 9; రవీంద్ర జడేజా (నాటౌట్) 39; శార్దుల్ ఠాకూర్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (48.4 ఓవర్లలో 6 వికెట్లకు) 316.**

**వికెట్ల పతనం:** 1–122, 2–167, 3–188, 4–201, 5–228, 6–286. **బౌలింగ్:** కాట్రెల్ 10–1–74–1, హోల్డర్ 10–0–63–1, కీమో పాల్ 9.4–0–59–3, చేజ్ 4–0–19–0, ఖారీ పైర్ 7–0–46–0, జోసెఫ్ 8–0–53–1.



జడేజా, శార్దుల్

## శార్దుల్ చకచకా...

కోహ్లి పెవిలియన్ చేరే సమయానికి భారత విజయ సమీకరణం 23 బంతుల్లో 30 పరుగులు. బ్యాటింగ్ ఆర్డర్‌లో మరో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్ ఎవరూ లేకపోవడంతో పరాజయం తప్పదనుకున్నారంతా. అనుభవజ్ఞుడైన జడేజా (39 నాటౌట్; 4 ఫోర్లు)కు శార్దుల్ జత చేరగా పరుగులు చేసే బాధ్యత పూర్తిగా జడేజాదే కానీ... ఇక్కడ శార్దులే (6 బంతుల్లో 17 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఆ బాధ్యత తీసుకున్నాడు. ఎదుర్కొన్న తొలి బంతిని కవర్స్ దిశగా బౌండరీ దాటించిన శార్దుల్... ఆ తర్వాత కాట్రెల్ ఓవర్లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టాడు. శార్దుల్ చేసినవి కాసిన్ని పరుగులే అయినా అవెంతో విలువైనవి... జట్టును గెలిపించినవి... సిరీస్‌ను అందించినవి అయ్యాయి.

**1** ఓ ఏడాదిలో ఓపెనర్‌గా అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రోహిత్ శర్మ రికార్డు సృష్టించాడు. 22 ఏళ్లుగా శ్రీలంక ఓపెనర్ సనత్ జయసూర్య (1997లో 2387 పరుగులు) పేరిట ఉన్న ఈ రికార్డును రోహిత్ విండీస్‌పై మూడో మ్యాచ్‌లో అధిగమించాడు. ఓవరాల్‌గా ఈ ఏడాది రోహిత్ మూడు ఫార్మాట్‌లలో (టెస్టు, వన్డే, టి20) కలిపి 2442 పరుగులు సాధించాడు.

**1** ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. రోహిత్ ఈ ఏడాది 28 వన్డేలు ఆడి 1490 పరుగులు చేశాడు. ఇందులో 7 సెంచరీలు, 6 అర్ధ సెంచరీలు ఉన్నాయి. కోహ్లి (1377), షై హోప్ (విండీస్–1345) తర్వాతి స్థానాల్లో ఉన్నారు.

**3** అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు గెల్చుకున్న క్రికెటర్ల జాబితాలో విరాట్ కోహ్లి (57 సార్లు) ప్రస్తుతం జాక్వస్ కలిస్‌తో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచాడు. సచిన్ (76 సార్లు), జయసూర్య (58 సార్లు) వరుసగా తొలి రెండు స్థానాల్లో ఉన్నారు.

**4** వరుసగా నాలుగో ఏడాది విరాట్ కోహ్లి అంతర్జాతీయ క్రికెట్‌లో (మూడు ఫార్మాట్‌లు) అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచాడు. కోహ్లి 2016లో 2595... 2017లో 2818... 2018లో 2735... 2019లో 2455 పరుగులు చేశాడు.

**19** వన్డేల్లో 300 అంతకంటే ఎక్కువ లక్ష్యాన్ని ఛేదించడం భారత్‌కిది 19వసారి. ఈ జాబితాలో ఇంగ్లండ్ (11 సార్లు), ఆస్ట్రేలియా (10 సార్లు), శ్రీలంక (10 సార్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

**విండీస్‌పై ద్వైపాక్షిక సిరీస్ ఫలితాలు**

| సీజన్ | వేదిక | ఫలితం | విజేత |
|---|---|---|---|
| 2006-07 | భారత్ | 3-1 | భారత్ |
| 2009 | వెస్టిండీస్ | 2-1 | భారత్ |
| 2011 | వెస్టిండీస్ | 3-2 | భారత్ |
| 2011-12 | భారత్ | 4-1 | భారత్ |
| 2013-14 | భారత్ | 2-1 | భారత్ |
| 2014-15 | భారత్ | 2-1 | భారత్ |
| 2017 | వెస్టిండీస్ | 3-1 | భారత్ |
| 2018-19 | భారత్ | 3-1 | భారత్ |
| 2019 | వెస్టిండీస్ | 2-0 | భారత్ |
| 2019 | భారత్ | 2-1 | భారత్ |

"భారత క్రికెట్‌కు 2019 అద్భుతంగా గడిచింది. ప్రపంచ కప్‌లోనూ న్యూజిలాండ్‌తో సెమీఫైనల్లో 30 నిమిషాలను మినహాయిస్తే మిగతాదంతా గొప్పగా సాగింది. ఎప్పటికైనా ఐసీసీ ట్రోఫీలను పొందేందుకు మేం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటాం. ముఖ్యంగా మా పేస్ దళం ఎక్కడైనా, ఎలాంటి ప్రత్యర్థినైనా ఎదుర్కొనేలా తయారైంది. భారత్‌లో స్పిన్నర్లను మించి పేసర్లు రాణించడం అనేది గొప్ప పరిణామం. రాబోయే రోజుల్లో భారత క్రికెట్‌ను కొత్త ఆటగాళ్లే నడిపించాలి కాబట్టి ప్రస్తుతం యువ ఆటగాళ్లు ఒత్తిడిలో ఎలా రాణిస్తారనే అంశాన్ని మేం పరీక్షిస్తున్నాం. ఈ రోజు మా ఆట సంతృప్తి కలిగించింది. మంచు ప్రభావం ఉండటంతో భాగస్వామ్యాలు నిర్మించడంపై దృష్టి సారించాం. ఇది పనిచేసింది. నేను అవుటయ్యాక 'జడ్డూ' ఆత్మవిశ్వాసంతో ఆడాడు. కేవలం మూడు ఓవర్లలోనే శార్దుల్, జడేజా మ్యాచ్ గతిని మార్చేశారు. బయట నుంచి ఇతరులు ఆట పూర్తి చేస్తుంటే చూడటం అద్భుతంగా ఉంటుంది.' *–కోహ్లి, భారత కెప్టెన్*

---

# విజేత సీవీ ఆనంద్

### ఆలిండియా పోలీసు టెన్నిస్ చాంపియన్‌షిప్

**సాక్షి, విశాఖ స్పోర్ట్స్:** రెండు దశాబ్దాల చరిత్ర కలిగిన ఆలిండియా పోలీసు టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) ప్లేయర్‌కు పురుషుల సింగిల్స్ టైటిల్ లభించింది. వైజాగ్‌లో ఆదివారం ముగిసిన ఈ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ సీనియర్ ఐపీఎస్ అధికారి, సీఐఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) సీవీ ఆనంద్ చాంపియన్‌గా అవతరించారు. సీఐఎస్ఎఫ్ తరపున బరిలోకి దిగిన ఆనంద్ ఫైనల్లో 8–4తో సత్యనారాయణ (ఆంధ్రప్రదేశ్)పై విజయం సాధించారు. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో గెలిచిన ఆనంద్ సెమీఫైనల్లో శైలేశ్ కుమార్ (బీఎస్ఎఫ్)ను ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించారు. గత 20 ఏళ్లలో ఆలిండియా పోలీసు టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో సీఐఎస్ఎఫ్‌కు ఓ విభాగంలో టైటిల్ లభించడం ఇదే ప్రథమం. టీమ్ చాంపియన్‌షిప్ విభాగంలో సీఆర్‌పీఎఫ్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో ఐటీబీపీపై సీఆర్‌పీఎఫ్ గెలిచింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ పోటీల్లో 19 జట్ల నుంచి 103 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి సుచరిత చేతుల మీదుగా స్వర్ణ పతకం, ప్రశంసాపత్రం అందుకున్న టెన్నిస్ సింగిల్స్ చాంపియన్ సీవీ ఆనంద్

ఆంధ్రప్రదేశ్ హోం శాఖ మంత్రి మేకతోటి సుచరిత ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ డీజీపీ గౌతమ్ సావంగ్, ఐబీ స్పెషల్ డైరెక్టర్ అలోక్ ప్రభాకర్, విశాఖపట్నం పోలీసు కమిషనర్ ఆర్‌కే మీనా తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు దేశాల సూపర్ సిరీస్ వన్డే టోర్నీ!

### 2021లో భారత్ వేదికగా నిర్వహణ

**ముంబై:** అన్నీ అనుకున్నట్లు జరిగితే... భారత్ వేదికగా... 2021లో భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, మరో జట్టుతో కలిసి నాలుగు దేశాల సూపర్ సిరీస్ వన్డే టోర్నీ నిర్వహిస్తామని బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ తెలిపాడు. అయితే అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) దీనిని ఆమోదిస్తుందో లేదో చూడాలి. మూడు జట్లకు మించి పాల్గొనే సిరీస్‌లను ఐసీసీ ఇప్పటి వరకు ఆమోదించలేదు. అంతేకాకుండా ఐసీసీ 2023–2031 మధ్య ప్రతి ఏడాది నిర్వహించేలా ఒక టోర్నీని ప్రతిపాదించగా... దీనిని భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా బోర్డులు వ్యతిరేకించాయి.

# విజయం దిశగా పాకిస్తాన్

**లంక లక్ష్యం 476 • ప్రస్తుతం 212/7**

**కరాచీ:** శ్రీలంకతో జరుగుతోన్న రెండో టెస్టులో చివరి రోజు మరో మూడు వికెట్లు తీస్తే పాకిస్తాన్ విజయం ఖాయమవుతుంది. 476 పరుగుల భారీ విజయలక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక నాలుగో రోజు ఆదివారం ఆట ముగిసే సమయానికి 7 వికెట్లకు 212 పరుగులు చేసింది. ఓపెనర్ ఒశాడ ఫెర్నాండో అజేయ శతకం (102 బ్యాటింగ్; 13 ఫోర్లు) క్రీజులో ఉన్నాడు. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 395/2తో నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 131 ఓవర్లలో 3 వికెట్లకు 555 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. కెప్టెన్ అజహర్ అలీ (118; 13 ఫోర్లు), బాబర్ ఆజమ్ (100 నాటౌట్; 7 ఫోర్లు, సిక్స్) శతకాలతో చెలరేగారు. టెస్టుల్లో ఒకే ఇన్నింగ్స్‌లో పాక్ తరపున టాప్–4 బ్యాట్స్‌మెన్ సెంచరీలు (ఆబిద్, మసూద్) చేయడం ఇదే తొలిసారి. ఓవరాల్‌గా టెస్టుల్లో ఈ ఘనత నమోదవ్వడం ఇది రెండోసారి మాత్రమే. గతంలో భారత్ (2007లో ఢాకాలో బంగ్లాదేశ్‌పై; దినేశ్ కార్తీక్, వసీమ్ జాఫర్, ద్రవిడ్, సచిన్ సెంచరీలు) ఈ ఘనతను సాధించింది.



ఆజమ్

అజహర్

epaper.sakshi.com

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
23-12-2019

## స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 8 ▲ | 12 ▲ |
| 41,682 | 12,272 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 8,925 | ▲ 37 |
| డోజోన్స్ | 28,455 | ▲ 78 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,582 | ▲ 9 |
| డాక్స్ | 13,319 | ▲ 107 |
| షాంఘై | 3,005 | ▼ 12 |
| నికాయ్ | 23,817 | ▼ 48 |


● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | ● కొనుగోలు | ● అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.35 | 71.99 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 91.07 | 94.27 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.67 | 80.59 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.90 | 66.29 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.05 | 50.21 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.61 | 53.41 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.18 | 19.78 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.90 | 19.90 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.53 | 10.93 |

# గృహ రుణ బదిలీతో లాభమెంత?

- తీసుకున్న రుణం ఏ బెంచ్‌మార్క్ ఆధారితమో చూడాలి
- ప్రస్తుతం అమల్లో ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానం
- కొత్త విధానంలో పారదర్శకత ఎక్కువ
- వడ్డీ రేట్ల బదిలీ వేగంగా ఉంటుంది
- పాత విధానంలో రేట్ల తగ్గింపు ప్రయోజనం తక్కువ
- నూతన విధానానికి మార్చుకోవాలి
- తక్కువ రేటుకు ఆఫర్ చేసే వేరే సంస్థకు బదిలీ చేసుకోవచ్చు




**2010** తర్వాత గృహ రుణాలకు బెంచ్‌మార్క్ విధానాలు మూడు పర్యాయాలు మారిపోయాయి. 2011లో బేస్ రేటు, 2016లో ఎంసీఎల్ఆర్ రేటు, 2019 అక్టోబర్‌లో ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ రేటు విధానాలు అమల్లోకి వచ్చాయి. రేట్లలో మార్పును వెంటనే బదలాయించడం, పారదర్శకత పెంపునకు ఎప్పటికప్పుడు నూతన విధానాల అమలు జరుగుతోంది. కానీ, అరుణ్ మిశ్రా వంటి ఎందరో ఇప్పటికీ పాత బెంచ్ మార్క్ విధానంలోనే కొనసాగుతున్నారు. మరింత పారదర్శకత, తక్కువ వడ్డీ రేటుతో కూడిన విధానాలకు బదిలీ చేసుకోవడం లేదు. ఒక నివేదిక ప్రకారం.. ఎస్‌బీఐ గృహ రుణాల పోర్ట్‌ఫోలియోలో 25 శాతం రుణాలు ఇప్పటికీ బేస్ రేటు విధానంలోనే కొనసాగుతున్నాయి. రూ.5,000 కోట్ల రుణాలు బీపీఎల్ఆర్ విధానంలో ఉన్నాయి. "బేస్ రేటు లేదా బీపీఎల్ఆర్ విధానంలో రుణాలు తీసుకున్న కస్టమర్లు నేడు అందుబాటులో ఉన్న మెరుగైన రేట్లతో పోలిస్తే 3.5 శాతం అధికంగా చెల్లిస్తున్నారు" అని బ్యాంక్ బజార్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నవీన్ చందానీ తెలిపారు. కనుక ఇంటి రుణాలు తీసుకున్న వారు ఒక్కసారి వాటిని సమీక్షించుకోవడం ఎంతో అవసరం. రుణాన్ని నూతన బెంచ్ మార్క్ విధానంలోకి మార్చుకోవడం.. అప్పటికీ తాము చెల్లిస్తున్న వడ్డీ రేటు, మార్కెట్లో ఉన్న రేటు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉంటే వెంటనే ఆ రుణాన్ని మరో సంస్థకు బదలాయించుకోవడం వల్ల లాభం ఉంటుంది. కానీ, దీనికంటే ముందు చూడాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయి. ఇందుకు సంబంధించి సమగ్ర వివరాలను అందించే ప్రాఫిట్ కథనం ఇది.

**అరుణ్ మిశ్రా (40) ఓ ప్రైవేటు కంపెనీలో సీనియర్ ఎగ్జిక్యూటివ్. 2010లో యాక్సిస్ బ్యాంకు నుంచి రూ.20 లక్షల రుణాన్ని తీసుకుని నోయిడాలో రూ.37 లక్షల విలువ చేసే ఇంటిని కొనుగోలు చేశారు. ఫ్లోటింగ్ రేటుపై రుణాన్ని తీసుకున్నాడు. ప్రస్తుతం ఆయన 9 శాతం వడ్డీ రేటు చెల్లిస్తున్నాడు. 2010లో రుణాన్ని తీసుకున్నందున బీపీఎల్ఆర్ ఆధారిత రుణ రేటే ఇప్పటికీ అమలవుతోంది. ప్రస్తుత రేటుకు అతను మార్చుకోలేదు. దీనివల్ల అతను పలు ప్రయోజనాలు కోల్పోతున్నాడు. అరుణ్ ఒక ఉదాహరణ మాత్రమే.**

### అవగాహన లేకే..

''ఇంటి రుణాన్ని మరొక బ్యాంకు లేదా సంస్థకు బదలాయించుకోకపోవడం వెనుక ఎన్నో కారణాలు ఉంటుంటాయి. మరింత పారదర్శకమైన బెంచ్‌మార్క్ రేట్ల విధానం అమల్లోకి వచ్చిన విషయం తెలియకపోవచ్చు. లేదా ప్రస్తుతం తాము చెల్లిస్తున్న రేటు మెరుగ్గానూ ఉండొచ్చు. కొందరికి తెలిసినప్పటికీ నిర్ణయాన్ని వాయిదా వేస్తుంటారు'' అని స్విచ్‌మే వ్యవస్థాపకుడు ఆదిత్య మిశ్రా తెలిపారు. హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలతో పోలిస్తే బ్యాంకులు కొంచెం తక్కువ రేటుకు రుణాన్ని ఆఫర్ చేసే అవకాశం ఉంటుంది. ఎందుకంటే బ్యాంకుల దగ్గర సేవింగ్స్, కరెంటు ఖాతాల్లో డిపాజిట్లు దండిగా ఉంటాయి. వీటిపై కస్టమర్లకు బ్యాంకులు చెల్లించే రేటు సగటున చాలా తక్కువ. సేవింగ్స్ ఖాతాలపై 3–3.5 శాతం రేటు చెల్లిస్తుంటే, కరెంటు ఖాతాల్లోని బ్యాలెన్స్‌లపై చెల్లింపులు సున్నాయే. చాలా చౌకగా బ్యాంకులకు నిధుల అందుబాటు ఉంటుంది. అందుకే బ్యాంకుల గృహ రుణాలపై రేట్లు కొంత ఆకర్షణీయంగా ఉంటాయి.



### ఎప్పుడు మారడం..

గృహ రుణాన్ని తక్కువ రేటుకు ఆఫర్ చేసే మరో సంస్థకు బదిలీ చేసుకోవాలని భావించే వారు.. దీనివల్ల లాభమా? నష్టమా? అన్న సందిగ్ధంలో ఉంటే... పాటించాల్సిన కొన్ని సూత్రాలు ఉన్నాయి. ''రుణ కాల వ్యవధి కనీసం మరో 15 ఏళ్లు ఉండి, ప్రస్తుత రుణంపై రేటుతో పోలిస్తే కనీసం 25 బేసిస్ పాయింట్లు (0.25 శాతం) తక్కువకు ఆఫర్ చేస్తుంటే అప్పుడు రుణాన్ని బదిలీ చేసుకోవడం లాభదాయకం అవుతుంది. ఒకవేళ 15 సంవత్సరాల కంటే తక్కువ కాలమే ఇంకా చెల్లింపులకు మిగిలి ఉంటే అప్పుడు బదిలీ చేసుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఎంతన్నది లెక్క వేసుకుని చూడాలి'' అని ఆదిత్య మిశ్రా సూచించారు. హోమ్‌లోన్ ట్రాన్స్‌ఫర్ కాలిక్యులేటర్లు ఆన్‌లైన్‌లో ఎన్నో అందుబాటులో ఉన్నాయి. వాటి సాయంతో బదిలీ వల్ల మిగిలేది ఎంతన్నది తెలుసుకోవచ్చు. రుణాన్ని బదిలీ చేసుకునే సమయంలో చెల్లించాల్సిన పలు చార్జీలను మిగిలే ప్రయోజనం నుంచి మినహాయించడం మరిచిపోవద్దు. అంతిమంగా పెద్ద మొత్తమే మిగులుతుందన్న లెక్క తేలితే అప్పుడు నిరభ్యంతరంగా రుణాన్ని బదలాయించుకోవచ్చు. కాకపోతే, రుణాన్ని ఒక సంస్థ నుంచి మరో సంస్థకు మార్చుకోవడానికి కొంత సమయం తీసుకుంటుంది. ''చాలా సంస్థలు మిగిలి ఉన్న గృహ రుణ బదిలీకి అనుమతిస్తూ కొత్తగా టాపప్ లోన్‌ను కూడా ఆఫర్ చేస్తున్నాయి. అదనపు నిధుల సాయం అవసరమున్న వారు దీన్ని పరిశీలించొచ్చు. ఇది తక్కువ వడ్డీ రేటుకే లభిస్తుంది'' అని రతన్ చౌదరి తెలిపారు.

### రేటు తగ్గింపునకు సంప్రదింపులు

మీరు ఇప్పటికే గృహ రుణం తీసుకుని వాయిదాలు చెల్లిస్తున్నట్టయితే.. అదే సంస్థ మీతో పోలిస్తే కొత్త కస్టమర్లకు తక్కువ రేటుకు రుణాన్ని ఆఫర్ చేస్తుంటే.. అప్పుడు మీకు కూడా రేటు తగ్గించే విషయమై సంప్రదింపులు చేపట్టాలి. రుణ రేటును తగ్గించేందుకు బ్యాంకు అంగీకరించనప్పుడు లేదా మంచి రేటును ఆఫర్ చేయనప్పుడే రుణ బదలాయింపు గురించి యోచించాలి. గతంలో రుణాలు తీసుకుని ఉంటే.. అవి ఎంసీఎల్ఆర్, బేస్ రేటు, బీపీఎల్ఆర్ వడ్డీ రేట్ల విధానంలో ఉండొచ్చు. ఈ రుణాలను ఎక్స్‌టర్నల్ బెంచ్ మార్క్ ఆధారిత విధానానికి (రెపో తదితర) మార్చుకోవచ్చు. ఎటువంటి ఫీజులు తీసుకోకుండానే బ్యాంకులు ఇందుకు అనుమతిస్తున్నాయి. ''నిర్వహణ చార్జీ, న్యాయపరమైన డాక్యుమెంట్ల చార్జీలను మాత్రం చెల్లించాల్సి వస్తుంది. ఒక్కసారి ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానానికి మారిపోతే.. అప్పుడు కొత్త కస్టమర్లకు అమలు చేసే చార్జీయే వర్తిస్తుంది'' అని పైసాబజార్ గృహ రుణాల విభాగం అధిపతి రతన్ చౌదరి తెలిపారు.

### బదిలీ ప్రక్రియ..

రుణాన్ని బదిలీ చేసుకోవాలని నిర్ణయించుకుంటే మీ నిర్ణయాన్ని లిఖిత పూర్వకంగా ప్రస్తుత రుణదాతకు తెలియజేయాలి. అప్పుడు సంబంధిత బ్యాంకు లేదా హౌసింగ్ ఫైనాన్స్ సంస్థ నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) లేదా సమ్మతి పత్రాన్ని విడుదల చేస్తుంది. అందులో ఇంకా చెల్లించాల్సిన రుణం ఎంతన్న వివరాలు ఉంటాయి. ఈ పత్రాన్ని కొత్తగా రుణాన్ని ఆఫర్ చేస్తున్న సంస్థకు అందించాలి. దీనితోపాటు ఆదాయ ధ్రువీకరణ, ప్రాపర్టీ టైటిల్ డాక్యుమెంట్ కాపీ కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఆక్యుపేషన్ (ప్రాపర్టీ వినియోగం) లేదా కంప్లీషన్ (నిర్మాణం పూర్తయినట్టు) సర్టిఫికెట్, ఆర్కిటెక్ట్ ప్లాన్ కూడా కొత్త సంస్థ కోరే అవకాశం ఉంది. వీటన్నింటినీ పరిశీలించిన తర్వాత కొత్త సంస్థ రుణాన్ని మంజూరు చేస్తుంది. అంగీకరించిన మేరకు రుణాన్ని చెక్ లేదా డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో పాత రుణదాత పేరు మీద విడుదల చేస్తుంది. దీన్ని పాత రుణదాతకు సమర్పించాలి. కొత్త రుణ గ్రహీత వద్ద మార్ట్‌గేజ్ అగ్రిమెంట్‌పై (తనఖా ఒప్పందం) సంతకం చేయాల్సి ఉంటుంది. పాత సంస్థ నుంచి కొత్త రుణ గ్రహీత పేరు మీదకు ప్రాపర్టీ డీడ్ మార్చే సమయంలో రుణ గ్రహీత హాజరుకావాల్సి వస్తుంది.

### వ్యయాలు

నూతనంగా రుణాన్ని ఇచ్చే సంస్థ ప్రాసెసింగ్ ఫీజును వసూలు చేస్తుంది. రుణ మొత్తంలో ఇది ఒక శాతంగా ఉండొచ్చు. అయితే, కొన్ని సందర్భాల్లో రుణదాతలు ప్రత్యేక ఆఫర్లు ఇస్తుంటారు. ఆ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు గరిష్టంగా రూ.10వేల లోపే ఉంటుంది. కొన్ని అయితే, పూర్తిగా మాఫీ కూడా చేస్తున్నాయి. అయితే ప్రాపర్టీ మార్ట్‌గేజ్ డీడ్‌పై స్టాంప్ డ్యూటీ రూపంలో ఎక్కువ చార్జీ భరించాల్సి ఉంటుంది. ఒక్కో రాష్ట్రంలో ఇది ఒక్కో విధంగా ఉండొచ్చు. గృహ రుణ బదిలీకి ఎంతలేదన్నా రెండు నుంచి ఐదు వారాల సమయం తీసుకుంటుంది.

## మణిపాల్ సిగ్నా 'సూపర్ టాప్ అప్ ప్లాన్'

తక్కువ ప్రీమియంతో అత్యధిక వైద్య బీమా కవరేజీని అందించే విధంగా మణిపాల్ సిగ్నా హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థ తాజాగా 'వేల్యూ ఫర్ మనీ సూపర్ టాప్ అప్' ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. రూ. 1 లక్ష నుంచి రూ. 30 లక్షల దాకా కవరేజీ కోసం దీన్ని ఎంచుకోవచ్చని సంస్థ వివరించింది. అలోపతీతో పాటు 'ఆయుష్' వైద్యానికి కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. చికిత్స ఖర్చులు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ఈ టాప్ అప్ ప్లాన్ ఉపయోగకరంగా ఉంటుందని మణిపాల్ సిగ్నా ఎండీ ప్రసూన్ సిక్దర్ తెలిపారు. ఇద్దరు.. అంతకు మించి కుటుంబసభ్యులకు కవరేజీ గల పాలసీలకు 10 శాతం, రెండు.. మూడేళ్ల పాలసీ తీసుకుంటే 7.5 శాతం నుంచి 10 శాతం దాకా డిస్కౌంటు పొందవచ్చని వివరించారు. ఆన్‌లైన్ మాధ్యమంలో రెన్యువల్ చేయించుకుంటే వార్షికంగా 3 శాతం మేర డిస్కౌంటు లభిస్తుందని పేర్కొన్నారు.




# విహారయాత్రకు బయలుదేరుతున్నారా?



స్వీటీసాల్వే
సీనియర్ మేనేజర్, హెల్త్ అడ్మినిస్ట్రేషన్, బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్

**విహార యాత్రకు వెళ్లే వారు హోటల్ గదులు, ట్రావెల్ టికెట్లను బుక్ చేసుకోవడం, కెమెరా ఎక్విప్‌మెంట్ తదితర కావాల్సినవి సిద్ధం చేసుకోవడం.. ఇలా ఎన్నో పనులు ఉంటాయి. పర్యటన సమయంలో ఊహించని అత్యవసర పరిస్థితులు ఏర్పడితే, ఆర్థికంగా పడే భారం ఎంతో చెప్పలేం. వైద్య పరంగా అత్యవసర చికిత్స, లగేజీ కోల్పోవడం వంటి పరిస్థితులు ఎదురుకావచ్చు. చివరి నిమిషంలో సమీప వ్యక్తులు మరణించడం వల్ల పర్యటనను రద్దు చేసుకోవాల్సి వస్తే ఆర్థికంగానూ నష్టపోతారు. అందుకే పర్యాటకులకు సరైన ట్రావెల్ ఇన్సూరెన్స్ పాలసీ అవసరం. ఇది ఎన్నో విధాలుగా రక్షణ కల్పిస్తుంది.**

## ట్రావెల్ ఇన్సూరెన్స్ మరవద్దు

మా సంస్థ అంతర్గత డేటాను పరిశీలిస్తే అధిక శాతం క్లెయిమ్‌లు 60 ఏళ్ల వయసు పైబడిన వారి నుంచే వస్తున్నా కానీ.. అదే సమయంలో 40 శాతం పర్యాటక బీమా పరిహారం కోరుతూ వచ్చే క్లెయిమ్‌లు 20–40 ఏళ్ల వయసు గ్రూపువే ఉంటున్నాయి. సగటున ఓ క్లెయిమ్ మొత్తం రూ.2,00,000గా ఉంటోంది. ముఖ్యంగా గత మూడేళ్ల కాలంలో వైద్య ఖర్చులకు సంబంధించిన క్లెయిమ్‌లలో పెరుగుదల 25 శాతంగా ఉంది.



### కవరేజీ..

పర్యాటక బీమా పాలసీ ప్రధానంగా.. పర్యటన సమయంలో ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ చికిత్సలకు అయ్యే వ్యయాలను చెల్లిస్తుంది. వ్యక్తిగత ప్రమాద బీమా రక్షణ కూడా ఇందులో ఉంటుంది. మరణించినా లేక శాశ్వత అంగవైకల్యం పాలైనా పరిహారం పొందొచ్చు. ప్రమాదం కారణంగా గాయపడి ఆస్పత్రిపాలవడం వల్ల పడే ఖర్చులను కూడా చెల్లిస్తుంది. దేశీయ పర్యాటకులకు సంబంధించి బీమా కంపెనీలకు దేశవ్యాప్తంగా ఆస్పత్రులతో టైఅప్ ఉంటుంది. దీంతో పర్యటన సమయంలో ప్రమాదం కారణంగా ఆస్పత్రుల్లో చేరాల్సి వస్తే నగదు రహిత చికిత్సలను పొందొచ్చు. హాస్పిటల్ డైలీ అలవెన్స్, వైద్యం కోసం అత్యవసర తరలింపు, స్వదేశానికి పంపే కవరేజీలను కూడా ప్రధాన పాలసీకి రైడర్లుగా జోడించునే ఆప్షన్ ఉంటుంది. పర్యటనను కుదించుకోవాల్సి రావడం, కుటుంబ సభ్యుల్లో ఎవరినైనా కోల్పోవడం, విమానం, రైళ్ల ఆలస్యం కావడం, వైద్య పరంగా అత్యవసర చికిత్సలు వంటి సందర్భాల్లో ట్రావెల్ ఇన్సూరెన్స్ రక్షణగా నిలుస్తుంది. బ్యాగేజీని నష్టపోయినా పరిహారం చెల్లిస్తుంది. యువత నేడు ట్రెక్కింగ్, స్కీయింగ్, వాటర్ రాఫ్టింగ్, రాపెల్లింగ్, స్కైడైవింగ్, పారాచ్యూట్, స్కూబా డైవింగ్ వంటి సాహస కార్యక్రమాల పట్ల ఆసక్తి చూపిస్తోంది. వీటివల్ల ప్రమాదవశాత్తూ గాయాల పాలైతే ట్రావెల్ బీమా పాలసీల్లో కవరేజీ ఉండేలా చూసుకోవాలి.

## పసిడిలో పెట్టుబడులు పటిష్టమే!

ప్రస్తుతం పెట్టుబడులకు పసిడి సురక్షిత సాధనమేనని నిపుణుల అంచనా. న్యూయార్క్ మర్కంటైల్ ఎక్స్ఛేంజ్‌లో పసిడి ధర 20వ తేదీతో ముగిసిన వారంలో ఔన్స్‌కు (31.1గ్రా) 1,482 డాలర్ల వద్ద ముగిసింది. అమెరికా–చైనా వాణిజ్య యుద్ధం సమసిపోతుందన్న అంచనాలు, అమెరికా స్థూల దేశీయోత్పత్తి, ప్రత్యేకించి వినియోగ గణాంకాలు సానుకూలత, డాలర్ పటిష్టత వంటి అంశాలు స్వల్పకాలంలో పసిడి ధర దిగువకు రావడానికి కొంత దారితీసినా.. 1,450 డాలర్ల వద్ద పసిడికి పటిష్ట మద్దతు ఉందన్నది వాదన. అంతర్జాతీయంగా ఆర్థిక మందగమన ధోరణుల వల్ల పసిడి దీర్ఘకాలంలో పెట్టుబడిదారులను ఆకర్షిస్తుందనే అంచనాలు ఉన్నాయి. అనిశ్చితిని ధీటుగా ఎదుర్కొనడానికి పసిడి కొనుగోళ్లవైపు మొగ్గుచూపాలని ఇరాన్, మలేషియా, టర్కీ, కతార్‌లు భావిస్తున్నట్లు స్వయంగా మలేషియా ప్రధానమంత్రి మహతీర్ మహ్మద్ ప్రకటించడం ఇక్కడ గమనార్హం.



## ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (డిసెంబర్-17-2019 అంకెలు శాతాల్లో)

| బ్యాంకులు | 6 నెలలు– ఏడాది | 1–2 ఏళ్లు | 3–5 ఏళ్లు |
|---|---|---|---|
| ఆంధ్రా బ్యాంక్ | 5.75 | 6 | 6.1 |
| యాక్సిస్ బ్యాంక్ | 6.5 | 6.7 | 6.7 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 5.9 | 6.3 | 6.25 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.4 | 6.25 |
| కెనరా బ్యాంక్ | 5.95 | 6.4 | 6.25 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 6.3 | 6.25 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 6.3 | 6.65 | 6.5 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ | 6.05 | 6.3 | 6.3 |
| ఐసీఐసీఐ బ్యాంక్ | 6 | 6.3 | 6.4 |
| ఐడీబీఐ బ్యాంక్ | 6 | 6.45 | 6.25 |
| ఇండస్‌ఇండ్ బ్యాంక్ | 6.5 | 7.25 | 7.15 |
| కోటక్ మహీంద్రా బ్యాంక్ | 6.05 | 6.3 | 6.2 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 5.8 | 6.25 | 6.25 |
| పీఎన్‌బీ | 6.1 | 6.3 | 6.25 |
| ఎస్‌బీఐ | 5.8 | 6.25 | 6.25 |
| సిండికేట్ బ్యాంక్ | 5.75 | 6.5 | 6.25 |
| యస్ బ్యాంక్ | 7.15 | 7.5 | 7.25 |

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

# అవకాశం ఎక్కడ ఉన్నా అందిపుచ్చుకోవడమే..!

### ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్




లార్జ్‌క్యాప్, మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగంలో వృద్ధి, లాభాలకు అవకాశం ఉన్న స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసేవే మల్టీక్యాప్ ఫండ్స్. విడిగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే మల్టీక్యాప్ ఫండ్స్‌లో రిస్క్ తక్కువ. అదే సమయంలో అచ్చమైన లార్జ్‌క్యాప్ ఫండ్స్‌తో పోలిస్తే మల్టీక్యాప్ ఫండ్స్‌లో అస్థిరతలు ఎక్కువ. గత ఏడాదిన్నర, రెండేళ్ల కాలంలో లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనే రాబడులు ఉన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విభాగాల్లో అధిక శాతం స్టాక్స్ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. త్వరలో ఈ విభాగంలోని స్టాక్స్ కూడా ర్యాలీ చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కనుక లార్జ్‌క్యాప్‌కే పరిమితం కాకుండా, మార్కెట్ వ్యాప్తంగా పెట్టుబడుల అవకాశాలను గుర్తించి ఇన్వెస్ట్ చేసే మల్టీక్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోవడం మంచి ఆలోచన అవుతుంది. అందులోనూ సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా పెట్టుబడులను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ ఫండ్ కూడా ఒకటి.

**రాబడులు..:** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ పథకానికి మార్కెట్లో సుదీర్ఘమైన చరిత్ర ఉంది. 1994 అక్టోబర్‌లో ఈ పథకం ఆరంభమైంది. నాటి నుంచి నేటి వరకు వార్షికంగా 14.43 కాంపౌండెడ్ రాబడులను (సీఏజీఆర్) ఈ పథకం అందించింది. ఇదే కాలంలో నిఫ్టీ–50 వృద్ధి 10.36 శాతమే. గత 15 ఏళ్లుగా ఈ ఫండ్‌లో ప్రతీ నెలా రూ.10,000 చొప్పున ఇన్వెస్ట్ చేసి ఉంటే ఇన్వెస్టర్లకు రూ.51.6 లక్షలు సమకూరేది. ప్రతీ నెలా రూ.10వేల చొప్పున గత మూడేళ్లలో మొత్తం రూ.3.6 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఉంటే, అదిప్పుడు రూ.3.9 లక్షలుగా ఉండేది. అంటే సీఏజీఆర్ రాబడులు 6.1 శాతమే. అదే గత ఐదేళ్లలో ప్రతీనెలా రూ.10వేల చొప్పున పెట్టుబడి పెడితే రూ.7.4 లక్షలు అయ్యేది. ఇక్కడ సీఏజీఆర్ రాబడులు 8.5 శాతం. ఇక గత పదేళ్ల కాలంలో ప్రతీ నెలా రూ.10వేల పెట్టుబడి పెట్టి ఉంటే రూ.23 లక్షలు సమకూరేవి. ఇక్కడ సీఏజీఆర్ రాబడులు 12.5 శాతం. అంటే దీర్ఘకాలంలో ఈ పథకం స్థిరమైన, మెరుగైన రాబడులను ఇచ్చినట్టు చెప్పుకోవాలి. కనుక మార్కెట్లలో అస్థిరతలను దృష్టిలో ఉంచుకుని, ఇన్వెస్టర్లు దీర్ఘకాలం కోసం అయితే దీన్ని పరిశీలించొచ్చు.




### పెట్టుబడుల విధానం

టాప్ డౌన్, బోటమ్ అప్ ఈ రెండు విధానాలను రంగాల వారీ, స్టాక్ వారీ ఎంపికకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మల్టీక్యాప్ ఫండ్ మేనేజర్ అనుసరిస్తున్నారు. ఇందులో టాప్ డౌన్ అంటే, స్థూల ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక రంగంలో పరిణామాలు, అంతర్జాతీయ, దేశీయ మార్కెట్ ధోరణులను పరిగణనలోకి తీసుకుని అనువైన రంగాలను పెట్టుబడులకు ఎంచుకోవడం. అదే బోటమ్ అప్ అంటే.. విడిగా కంపెనీలను, వాటి వృద్ధి అవకాశాలు, స్టాక్ వ్యాల్యుయేషన్ల ఆధారంగా పెట్టుబడులకు ఎంపిక చేసుకోవడం. ప్రస్తుతం ఈ పథకం పోర్ట్‌ఫోలియోలో 78 స్టాక్స్ ఉన్నాయి. లార్జ్‌క్యాప్‌లో 71 శాతం, మిగిలిన మేర మిడ్, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేసి ఉంది. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ 26 శాతం పెట్టుబడులను ఈ రంగం స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేసింది.

### ఈక్విటీ టాప్ హోల్డింగ్స్

| కంపెనీ | పెట్టుబడుల శాతం |
|---|---|
| భారతీ ఎయిర్‌టెల్ | 5.97 |
| ఐసీఐసీఐ బ్యాంకు | 5.96 |
| ఎన్‌టీపీసీ | 5.60 |
| ఎస్‌బీఐ | 5.24 |
| ఇన్ఫోసిస్ | 4.64 |
| యాక్సిస్ బ్యాంకు | 3.80 |
| ఐటీసీ | 3.76 |
| ఓఎన్‌జీసీ | 3.56 |
| టాటా కెమికల్స్ | 2.88 |
| హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు | 2.65 |



వ్యాపార నిర్వహణ సరిగా లేకపోతే... అది నిన్ను ముంచేస్తుంది!

- బీసీ ఫోర్బ్స్, ఫోర్బ్స్ మ్యాగజైన్ వ్యవస్థాపకుడు

## బొమ్మ-బొరుసు




## మార్కెట్ పంచాంగం

# 41,850పైన సెన్సెక్స్ ర్యాలీ కొనసాగింపు

దేశీయ ఆర్థిక ప్రతికూలాంశాల్ని సైతం లెక్కచేయకుండా... ప్రపంచ సానుకూల పరిణామాల ప్రభావం, విదేశీ నిధుల వెల్లువ కారణంగా స్టాక్ సూచీలు కొత్త రికార్డుల్ని నెలకొల్పుతున్నాయి. అయినప్పటికీ, ప్రపంచంలో ఇతర దేశాల మార్కెట్లతో పోలిస్తే ఈ ఏడాది ఇప్పటివరకూ ఇండియా సూచీలు పెరిగింది తక్కువే. అమెరికా ఎస్ అండ్ పీ500 సూచీ 30 శాతం, 50 దేశాలతో కూడి ఎంఎస్‌సీఐ సూచీ 24 శాతం చొప్పున ర్యాలీ సాగించగా, నిఫ్టీ-50 సూచి ఈ ఏడాది పెరిగింది 13 శాతమే. దేశీయ ఆర్థికాంశాల ప్రతికూలతే ఇందుకు కారణం కావొచ్చు. భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి సమీప భవిష్యత్తులో పుంజుకుంటుందన్న అంచనాలు లేకపోయినా, అమెరికా ఫెడ్, ఇతర దేశాల కేంద్ర బ్యాంకుల సరళ విధానాల ఫలితంగా ఈ ఏడాది విదేశీ ఇన్వెస్టర్లు ఇండియాలో దాదాపు లక్ష కోట్ల రూపాయలు కుమ్మరించారు. ఇది రికార్డు. ఇందుకు తోడు దేశీయ మ్యూచువల్ ఫండ్స్ 55,000 కోట్ల వరకూ ఈక్విటీల్లో పెట్టుబడి చేశాయి. ఇప్పటివరకూ జరిగిన పెట్టుబడుల ప్రభావం, కొత్త ఏడాదిలో జరిగే పెట్టుబడుల అంచనాల కారణంగా స్టాక్ మార్కెట్ రానున్న రోజుల్లో మరిన్ని రికార్డుల్ని సృష్టించే అవకాశం లేకపోలేదు. ఇక సూచీల స్వల్పకాలిక సాంకేతికాలు ఇలా వున్నాయి.....

### సెన్సెక్స్ సాంకేతికాంశాలు...




డిసెంబర్ 20తో ముగిసిన వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ క్రమేపీ పెరుగుతూ 41,810 పాయింట్ల రికార్డుస్థాయిని చేరింది. చివరకు అంతక్రితం వారం ముగింపుతో పోలిస్తే 672 పాయింట్ల లాభంతో 41,682 పాయింట్ల వద్ద ముగిసింది. వరుసగా రెండు వారాల్లో సెన్సెక్స్ 1,200 పాయింట్లకుపైగా లాభపడింది. శుక్రవారం రాత్రి అమెరికా మార్కెట్లు రికార్డు ర్యాలీ జరిపిన నేపథ్యంలో ఈ సోమవారం గ్యాప్‌అప్‌తో ప్రారంభమైతే 41,850-41,980 పాయింట్ల శ్రేణిలో తొలి అవరోధం కలగవచ్చు. ఈ సందర్భంగా 41,850పైన స్థిరపడితే క్రమేపీ 42,200 పాయింట్ల స్థాయిని అందుకోవొచ్చు. అటుపైన 42,380 పాయింట్ల వరకూ ర్యాలీ కొనసాగే చాన్సుంది. ఈ వారం తొలి అవరోధశ్రేణిని అధిగమించలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 41,400 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయిని కోల్పోతే 41,165 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున 41,000 పాయింట్ల వద్దకు క్షీణించవచ్చు.

### నిఫ్టీ 12,300పైన స్థిరపడితే...




గత కాలమ్‌లో ప్రస్తావించిన రీతిలో ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 12,293 పాయింట్ల వద్ద కొత్త రికార్డును నెలకొల్పి, చివరకు అంతక్రితం వారంతో పోలిస్తే 185 పాయింట్ల లాభంతో 12,272 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ సూచీ రెండు వారాల్లో 340 పాయింట్ల వరకూ లాభపడింది. ఈ సోమవారం నిఫ్టీ గ్యాప్‌అప్‌తో మొదలైతే 12,300-12,350 పాయింట్ల శ్రేణి తొలుత నిరోధించవచ్చు. ఈ క్రమంలో 12,300 పాయింట్లపైన నిఫ్టీ స్థిరపడగలిగితే క్రమేపీ 12,425 పాయింట్ల వరకూ పెరిగే అవకాశం వుంది. అటుపైన 12,485 పాయింట్ల స్థాయిని సైతం అందుకునే చాన్స్ వుంటుంది. ఈ వారం నిఫ్టీ పైన ప్రస్తావించిన తొలి అవరోధశ్రేణిని దాటలేకపోయినా, బలహీనంగా ప్రారంభమైనా 12.180 పాయింట్ల వద్ద తక్షణ మద్దతు లభించవచ్చు. ఈ లోపున ముగిస్తే 12,135 పాయింట్ల వరకూ తగ్గవచ్చు. ఈ స్థాయిని సైతం వదులుకుంటే 12,070 పాయింట్ల వరకూ క్షీణించవచ్చు.

– పి. సత్యప్రసాద్

### కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 23-12-2019

| | |
|---|---|
| విశాఖ | 470-00 |
| చిత్తూరు | 438-00 |
| వరంగల్ | 418-00 |
| విజయవాడ | 452-00 |
| గోదావరి | 452-00 |
| 22-12-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 415-00 |

● టెక్నాలజీ సంస్థ సీఎస్ఎస్ కార్ప్.. భారత్‌లో కార్యకలాపాలు విస్తరించనుంది. వచ్చే ఏడాది వ్యవధిలో హైదరాబాద్‌తో పాటు మిగతా కేంద్రాల్లో కొత్తగా మరో 1,000 మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్లు సంస్థ సీఈవో మనీష్ టాండన్ తెలిపారు. ప్రస్తుతం కంపెనీలో దేశీయంగా 4,500 మంది, ప్రపంచవ్యాప్తంగా 7,000 మంది ఉద్యోగులు ఉన్నారు. సీఎస్ఎస్ కార్ప్ సంస్థ .. అనలిటిక్స్, ఆటోమేషన్, క్లౌడ్ కంప్యూటింగ్ సర్వీసులు అందిస్తోంది.

# రికార్డుల ర్యాలీ కొనసాగేనా..?

**ఈ వారంలోనే డిసెంబర్ సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు**

- సోమవారం సెన్సెక్స్ సూచీ నుంచి టాటా మోటార్స్, టాటా మోటార్స్ డీవీఆర్, యస్ బ్యాంక్, వేదాంత బయటకు
- ఇండెక్స్‌లోకి చేరనున్న అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, నెస్లే ఇండియా
- సూచీలో మార్పులు, ఏడాది చివరి రోజుల కారణంగా కన్సాలిడేషన్‌కు అవకాశం..!
- ట్రేడింగ్ 4 రోజులకే పరిమితం
- క్రిస్మస్ సందర్భంగా బుధవారం మార్కెట్‌కు సెలవు




**న్యూఢిల్లీ:** దేశీయ స్టాక్ మార్కెట్ గతవారం వరుస రికార్డులతో దూసుకెళ్లింది. మొత్తం ఐదు ట్రేడింగ్ రోజుల్లో.. ఏకంగా నాలుగు రోజులు సూచీలు కొత్త శిఖరాలకు ఎగబాకాయి. జీఎస్‌టీలో వడ్డనలు లేకపోవడం, అమెరికా-చైనాల మధ్య కుదిరిన తొలి దశ వాణిజ్య ఒప్పందం, యూరోపియన్ యూనియన్‌తో బ్రిటన్ ఒప్పందానికి ప్రధాని బోరిస్ జాన్సన్ అంగీకారం తెలపడం వంటి సానుకూల అంశాల నేపథ్యంలో గడిచిన వారంలో సెన్సెక్స్ 672 పాయింట్లు, నిఫ్టీ 185 పాయింట్ల మేర పెరిగాయి. శుక్రవారం 12,294 పాయింట్లకు చేరుకుని ఇంట్రాడే గరిష్టస్థాయిని నమోదుచేసిన నిఫ్టీ చివరకు 12,272 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 41,810 పాయింట్లకు చేరుకుని.. చివరకు 41,682 వద్ద నిలిచింది. ఈ స్థాయి రికార్డులతో జోరుమీదున్న మన మార్కెట్.. ఈవారంలో ఏ విధంగా ఉండనుందనే అంశానికి, ప్రధానంగా అంతర్జాతీయ అంశాలే కీలకంగా ఉండనున్నాయని దలాల్ స్ట్రీట్ పండితులు అంచనా వేస్తున్నారు.

**కన్సాలిడేషన్‌కు చాన్స్..!**

వరుసగా రెండు వారాల పాటు ర్యాలీ కొనసాగించిన దేశీ మార్కెట్ ఈ వారంలో దిద్దుబాటుకు గురయ్యే అవకాశం ఉందని అంచనా. వాల్యుయేషన్స్ ప్రియంగా మారడమే ఇందుకు కారణంగా మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఫండమెంటల్‌గా బలంగా ఉన్న కంపెనీల షేర్లను మాత్రమే ఈ వారంలో కొనుగోలు చేయడం వివేకవంతమైన విధానమని, మార్కెట్ బాగా పెరిగినందున కన్సాలిడేషన్‌కు అవకాశం ఉందని రెలిగేర్ బ్రోకింగ్ పరిశోధన విభాగం వీపీ అజిత్ మిశ్రా అన్నారు. బాగా పెరిగిన షేర్ల నుంచి ప్రాఫిట్ బుకింగ్ జరిగి వ్యాల్యూ పిక్స్ వైపునకు పెట్టుబడులు మారే అవకాశం ఉన్నందున తాను కూడా కన్సాలిడేషన్ జరగవచ్చని భావిస్తున్నట్లు జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధనా విభాగం చీఫ్ నాయర్ చెప్పారు. ఏడాది చివరి రోజులు కావడంతో స్టాక్ స్పెసిఫిక్ ర్యాలీకి మాత్రమే అవకాశం ఉందని సామ్కో సెక్యూరిటీస్ సీఈఓ జిమీత్ మోడీ విశ్లేషించారు.

### సెన్సెక్స్ 30 సూచీ నుంచి యస్ బ్యాంక్ అవుట్




బొంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) బెంచ్‌మార్క్ సూచీ (సెన్సెక్స్)లోని 30 షేర్ల జాబితాలో ఈ వారంలోనే భారీ మార్పులు జరగనున్నాయి. ప్రస్తుతం ఉన్నటువంటి టాటా మోటార్స్, టాటా మోటార్స్ డీవీఆర్, యస్ బ్యాంక్, వేదాంత షేర్లను ఇండెక్స్ నుంచి తొలగించి.. వీటి స్థానంలో అల్ట్రాటెక్ సిమెంట్, టైటాన్, నెస్లే ఇండియా షేర్లను బీఎస్‌ఈ చేర్చనుంది. ఇదే విధంగా బీఎస్‌ఈ మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ వంటి పలు సూచీల్లో కూడా మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఈ మార్పుల కారణంగా ఫండ్ మేనేజర్లు వారి పోర్ట్‌ఫోలియోలో భారీ మార్పులను చేయనున్నారని దలాల్ స్ట్రీట్ వర్గాలు చెబుతున్నాయి. ఇక డిసెంబర్ సిరీస్ ఎఫ్ అండ్ ఓ ముగింపు ఉండడం వల్ల రికార్డుల ర్యాలీ కొనసాగేందుకు అవకాశాలు తక్కువని అంచనా వేస్తున్నారు.

**ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులే..**

క్రిస్మస్ సందర్భంగా బుధవారం (25న) దేశీ స్టాక్ ఎక్స్ఛేంజీలు సెలవు ప్రకటించాయి. దీంతో ఈ వారంలో ట్రేడింగ్ నాలుగు రోజులకే పరిమితమైంది. గురువారం (26న) ఉదయం మార్కెట్ యథావిధిగా ప్రారంభమవుతుంది.



మెర్సిడెస్ బెంజ్ సరికొత్త జీఎల్‌సీ మోడల్‌ను హైదరాబాద్ మార్కెట్లో ప్రవేశపెడుతున్న సిల్వర్ స్టార్ మెర్సిడెస్ బెంజ్ లీడ్ సేల్స్ సాయి హర్ష

# ఉక్కు ఉత్పత్తిలో తగ్గుదల

- నవంబర్‌లో 2.8 శాతం క్షీణత
- అంతర్జాతీయంగానూ దిగువకే...

**న్యూఢిల్లీ:** దేశీయంగా ముడి ఉక్కు ఉత్పత్తిలో తగ్గుదల నమోదైంది. తాజాగా వరల్డ్ స్టీల్ అసోసియేషన్ ప్రకటించిన గణాంకాల ప్రకారం.. గతనెల్లో మొత్తం ఉత్పత్తి 8.934 మిలియన్ టన్నులు (ఎంటీ)గా ఉంది. అంతక్రితం ఏడాది ఇదే కాలంలోని 9.192 ఎంటీలతో పోల్చితే 2.8 శాతం తగ్గుదల చోటుచేసుకుంది. ఈ ఏడాది అక్టోబర్‌లో 3.4 శాతం తగ్గిన సంగతి తెలిసిందే కాగా, వరుసగా రెండు నెలల పాటు ఉత్పత్తిలో క్షీణత నమోదైంది. ఇక అంతర్జాతీయంగా కూడా గత నెల్లో ఉక్కు ఉత్పత్తి ఒక శాతం తగ్గింది. అయితే, ఈ పరిస్థితుల్లోనూ ప్రపంచంలోనే అతి పెద్ద ఉక్కు ఉత్పత్తిదారుగా ఉన్న చైనా మాత్రం నవంబర్‌లో 4 శాతం వృద్ధి రేటును నమోదు చేయడం విశేషం. ఆ దేశం గత నెల్లో 80.287 ఎంటీ ఉత్పత్తిని నమోదుచేసింది. అమెరికా ఉత్పత్తి 2.2 శాతం తగ్గి 7.233 ఎంటీగా ఉంది.



## త్వరలో పీసీఏ నుంచి ఐడీబీఐ బ్యాంక్ బయటకు..




**న్యూఢిల్లీ:** భారీ మొండిబాకీల రికవరీ, మరింత మూలధనం లభించడం తదితర అంశాల ఊతంతో ఐడీబీఐ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలోనే పీసీఏ ఆంక్షల పరిధి నుంచి బయటకు వచ్చే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే రుణాల మంజూరీపరమైన కొన్ని నిబంధనలను సడలించిందని వెల్లడించాయి. భారీ మొండిబాకీలు పేరుకుపోయిన ఐడీబీఐ బ్యాంక్ వంటి బ్యాంకులను సత్వర దిద్దుబాటు చర్యల (పీసీఏ) పరిధిలోకి చేరుస్తూ ఆర్‌బీఐ నిర్దిష్ట ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. ఐడీబీఐ బ్యాంకు నికర ఎన్‌పీఏలపరమైన నిబంధనను గట్టెక్కింది. నిర్దేశిత 6 శాతం లోపునకు వీటిని తగ్గించుకోగలిగింది. అటు ప్రభుత్వం, ఇటు ప్రమోటరు ఎల్ఐసీ సుమారు రూ. 9,300 కోట్ల మూలధనం సమకూరుస్తున్నాయి. ఎస్సార్ స్టీల్, భూషణ్ పవర్ అండ్ స్టీల్, అలోక్ ఇండస్ట్రీస్ వంటి ఖాతాలు పరిష్కారమై.. ఐడీబీఐ బ్యాంకునకు కొన్ని మొండి బాకీలు కూడా వసూలు కానున్నాయి. ఈ పరిణామాలన్నీ బ్యాంకుపై పీసీఏపరమైన ఆంక్షల తొలగింపునకు దోహదపడగలవని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## స్టాక్స్ వ్యూ

### ఓల్టాస్ | బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ | కొనొచ్చు


**ప్రస్తుత ధర: రూ.650** **టార్గెట్ ధర: రూ.765**




**ఎందుకంటే:** అమెరికా-చైనాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం ఈ కంపెనీకి ప్రయోజనం కలిగించనున్నది. అమెరికా ఆంక్షల కారణంగా చైనాలో యూసీపీ(యూనిటరీ కూలింగ్ ప్రొడక్ట్)ల నిల్వలు భారీగా పేరుకుపోయాయి. ఇప్పుడు ఆంక్షలు తొలగిపోవడంతో ఈ నిల్వలు తగ్గించుకోవడానికి చైనా కంపెనీలు భారీగా డిస్కౌంట్లను ఆఫర్ చేస్తాయని, ఈ డిస్కౌంట్ల కారణంగా యూసీపీ విభాగం నిర్వహణ లాభ మార్జిన్లు పెరుగుతాయని యాజమాన్యం భావిస్తోంది. ఉత్పత్తులకు తగ్గ ధరలను నిర్ణయించడం, పటిష్టమైన విడిభాగాల సమీకరణ, శక్తివంతమైన డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్,.... ఈ అంశాల కారణంగా ఈ కంపెనీ మార్కెట్ వాటా తగ్గే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్థభాగంలో రూమ్ ఏసీ వ్యాపారంలో అమ్మకాలు 42 శాతం పెరిగాయి. 24.4 శాతం మార్కెట్ వాటాను సాధించింది. ఈఎమ్‌పీ(ఎలక్ట్రో మెకానికల్ ప్రాజెక్ట్స్ అండ్ సర్వీసెస్) సెగ్మెంట్ వృద్ధి జోరుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్లో ఆర్డర్లు 125 శాతం ఎగసి రూ.2,600 కోట్లకు పెరిగాయి. దీంతో మొత్తం ఆర్డర్ బుక్ 38 శాతం వృద్ధితో రూ.6,570 కోట్లకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో కూడా ఆర్డర్లు భారీగానే వస్తాయని కంపెనీ అంచనా వేస్తోంది. టర్కీకు చెందిన ఆర్సెలిక్‌తో ఏర్పాటు చేసిన జాయింట్ వెంచర్ విభాగం ఉత్పత్తులు వచ్చే నెల నుంచి మార్కెట్లోకి రానున్నాయి. ముందుగా ఫ్రిజ్‌లను, ఆ తర్వాత వాషింగ్ మెషీన్లను అందుబాటులోకి తేనున్నది. ఈ ఉత్పత్తుల ధరలను ఎల్‌జీ, శామ్‌సంగ్ ఉత్పత్తుల కంటే 3 శాతం కంటే తక్కువగానే నిర్ణయించనుండటం సానుకూలాంశం.

### ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్ | బ్రోకరేజ్ సంస్థ: ఐసీఐసీఐ డైరెక్ట్ | హోల్డ్


**ప్రస్తుత ధర: రూ.1,720** **టార్గెట్ ధర: రూ.1,880**



**ఎందుకంటే:** లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్ అండ్ టీ) గ్రూప్‌నకు చెందిన ఈ ఐటీ కంపెనీ ఆదాయం 2017-19 కాలానికి 18 శాతం వృద్ధి చెందింది. 2016-17 ఆర్థిక సంవత్సరం రెండో క్వార్టర్‌లో మొత్తం ఆదాయంలో 26 శాతంగా ఉన్న డిజిటల్ విభాగం వాటా ఈ ఆర్థిక సంవత్సరం క్యూ2లో 40 శాతానికి పెరిగింది. ఈ క్యూ2లో ఆర్డర్లు 40 శాతం పెరగ్గా, 32 భారీ డీల్స్ సాధించింది. ఆ ఆర్థిక సంవత్సరం రెండో అర్థభాగంలో మరిన్ని భారీ డీల్స్ సాధించగలమని కంపెనీ ఆశిస్తోంది. అవసరమైన విభాగాల్లో భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఫలితంగా భారీ డీల్స్‌ను సాధిస్తోంది. పెద్ద పెద్ద కంపెనీలతో వ్యూహాత్మక భాగస్వామ్యాలను కుదుర్చుకుంటోంది. ఫలితంగా లాభ మార్జిన్లు కంపెనీ ఆశించిన స్థాయిల్లోనే (14-15 శాతం) ఉండనున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ నికర లాభం 36 శాతం, ఆదాయం 29 శాతం చొప్పున వృద్ధి చెందాయి. రానున్న కాలంలో ఎనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), మొబిలిటీ, 5జీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) తదితర విభాగాల్లో మంచి వృద్ధిని సాధించగలమని కంపెనీ భావిస్తోంది.ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పది లక్షల డాలర్ల ఆర్డర్లు ఇచ్చిన క్లయింట్ల సంఖ్య 137కు పెరిగింది. వచ్చే ఆర్థిక సంవత్సరం అంచనా ఈపీఎస్‌కు 16 రెట్ల ధరకు ఈ షేర్ ట్రేడవుతోంది. ఏడాది కాలంలో ఈ షేర్ రూ.1,880ను చేరగలదని భావిస్తున్నాం. క్లయింట్లకు కావలసిన సేవలపైననే దృష్టి సారించడం, ఆదాయంలో డిజిటల్ విభాగం వాటా పెరుగుతుండటం, భారీ డీల్స్ సంఖ్య పెరుగుతుండటం, ఒక పెద్ద క్లయింట్‌తో ఏర్పడిన వివాదం సద్దుమణగడం... ఇవన్నీ సానుకూలాంశాలు.

**గమనిక:** ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

## డబ్ల్యూఈఎఫ్ సదస్సుకు సన్నాహాలు




**న్యూఢిల్లీ:** వచ్చే నెలలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు జోరుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో కేంద్ర మంత్రులు పియూష్ గోయల్, మన్‌సుఖ్ మాండవీయతో పాటు ముగ్గురు ముఖ్యమంత్రులు (అమరీందర్ సింగ్, కమల్ నాథ్, బీఎస్ యడ్యూరప్ప), తెలంగాణ ఐటీ మంత్రి కేటీ రామారావు, 100 మందిపైగా భారతీయ సీఈవోలు పాల్గొననున్నారు. పారిశ్రామికవేత్తల్లో ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, రాహుల్ బజాజ్, కుమార మంగళం బిర్లా, ఆనంద్ మహీంద్రా మొదలైన వారు ఉన్నారు. అటు అగ్రరాజ్యాలు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా హాజరు కావొచ్చని అంచనా. అయితే, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ మాత్రం రాకపోవచ్చని తెలుస్తోంది. 2020 జనవరి 20-24 మధ్య డబ్ల్యూఈఎఫ్ 50వ వార్షిక సదస్సు జరగనుంది. మానసిక ఆరోగ్య ప్రాధాన్యతపై అపోహలు తొలగించి, అవగాహన పెంచేందుకు లివ్ లవ్ లాఫ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిన సినీ నటి దీపికా పదుకొణె.. ఈ సదస్సు తొలి రోజున ప్రతిష్టాత్మక క్రిస్టల్ అవార్డు అందుకోనున్నారు.

## కన్సార్షియం రుణాల పంపిణీపై కార్యాచరణ

### ఏప్రిల్ నాటికి సిద్ధం చేయనున్న ఐబీఏ



**న్యూఢిల్లీ:** బ్యాంకులు ఒక కూటమిగా ఏర్పడి మంజూరు చేసే రుణాల విషయంలో (కన్సార్షియం లెండింగ్) ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి కార్యాచరణను ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) వచ్చే ఏప్రిల్ నాటికి తయారు చేయనుంది. అలాగే, బ్యాంకులకు ప్రత్యామ్నాయ నిధుల మార్గాలపైనా దృష్టి సారించనుంది. ''ప్రస్తుతం కన్సార్షియంగా ఇచ్చే రుణాల విషయంలో నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) కోసం అన్ని బ్యాంకుల చుట్టూ రుణగ్రహీత తిరగాల్సి వస్తోంది. నిధులు పొందేందుకు ఆరు నెలలు లేదా ఏడాది, ఏడాదిన్నర కాలం కూడా పడుతోంది''అని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్‌కు అధ్యక్షత వహిస్తున్న ఎస్‌బీఐ చైర్మన్ రజనీష్ కుమార్ శనివారం ఢిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సకాలంలో నిర్ణయం తీసుకునే విధంగా కార్యాచరణ ఉండాలన్నారు. ఇందుకు పరిష్కారంగా ఐబీఏ స్థాయిలో, ఆర్‌బీఐ కూడా కార్పొరేట్ల రుణాల కోసం సెకండరీ మార్కెట్‌ను అభివృద్ధి చేయనున్నట్టు కుమార్ తెలిపారు.

# తగిన ఫండ్‌ను ఎలా ఎంచుకోవాలి ?

**Q & A**



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్



**నేను మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. నాకు తగిన ఫండ్‌ను ఎలా ఎంచుకోవాలి ?**

*-భారతి, విశాఖపట్టణం*

ఒక వ్యక్తి ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం ఎలాంటి ఫండ్‌ను ఎంచుకోవాలి అనే విషయం రకరకాల అంశాలపై ఆధారపడి ఉంటుంది. మీ ఆదాయం, వ్యయాలు, ఇప్పటికే ఉన్న అప్పులు, భవిష్యత్తు అవసరాలు, ఆర్థిక లక్ష్యాలు, వయస్సు, మీపై ఆర్థికంగా ఆధారపడి ఉన్న వాళ్లు, మీరు నెలకు ఎంత మేర ఇన్వెస్ట్ చేయగలరు? ఎంత కాలం ఇన్వెస్ట్ చేస్తారు? మీరు ఆదాయపు పన్ను పరిధిలోకి వస్తారా? ...ఇలా రకరకాల అంశాలను మదింపు చేసుకొని ఏ ఫండ్‌ను ఇన్వెస్ట్ చేయాలో నిర్ణయం తీసుకోవాలి. మీరు మ్యూచువల్ ఫండ్స్‌లో మొదటిసారిగా ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే, ముందుగా అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్స్‌ను ఎంచుకోవాలి. నెలకు కొంత మొత్తాన్ని సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేయాలి. ఇలా కనీసం రెండేళ్ల పాటు ఇన్వెస్ట్ చేస్తే, మీకు మార్కెట్ పట్ల, మార్కెట్లో చోటు చేసుకునే ఒడిదుడుకుల పట్ల, మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం.... తదితర అంశాల్లో ఒక స్పష్టత వస్తుంది. ఆ తర్వాత ఈక్విటీ ఫండ్స్‌ను ఎంచుకొని దీర్ఘకాలం పాటు ఇన్వెస్ట్ చేయవచ్చు. మీ పోర్ట్‌ఫోలియోలో కనీసం ఒక మల్టీక్యాప్ ఫండ్ అయినా ఉండాలి. ఇక మీరు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నట్లయితే, ఇన్వెస్ట్‌మెంట్ కోసం ట్యాక్స్ సేవింగ్స్ ఫండ్‌ను ఎంచుకోండి. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేటప్పుడు ఎప్పుడూ రెండు విషయాలు గుర్తుంచుకోవాలి. మొదటిది.. ఎప్పుడూ పెద్ద మొత్తాల్లో ఒకేసారి ఏ ఫండ్‌లోనూ ఇన్వెస్ట్ చేయకూడదు. రెండోది. మార్కెట్ పతన సమయంలోనూ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు సంబంధించిన సిప్‌లను ఆపకూడదు.

**నా వయస్సు 58 సంవత్సరాలు. నేను గత కొంత కాలం వరకూ ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ప్లాన్స్(ఎఫ్ఎమ్‌పీ)ల్లో రెగ్యులర్‌గా ఇన్వెస్ట్ చేసేవాడిని. కానీ ఇటీవల కాలంలో ఎఫ్ఎమ్‌పీల పనితీరు ఆశించిన స్థాయిలో లేదు. నేను ఇప్పుడు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాను. ఈ వయస్సులో ఈక్విటీ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం సమంజసమేనా ?**

*-కిరణ్ కుమార్, తిరుపతి*

ఈక్విటీ ఫండ్‌కు, ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ఫండ్‌కు చాలా తేడా ఉంది. ఎఫ్ఎమ్‌పీ ప్రధానంగా స్థిరాదాయ ఇన్వెస్ట్‌మెంట్ సాధనం. పైగా దీనికి మూడేళ్ల లాక్-ఇన్ పీరియడ్ ఉంటుంది. దీనిని బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌తో పోల్చవచ్చు. అయితే బ్యాంక్ ఎఫ్‌డీతో పోల్చితే ఎఫ్ఎమ్‌పీలు ఒకింత అధిక రాబడులను ఇస్తాయి. పైగా పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. ఇక ఎఫ్ఎమ్‌పీలతో పోల్చితే ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ తమ నిధుల్లో మూడో వంతు ఈక్విటీలో ఇన్వెస్ట్ చేస్తాయి. ఇంకో మూడో వంతు ఆర్బిటేజ్ సాధనాల్లో, మరో మూడో వంతు డెట్‌లోనూ ఇన్వెస్ట్ చేస్తాయి. ఆర్బిట్రేజ్ సాధనాలు దాదాపు లిక్విడ్ ఫండ్స్‌లాగానే ఉంటాయి. మొత్తం మీద ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్ దాదాపు (పూర్తిగా కాదు) స్థిరాదాయ సాధనాల లాగానే ఉంటాయి. అయినప్పటికీ, ఈ ఫండ్స్ రాబడుల్లో ఒడిదుడుకులు చోటు చేసుకుంటాయి. ఈ ఫండ్స్ విలువల్లో హెచ్చుతగ్గులూ తప్పవు. అయితే ఫిక్స్‌డ్ మెచ్యూరిటీ ఫండ్స్ రాబడుల కన్నా ఈక్విటీ సేవింగ్స్ రాబడులు అధికంగానే ఉంటాయనే చెప్పవచ్చు. మీరు ఇన్వెస్ట్ చేసే మొత్తం మరో మూడేళ్ల పాటు అవసరం లేని పక్షంలోనే మీరు ఈక్విటీ సేవింగ్స్ ఫండ్‌ను ఎంచుకోవడం మంచిది.

**నేను ఇటీవలనే ఒక జీవిత బీమా పాలసీ తీసుకున్నాను. దీనికి కొన్ని రైడర్స్ తీసుకుంటే మంచిదని స్నేహితులంటున్నారు. ఏ ఏ రైడర్స్ తీసుకోవాలి?**

*-కరీముల్లా, హైదరాబాద్*

అదనపు ప్రయోజనాలు పొందడం కోసం రైడర్స్ తీసుకుంటే బీమా కవరేజ్‌ను పెంచుకోవచ్చు. రైడర్స్ తీసుకోవడం వల్ల మీరు చెల్లించే ప్రీమియమ్ పెరిగినప్పటికీ, బీమా కవరేజ్ పెరుగుతుంది. కాబట్టి తీసుకోవచ్చు. ఇలా తీసుకునే జీవిత బీమా రైడర్స్‌కు ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80 సీ కింద పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి. (సెక్షన్ 80 సి కింద మొత్తం పన్ను ప్రయోజనాలు రూ. లక్షన్నర వరకూ మాత్రమే వర్తిసాయి). ఇక అన్ని రకాల బీమా పాలసీలకు-ఎండోమెంట్, మనీ బ్యాంక్, హోల్ లైఫ్, యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌లకు కూడా రైడర్స్‌ను జత చేసుకోవచ్చు. యాక్సిడెంటల్ డెత్ బెనిఫిట్, క్రిటికల్ ఇల్‌నెస్ బెనిఫిట్, వేవర్ ఆఫ్ ప్రీమియమ్, గ్యారంటీడ్ ఇన్సూరబిలిటీ, డిసెబిలిటీ ఇన్‌కమ్... ఇలా రకరకాల రైడర్లు అందుబాటులో ఉన్నాయి. మీరు చెల్లించే ప్రీమియమ్‌లో 5-10 శాతం మేర రైడర్ వ్యయం ఉంటుంది. అయితే మీ ప్రీమియమ్‌లో 30 శాతం మించకుండా మాత్రమే రైడర్లు ఉండేలా జాగ్రత్త పడండి. చాలా రైడర్లు అందుబాటులో ఉంటాయి. కాబట్టి ఏ రైడర్‌ను తీసుకోవాలో కొంత గందరగోళం ఉంటుంది. మరోవైపు కమీషన్ అధికంగా వస్తుంది కాబట్టి బీమా ఏజెంట్లు వీలైనన్ని రైడర్లు అంటగట్టటానికి ప్రయత్నిస్తారు. అందుకని మీకు అవసరమైన రైడర్‌నే ఎంచుకోండి.




## రూ. 1.72 లక్షల కోట్ల బకాయిలు కట్టండి

### గెయిల్ ఇండియాకు టెలికం విభాగం లేఖ

**న్యూఢిల్లీ:** ఇంటర్నెట్ సర్వీస్ లైసెన్సు (ఐఎస్‌పీ) ఫీజులు తదితర బాకీలకు సంబంధించి ఏకంగా రూ. 1.72 లక్షల కోట్లు కట్టాలంటూ ప్రభుత్వ రంగ గెయిల్ ఇండియాకు టెలికం విభాగం లేఖ పంపింది. ఐపీ-1, ఐపీ-2, ఐఎస్‌పీ లైసెన్సు ఫీజుల బకాయిల కింద రూ. 1,72,655 కోట్లు చెల్లించాలని ఇందులో సూచించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే, ఇప్పటికే కట్టాల్సినదంతా కట్టేశామని.. ఇక చెల్లించాల్సిన బాకీలంటూ ఏమీ లేవని గెయిల్ ప్రత్యుత్తరంలో పేర్కొన్నట్లు వివరించాయి. 2002లో తీసుకున్న ఐఎస్‌పీ లైసెన్సు గడువు 2017తో తీరిపోయిందని గెయిల్ తెలిపింది. అసలు దీనితో వ్యాపారమేమీ చేయనందున ఆదాయార్జన ప్రసక్తే లేదని పేర్కొంది. ఇక ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ కేటగిరీ 1, 2 కింద తీసుకున్న లైసెన్సులపై 2001-02 నుంచి రూ. 35 కోట్లు మాత్రమే ఆదాయం వచ్చిందని.. టెలికం విభాగం చెబుతున్నట్లుగా రూ. 2,49,788 కోట్లు కాదని స్పష్టం చేసింది. మరోవైపు, టెలికం విభాగం అడుగుతున్న మొత్తం .. గెయిల్ కంపెనీ విలువకు ఏకంగా మూడు రెట్లు ఉంటుందని సంస్థ వర్గాలు వ్యాఖ్యానించాయి. టెలికంయేతర వ్యాపారాల ద్వారా వచ్చిన రెవెన్యూను కూడా ఆదాయం కిందే లెక్కించి, దాన్ని బట్టి లైసెన్సు ఫీజు, స్పెక్ట్రం యూసేజీ చార్జీల బాకీలను కట్టాలంటూ టెల్కోలను ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశించింది. తాజాగా ఇదే ప్రాతిపదికన బాకీలు కట్టాలంటూ గెయిల్‌ను టెలికం విభాగం ఆదేశించింది.



వరంగల్ అర్బన్ జిల్లా కాజీ పేటలోని బిషప్ బెరెట్టా మైదానంలో ఆదివారం 'ఓరుగల్లు నృత్యోత్సవం -2019' పేరుతో గిన్నిస్ రికార్డు కోసం శ్రీ కృష్ణ మ్యూజిక్, డ్యాన్స్ స్కూల్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లంబాడా డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ నిరుద్యోగులకు ఉపాధి శిక్షణ

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్, ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ (ఐటీఐ లిమిటెడ్) సమన్వయంతో ఎస్సీ నిరుద్యోగ యువతకు శిక్షణతో కూడిన ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఐటీఐ లిమిటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2016–2019 మధ్య కాలంలో డిగ్రీ లేదా బీటెక్ పూర్తి చేసిన అభ్యర్థులకు ఇంజనీర్, టెక్నికల్ సపోర్టు, జనరల్ ఆఫీస్ అసిస్టెంట్, అడ్మినిస్ట్రేషన్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపింది. ఆసక్తిగల అభ్యర్థులు ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో బోడుప్పల్‌లోని ఐటీఐ లిమిటెడ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 7893985821, 8985034503, 9666366708 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించింది.

## 29, 30 తేదీల్లో యూటీఎఫ్ విద్యా సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విద్యా సదస్సు, విస్తృత కార్యవర్గ భేటీని ఈనెల 29, 30 తేదీల్లో ఆదిలాబాద్‌లో నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ తెలిపింది. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆదివారం ఫెడరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ఆవిష్కరించారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాములు, చావ రవి మాట్లాడుతూ.. ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితా, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రొఫెసర్లు మాడభూషి శ్రీధర్, కె.నాగేశ్వర్ తదితరులు పాల్గొననున్నారని వివరించారు.

SI & కానిస్టేబుల్స్
E/M & T/M New Batch 23-12-19
Non Maths General Studies
9848458639 Whatsapp
Toppers INSTITUTE Opp. Indian Oil Petrol Bunk, Medipaly, Uppal, Hyd. 9652578639

# పసిబిడ్డ పునర్జన్మ కోసం..

- పదకొండు నెలల జింబాబ్వే శిశువుకు నగరంలో చికిత్స
- శిశువుకు పునర్జన్మను ప్రసాదించిన కిమ్స్ వైద్యులు



చిన్నారి, తల్లి నోరాతో డాక్టర్ అనిల్‌కుమార్

**సాక్షి, హైదరాబాద్:** పుట్టుకతోనే హృద్రోగ సమస్యతో మృత్యువుతో పోరాడుతున్న నెలల పసిగుడ్డైన తన కొడుకును కాపాడుకునేందుకు ఓ తల్లి సుదూరాల తీరం దాటి నగరానికి తీసుకొచ్చింది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి యోజనాల దూరం దాటి ఇక్కడకు తీసుకొచ్చిన కన్నపేగు బంధం నగర వైద్యుల్లో తమ సంకల్ప బలాన్ని మరింత రెట్టింపు చేసింది. సుమారు 20 గంటలపాటు డాక్టర్లు ఎంతో శ్రమించి చికిత్స చేసి ఆ పసిబిడ్డకు పునర్జన్మను ప్రసాదించారు. ఎప్పుడైనా... ఎక్కడైనా అమ్మ ప్రేమకు సాటి రానిదేదీలేదంటూ మరోసారి రుజువు చేసింది ఈ ఘటన. ఓ వైపు ఆ తల్లి వేదనను తీర్చడంతోపాటుగా మరోవైపు అతిక్లిష్టమైన చికిత్సను చేసి శిశువుకు ప్రాణం పోసి అంతర్జాతీయంగా నగర ఖ్యాతిని మరింత ఇనుమడింపజేసింది కిమ్స్ వైద్య బృందం. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కిమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ అనిల్ కుమార్ ఆదివారం మీడియాకు వెల్లడించారు.

### ఆయాసం..గుక్కపట్టి ఒక్కటే ఏడుపు

జింబాబ్వేకు చెందిన నోరా సిటుంబెకో పదకొండు నెలల క్రితం ఓ మగ శిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన తర్వాత శిశువు సరిగా పాలు తాగకపోవడంతో పాటు ఆయాసం, గుక్కపట్టి ఏడవటం వంటి సమస్యలతో బాధపడుతుండటంతో తల్లి నోరా చికిత్స కోసం స్థానికంగా ఉన్న పలువురు వైద్యులను ఆశ్రయించింది. పరీక్షించిన వైద్యు లు శిశువు క్లిష్టమైన హృద్రోగ సంబంధిత సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. జింబాబ్వేలో నిపుణులు లేకపోవడంతో వారు హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. దీంతో తల్లి నోరా తన బిడ్డతో గత నెల నగరం చేరుకుంది.

### యూనిఫోకలైజేషన్ పద్ధతిలో చికిత్స

ఆస్పత్రికి చెందిన చిన్నపిల్లల గుండె చికిత్సల వైద్య నిపుణుడు డాక్టర్ అనిల్‌కుమార్ శిశువును పరీక్షించారు. 2డీఎకో, ఈసీజీ, ఆల్ట్రాసౌండ్ సహా పలు వైద్య పరీక్షలు చేశారు. గుండె కుడి జఠరిక నుంచి ఊపిరితిత్తులకు రక్తం సరఫరా చేసే రక్తనాళం లేకపోవడంతో పాటు ఎడమ ఊపిరితిత్తులకు రావాల్సిన రక్తనాళాల శాఖలు కూడా చాలా చిన్నగా ఉన్నట్లు గుర్తించారు. అయితే ఊపిరితిత్తులకు అసాధారణంగా మాప్కాస్ అనే నాళాల నుంచి రక్తం సరఫరా అవుతుండటమే శిశువు హృద్రోగ సమస్యకు కారణంగా గుర్తించారు. వైద్య పరిభాషలో 'పల్మనరీ ఆట్రిషియా'గా పిలుస్తారు. శిశువు ఆరోగ్యాన్ని కాపాడేందుకు క్లిష్టమైన యూనిఫోకలైజేషన్ అనే ప్రక్రియన వైద్యులు ఎంచుకున్నారు. గుండె వెనుక నుంచి వచ్చే అయోటా నుంచి మాప్కాస్‌లను తప్పించి, గుండె నుంచి నేరుగా ఊపిరితిత్తులకు ప్రత్యామ్నాయంగా రక్తనాళాలు ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

### చికిత్సకు 20 గంటలకుపైనే

చికిత్సకు సుమారు 20 గంటలకు పైనే పట్టినట్లు డాక్టర్ అనిల్‌కుమార్ ప్రకటించారు. ఇలాంటి సమస్యలు పిల్లల్లో చాలా అరుదుగా వెలుగు చూస్తుంటాయని, సమస్యను గుర్తించడంతో పాటు చికిత్స కూడా చాలా క్లిష్టమైందని, చికిత్స తర్వాత శిశువు కోలుకోవడానికి రెండు వారాలకుపైగా పట్టిందని తెలిపారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం మెరుగుపడటంతో ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు ప్రకటించారు. తల్లి నోరా మాట్లాడుతూ...తన కొడుకుని ప్రాణాలతో చూస్తానని ఊహించలేదని చెప్పారు. తన కుమారునికి పునర్జన్మను ప్రసాదించిన వైద్యులకు ఎంతో రుణపడి ఉంటానని పేర్కొన్నారు.

MARUTI SUZUKI NEXA

CREATE NEW EXPERIENCES WITH THE BEST OFFERS OF THE YEAR.
Avail great year-end offers before the stock runs out.



LIMITED PERIOD OFFERS ONLY
VALID TILL 31st DECEMBER 2019

| BRAND | BALENO (P) | BALENO (D) | IGNIS | S-CROSS | CIAZ (P) | CIAZ (D) |
|---|---|---|---|---|---|---|
| CONSUMER OFFER* | ₹25 000 | ₹25 000+5 YEAR WARRANTY | ₹30 000 | ₹50 000+5 YEAR WARRANTY | ₹25 000 | ₹40 000+5 YEAR WARRANTY |
| EXCHANGE OFFER | ₹15 000 | ₹15 000 | ₹25 000 | ₹40 000 | ₹40 000 | ₹40 000 |
| CORPORATE OFFER | ₹5 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 |
| TOTAL SAVINGS# | ₹45 000 | ₹67 400 | ₹65 000 | ₹1 22 900 | ₹75 000 | ₹1 12 700 |

Contact us at 1800-200-[6392] 1800-102-[NEXA]
WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9133398806),
KARIMNAGAR: NEXA RAMPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897096633),
NIZAMABAD: NEXA NIZAMABAD EAST (VARUN MOTORS PH: 9160991616),
NALGONDA: NEXA NALGONDA NORTH (PAVAN MOTORS PVT LTD PH: 9100051403).
*Offer may vary from variant to variant. #Total savings include Consumer Offer + Exchange Offer + Highest Corporate Offer and a 5-year warranty (2-year standard warranty + 3-year extended warranty) on all NEXA Diesel cars.
connect — Offered separately as Genuine NEXA Accessory




Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G, and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

epaper.sakshi.com